www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

నేడే మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఫలితాలు


రాంచీలోని ఈవీఎంల స్ట్రాంగ్ రూం వద్ద పోలీసు భద్రత

మహారాష్ట్రలో 26తో ముగియనున్న ప్రస్తుత సర్కారు కాల పరిమితి
హంగ్ ఏర్పడితే కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు చాలని వ్యవధి
2
రాష్ట్రపతి పాలనకు చాన్స్?.. హోటళ్లను బుక్ చేసిన శివసేన
కొనుగోలుదార్ల నుంచి రక్షణకే: రౌత్.. కూటముల్లో 'సీఎం సీటు' కుస్తీలు
మళ్లీ ఝార్ఖండ్ సీఎం అవుతాననే ధీమాలో హేమంత్ సోరెన్
బరిలో సీఎం సతీమణి కల్పన కూడా.. అధికారం తమదేనంటున్న బీజేపీ

శనివారం | 23-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 235
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి రా. 7.57 తదుపరి నవమి; నక్షత్రం: మఖ రా. 7.27 తదుపరి పుబ్బ; వర్జ్యం: శే.ఉ.8.03, తె.4.23-6.10; దుర్ముహూర్తం: ఉ.6.28-7.57; అమృతఘడియలు: సా.4.49-6.34; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.28; సూర్యాస్తమయం: 5.34 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

6 కంపెనీలు.. 5260 కోట్ల పెట్టుబడులు

ఫార్మాసిటీలో పరిశ్రమల ఏర్పాటుకు దిగ్గజ సంస్థల ఒప్పందాలు.. 12,490 మందికి ఉద్యోగ అవకాశాలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు హర్షం

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ముచ్చర్లలో ఏర్పాటు చేయనున్న కాలుష్యరహిత ఫార్మాసిటీలో రూ.5,260 కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు ఆరు దిగ్గజ ఫార్మా సంస్థలు డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, అరబిందో ఫార్మా, హెటిరో ల్యాబ్స్, గ్లాండ్ ఫార్మా, ఎంఎస్ఎన్ గ్రూప్, లారస్ ల్యాబ్స్ సిద్ధమయ్యాయి. ఈమేరకు శుక్రవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయా సంస్థల ప్రతినిధులు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన కంపెనీలు భారీ పెట్టుబడులు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ పెట్టుబడులతో ఫార్మా రంగంలో కొత్తగా 12,490 మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. "టీకాలు, ఔషధాల తయారీలో హైదరాబాద్ ఇప్పటికే


మిగతా 13వ పేజీలో...


సచివాలయంలో ఫార్మా కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు తదితరులు

పనులెలా జరుగుతున్నాయ్!
తెలంగాణ తల్లి విగ్రహ నిర్మాణ పనుల కూలీలతో మాట్లాడిన సీఎం రేవంత్

మధ్యవర్తిత్వంతో చౌకగా పరిష్కారం
ఇరుపక్షాలకు నచ్చిన పద్ధతుల్లో తేల్చవచ్చు
సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్
మధ్యవర్తిత్వంతో కేసుల భారం తగ్గుతుంది
మీడియేషన్- ఆర్బిట్రేషన్ జాతీయ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి
13

ప్రజా విజయోత్సవాల్లో ప్రగతి నివేదిక
ప్రతిపక్షాల విమర్శలకు దాంట్లోనే జవాబు
ఏడాది పాలనలో ఏం చేశారో చెబుతారు
శాఖల వారీగా వ్యయం వివరాల సేకరణ



'అనర్హత'పై తగిన వ్యవధిలో
తీర్పు ఇవ్వండి

పిటిషన్లు ఎప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్నాయి?
రాజ్యాంగంలో పదో షెడ్యూల్‌ను చేర్చిన ఉద్దేశమేంటి?
ప్రస్తుత అసెంబ్లీ కాలపరిమితి ఎంత ఉంది?
ఈ మూడింటినీ దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకోండి
పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్‌కు హైకోర్టు ఆదేశాలు.. సింగిల్ జడ్జి ఆదేశాల కొట్టివేత

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తగిన సమయం (రీజనబుల్ టైం)లో తప్పకుండా నిర్ణయం తీసుకొని, తుది తీర్పు ఇవ్వాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రీజనబుల్ టైం అంటే ఎప్పుడు అనే దానికి సంబంధించి మూడు అంశాలను దృష్టిలో ఉంచుకోవాలని స్పష్టం చేసింది. 'తన ఎదుట దాఖలైన అనర్హత పిటిషన్లు ఎప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్నాయి? ట్రైబ్యునల్ చైర్మన్‌గా స్పీకర్‌కు విశేషమైన అధికారాలను కట్టబెడుతూ పదో షెడ్యూల్‌ను రాజ్యాంగంలో ఏ ఉద్దేశంతో చేర్చారు? ప్రస్తుత అసెంబ్లీ కాలపరిమితి ఎంత? అనే అంశాలను దృష్టిలో ఉంచుకుని అనర్హత పిటిషన్లపై తగిన సమయంలో నిర్ణయం తీసుకోండి' అని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన మూడు అప్పీళ్లపై శుక్రవారం తుది తీర్పు జారీచేసింది. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి.. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పీకర్ ఎదుట అనర్హత పిటిషన్‌లు దాఖలు చేశారు. అయితే, వారి అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదంటూ హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద రిట్ పిటిషన్‌లు దాఖలు చేశారు. వాటిపై సుదీర్ఘంగా విచారించిన ఏకసభ్య ధర్మాసనం.. నాలుగు వారాల్లో

మిగతా 11వ పేజీలో...

సుప్రీంకోర్టులో సవాల్ చేస్తాం
బీఆర్ఎస్

అదానీ.. దారెటు?



నేరం రుజువైతే అమెరికాలో పాతికేళ్ల జైలు శిక్ష

లంచం ఇచ్చినందుకు ఐదేళ్లు.. మోసం కింద 20 ఏళ్ల వరకు..
అమెరికా-భారత్ మధ్య నేరగాళ్ల అప్పగింత ఒప్పందం
దీని ప్రకారం అదానీని అప్పగించాలని అమెరికా కోరే చాన్స్
క్యాపిటల్ మార్కెట్ అక్రమాలపై కఠినంగా ఆ దేశ చట్టాలు
అడిగితే అప్పగించక తప్పదు.. ఇండో అమెరికన్ లాయర్ రవిబాత్రా
అప్పీలుకు అదానీకి అవకాశం.. ఒప్పందాలు, జరిమానా చెల్లింపుల ద్వారా రాజీకి అనుమతిస్తున్న అమెరికా చట్టాలు
ఇది సుదీర్ఘ ప్రక్రియ అంటున్న న్యాయ నిపుణులు

న్యూయార్క్, నవంబరు 22: లంచాలు, మోసం అభియోగాలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూపు అధినేత గౌతమ్ అదానీని అప్పగించాలని అమెరికా కోరుతుందా? ఆయన అరెస్టు తప్పదా? నేరం రుజువైతే ఎన్నేళ్ల జైలు శిక్ష పడుతుంది? ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు! సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకునేందుకు రాష్ట్రాలకు అదానీ గ్రూప్ రూ.2029 కోట్ల లంచాలు వెదజల్లిందని అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్, న్యాయ విభాగం, ఎఫ్‌బీఐ నిర్ధారించిన సంగతి తెలిసిందే. దీనిపై న్యూయార్క్ కోర్టులో అభియోగాలు కూడా నమోదయ్యాయి. ఆయనపై కోర్టు అరెస్టు వారెంటు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అదానీని తమకు అప్పగించాలని అమెరికా కోరే అవకాశాలు ఉన్నాయని భారతీయ అమెరికన్ న్యాయవాది రవి బాత్రా వెల్లడించారు. అమెరికాలో అదానీ సహా 8 మంది ఎదుర్కొంటున్న ఈ కేసు మరింత తీవ్రతరం కావచ్చని

మిగతా 2వ పేజీలో...

సెబీ దర్యాప్తు!
2
అమెరికా లంచం కేసులో అదానీ గ్రీన్‌ఎనర్జీపై విచారణ
వాకబు చేయాలని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఆదేశాలు జారీ
అదానీ కంపెనీలను ఇప్పటికే వివరణ కోరిన ఎక్స్ఛేంజ్‌లు

ఏపీ ప్రతిష్ఠకు జగన్ ముడుపుల మసక!
న్యాయ నిపుణుల అభిప్రాయం మేరకు జగన్ ప్రాసిక్యూషన్
జగన్ అవినీతిని పార్లమెంటులో ఎండగట్టాలి 11
టీడీపీ ఎంపీలతో చంద్రబాబు
స్టాక్ మార్కెట్ వారాంతం ట్రేడింగ్‌లో అదానీ షేర్లకు మిశ్రమ ఫలితాలు 12

భారత్ అమెరికా సంబంధాలు బలంగానే ఉన్నాయి: వైట్‌హౌస్

ఆ లంచం ఖరీదు.. 72 వేల కోట్లు!
రూ.1,750 కోట్ల ముడుపుల కోసం ఏపీ ప్రజలపై జగన్ భారం
ఒప్పందం మేరకు విద్యుత్తు సరఫరా చేయని 'అదానీ'
2021-24 మధ్య మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు
ఆ భారం రూ.42 వేల కోట్లు..
ట్రూఅప్ చార్జీల పేరుతో బాదుడు
ట్రాన్స్‌మిషన్ చార్జీల భారం 30,660 కోట్లు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)
ఒకరి అవినీతి.. మరొకరి అత్యాశ! ఈ రెండూ కలిపి ఏపీ ప్రజలను వేలకోట్లకు ముంచేశాయి. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల కోసం అదానీ గ్రూప్ జగన్‌కు సమర్పించిన ముడుపులు రూ.1750 కోట్లని అమెరికా నిగ్గు తేల్చింది. అయితే.. వారి లంచాల బంధం కారణంగా ఏపీ ప్రజలపై పడ్డ భారం ఎంతో తెలుసా? దాదాపుగా రూ.72 వేల కోట్లు. అంతేనా.. ఒప్పందం కుదుర్చుకున్నా అదానీ సంస్థ ఆ విద్యుత్తును సరఫరా చేయనేలేదు. దీంతో 2021 నుంచి 24 వరకు

మిగతా 11వ పేజీలో...

ఇన్‌ఫార్మర్ల నెపంతో..
ఇద్దరి దారుణహత్య



మృతులు రమేశ్, అర్జున్ (ఫైల్)

ములుగు జిల్లా వాజేడులో నక్సల్స్ ఘాతుకం
కుటుంబ సభ్యుల ముందే గొడ్డళ్లు, కత్తులతో దాడి
మృతులిద్దరూ ఒక కుటుంబానికి చెందినవారు
ఒకరు పంచాయతీ కార్యదర్శి, మరొకరు కూలీ

వాజేడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా వరుసగా ఎదురుదెబ్బలు తింటున్న మావోయిస్టులు గురువారం రాత్రి ఇద్దరు వ్యక్తుల్ని హతమార్చి ఒక్కసారిగా అలజడి సృష్టించారు. తమ సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారన్న నెపంతో ములుగు జిల్లా వాజేడు మండలానికి

మిగతా 14వ పేజీలో...

బిహార్ నుంచి గన్స్.. నలుగురి అరెస్టు
14
4 పిస్టళ్లు, బుల్లెట్లు స్వాధీనం
ఉమ్మడి కర్నూలు జిల్లాలో జనశక్తి పునర్నిర్మాణానికి నిందితుల ప్లాన్
ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్
10 మంది మావోయిస్టుల మృతి

కాళేశ్వరంపై విచారణకు కేసీఆర్‌ను పిలవడం తథ్యం!
14
25 నుంచి అధికారుల విచారణ.. ఆ తర్వాత కేసీఆర్
నాటి సాగునీటి మంత్రి హరీశ్‌రావుకూ పిలుపు?



నాగాహిల్స్‌లో కబ్జానాగులు!

రూ.2 వేల కోట్ల విలువైన భూముల్లో పాగా

సుప్రీంలో కేసు గెలిచినా యజమానులకు దక్కని భూమి
ధరణి లొసుగులతో చెరబట్టిన మాఫియా
ఎల్ఆర్ఎస్ ఇచ్చిన ప్లాట్లకు పాస్‌బుక్‌ల జారీ
డెవలప్‌మెంట్ పేరుతో కబ్జాదారుల అధీనంలోకి ప్లాట్లు
సొసైటీలో కొందరిని లోబరుచుకొని అడ్డగోలుగా కబ్జా
మాట వినని సభ్యులకు బెదిరింపులు
లే అవుట్ ప్రాంతం ధ్వంసం.. బౌన్సర్లతో పహారా

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)
హైదరాబాద్ నడిబొడ్డున రూ.2వేల కోట్ల విలువ చేసే భూమి. పైగా మధ్యతరగతికి చెందినవారి చేతిలో ఉంది. ఇంకేం..! భూ బకాసురులు కన్నుపడకుండా ఉంటుందా? రాయదుర్గంలోని నాగాహిల్స్ వెంచర్ విషయంలో ఇదే జరిగింది. 33 ఏళ్ల క్రితం చేసిన ఈ వెంచర్‌లో కొనుక్కున్న ప్లాట్లను యజమానుల నుంచి లాగేసుకునేందుకు భూమాఫియా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తోంది. తొలుత గత ప్రభుత్వంలోని కొందరు పెద్దల అండతో.. ఆ భూమి సర్కారుదేనని చెప్పించారు. కోర్టు తీర్పులతో ఆ ప్రయత్నం విఫలమవడంతో గతంలో భూమిని అమ్మినవారి వారసులను రంగంలోకి దించారు. అప్పటికే ఎల్ఆర్ఎస్ ఆమోదం పొంది, రోడ్డు విస్తరణలో కోల్పోయిన స్థలానికి ప్రభుత్వం టీడీఆర్ కూడా చెల్లించిన భూమికి.. ధరణిలోని లొసుగుల ఆధారంగా తిరిగి పాస్‌పుస్తకాలు సంపాదించారు. వాటి ఆధారంగా భూమిని

మిగతా 13వ పేజీలో...

భారతీయ సంస్కృతికి
విశ్వవ్యాప్త గౌరవం!



లోక్‌మంథన్ ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి ముర్ము, గవర్నర్, కిషన్‌రెడ్డి

విదేశీ దండయాత్రల వల్ల మన సంస్కృతి ధ్వంసమైంది
మనలోని బానిస భావాల్ని తొలగించుకుంటున్నాం
దేశం అభివృద్ధి చెందాలంటే ప్రతి భారతీయుడు దేశమే మిన్న అనే భావనతో ఎల్లప్పుడూ ఉండాలి 10
భిన్నత్వంలో ఏకత్వం.. ఇంద్రధనుస్సు వంటిది: ముర్ము
లోక్‌మంథన్-2024ను ప్రారంభించిన రాష్ట్రపతి
గిరిజనుల జీవన విధానంపై చర్చ జరగాలి: కిషన్‌రెడ్డి



కొన్నిసార్లు మనసు చంపుకొని పనిచేయాల్సి వస్తుంది!
3
ఆక్రమణల తొలగింపులో అది తప్పదు
చెరువుల్లో నిర్మాణాలు ఎవరివైనా కూల్చేస్తాం
ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు కమిటీ: రంగనాథ్

ఢిల్లీకి ఆప్ ఆరు గ్యారంటీలు



న్యూఢిల్లీ, నవంబరు22: అతి త్వరలో ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటర్లకు ఆరు గ్యారంటీలిచ్చింది. ఉచిత్ విద్యుత్, ఉచిత నీరు, ఉచిత చదువు(ప్రభుత్వ పాఠశాలల్లో పది వరకు), ఉచిత వైద్యం(మొహల్లా క్లీనిక్‌లు, ప్రభుత్వ ఆసుపత్రులు), మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు ప్రతినెలా వెయ్యి రూపాయలు, వృద్ధులకు ఉచిత తీర్థయాత్రల ఏర్పాట్లు చేస్తామని ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. 'రేవ్‌డీపే చర్చ' పేరిట పార్టీ ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. బీజేపీ అధికారంలోకి వస్తే తాము ఇస్తున్న ఉచిత పథకాలన్నీ ఆగిపోతాయన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ ఈ ఉచిత పథకాలు ఇవ్వడం లేదని, ఆ పార్టీ నేతలకు ఉచితంగా ఇవ్వాలనే మనసే లేదని కేజ్రీవాల్ ఆరోపించారు. ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే ఆయన 11 మంది అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటించారు. తొలి జాబితాలో బీజేపీ, కాంగ్రెస్ నుంచి వచ్చి ఆప్‌లో చేరిన నేతల పేర్లున్నాయి.

ఎమర్జెన్సీ నాటి నిర్ణయాలన్నీ తప్పని చెప్పలేం: సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 22: ఎమర్జెన్సీ సమయంలో పార్లమెంటు తీసుకున్న నిర్ణయాలన్నింటినీ చట్టవ్యతిరేకమని చెప్పలేమని శుక్రవారం సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అప్పటి నిర్ణయాలపై దర్యాప్తు చేస్తూ పోలేమని తెలిపింది. 1976లో రాజ్యాంగ సవరణ చేసి పీఠికలో 'సామ్యవాద', 'లౌకికవాద', 'సమగ్రత' అన్న పదాలను చేర్చడంపై ఇప్పటికే న్యాయ సమీక్షలు జరిగాయని గుర్తు చేసింది. రాజ్యాంగ పీఠికలో సామ్యవాద, లౌకికవాద అన్న పదాలను చేర్చడాన్ని సవాలు చేస్తూ రాజ్యసభ మాజీ సభ్యుడు సుబ్రహ్మణ్య స్వామి, బీజేపీ నాయకుడు అశ్విన్ కుమార్ ఉపాధ్యాయ, న్యాయవాది విష్ణు శంకర్ జైన్‌లు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారణ పూర్తి చేసి తీర్పును 25వ తేదీకి వాయిదా వేసింది. అత్యయిక పరిస్థితి సమయంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా పీఠికలో సామ్యవాద, లౌకిక, సమగ్రత అన్న పదాలను చేర్చారు. విచారణ సందర్భంగా న్యాయవాది జైన్ మాట్లాడుతూ 'సామ్యవాదం' అన్న పదానికి నిర్దిష్టమైన అర్థం లేదని చెప్పారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండానే ఈ పదాలను జోడించారని తెలిపారు. పీఠికను సవరించే అధికారం రాజ్యాంగ పరిషత్‌కు తప్ప పార్లమెంటుకు లేదని వాదించారు. సుబ్రహ్మణ్య స్వామి తన పిటిషన్‌లో... రాజ్యాంగం 1949 నవంబరు 26 నుంచి అమల్లోకి వస్తున్నట్టు పీఠికలో పేర్కొన్నారని, కానీ 1976లో లౌకికవాదం, సామ్యవాదం అన్న పదాలను చేర్చారని తెలిపారు. అమలు తేదీని మార్చకుండా కొత్తగా పదాలను చేర్చవచ్చా అని ప్రశ్నించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ..పీఠిక కూడా రాజ్యాంగంలో అంతర్భాగమేనని పేర్కొంది. 368 అధికరణం ద్వారా రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు దఖలు పడిందని, పీఠికను కూడా అది సవరించవచ్చని తెలిపింది. "మనదేశంలో సామ్యవాదానికి ఉన్న అర్థం భిన్నమైనది. మన దగ్గర సామ్యవాదం అంటే 'సంక్షేమ రాజ్యం'. అది ప్రయివేటు రంగాన్ని అడ్డుకోలేదు. దేశంలో ప్రయివేటు రంగం వర్ధిల్లుతోంది. దాని ద్వారా అందరం లబ్ధి పొందుతున్నాం" అని పేర్కొంది. సంక్షేమ రాజ్యంలో అందరికీ సమాన అవకాశాలు కలిగించాల్సి ఉందని, అందరి సంక్షేమాన్ని చూడాల్సి ఉందని తెలిపింది.

మణిపూర్‌కు మరో 10 వేల మంది భద్రతా సిబ్బంది

ఇంఫాల్, న్యూఢిల్లీ, నవంబరు 22: కల్లోలిత మణిపూర్ రాష్ట్రానికి మరో 10 వేలమందికిపైగా భద్రతా సిబ్బందిని పంపాలని కేంద్రం నిర్ణయించింది. ఈమేరకు ఆ రాష్ట్ర ముఖ్య భద్రతా సలహాదారు కుల్దీప్ సింగ్ ఇంఫాల్‌లో శుక్రవారం విలేకరులకు తెలిపారు. దీంతో మొత్తం 288 కంపెనీల భద్రతా సిబ్బందిని ఆ రాష్ట్రంలో మోహరించినట్లు అవుతుంది. మణిపూర్‌లో సున్నిత ప్రాంతాల్లో ఈ సిబ్బందిని నియమించనున్నట్లు సింగ్ వెల్లడించారు. మరోవైపు, మణిపూర్‌లో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభ పరిస్థితులకు గత కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. మణిపూర్‌లో హింసాత్మక ఘటనలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే మంగళవారం రాష్ట్రపతికి లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనికి జేపీ నడ్డా శుక్రవారం ఖర్గేకు కౌంటర్ లేఖ రాశారు. దేశంలోకి విదేశీ మిలిటెంట్ల వలసలను కాంగ్రెస్ ప్రభుత్వం చట్టబద్ధం చేసిందని, వారితో ఒప్పందాలు చేసుకుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో మణిపూర్ చరిత్రలోనే అత్యంత రక్తపాత కాలాన్ని చూసిందని నడ్డా అన్నారు.

పురుగు మందు గాలి పీల్చి 100కుపైగా కోతుల మృతి

హత్రాస్ (ఉత్తరప్రదేశ్), నవంబరు 22: హత్రాస్ జిల్లాలోని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గోదాంలో చల్లిన పురుగు మందును పీల్చి వందకుపైగా కోతులు మరణించాయి. గోదాం సిబ్బంది వాటిని రహస్యంగా పాతిపెట్టగా శుక్రవారం కొందరు జంతుప్రేమికులు వాటి కళేబరాలను తవ్వితీసి పోస్టుమార్టంకు పంపించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కోతులు మరణించిన సమాచారం బుధవారం పోలీసుల దృష్టికి రావడంతో ఎఫ్‌సీఐ అధికారులపై కేసు నమోదు చేశారు. ఎలుకలు, పురుగుల నివారణకు అక్కడి గోధుమల బస్తాలపై ఈ నెల ఏడో తేదీన అల్యూమినియం ఫాస్ఫేట్ అనే పురుగుమందును పిచికారీ చేశారు. అదే రోజు రాత్రి విరిగిపోయిన కిటికీ ద్వారా కోతుల గుంపు గోదాంలోకి వెళ్లింది. పురుగుమందు కారణంగా కలుషితమైన గాలిని పీల్చి మరణించాయి. అధికారులు ఆ చనిపోయిన కోతులను సమీపంలోని గోతిలో పాతిపెట్టారు.

సీసం లేని పేస్‌మేకర్..అందుబాటులోకి తెచ్చిన అబ్బాట్

న్యూఢిల్లీ, నవంబరు 22: హృదయ స్పందన వేగం తక్కువగా ఉండే రోగుల కోసం అబ్బాట్ సంస్థ భారత్‌లో సీసం లేని పేస్ మేకర్‌ను అందుబాటులోకి తెచ్చింది. 'ఏవియెర్ వీఆర్' పేరిట అభివృద్ధి చేసిన ఈ సింగిల్ చాంబర్ వెంట్రిక్యులార్ లెడ్ లెస్ పేస్‌మేకర్‌కు కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) ఆమోదం లభించినట్టు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పేస్ మేకర్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) అనుమతి కూడా ఇప్పటికే లభించింది.

మానవాళికే శత్రువుగా మారిన ఐసీసీ: నెతన్యాహు

టెల్ అవీవ్, నవంబరు 22: గాజాలో యుద్ధ నేరాలకు సంబంధించి అంతర్జాతీయ నేర న్యాయస్థానం(ఐసీసీ) తనకు అరెస్టు వారెంట్ జారీ చేయడాన్ని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తీవ్రంగా ఖండించారు. దేశాన్ని రక్షించకుండా తనను ఏ శక్తీ ఆపలేదని పునరుద్ఘాటించారు. ఇజ్రాయెల్ రక్షణకు వ్యతిరేకంగా తీసుకున్న ఏ నిర్ణయమైనా తనను నిలువరించలేదని స్పష్టం చేశారు. ఎలాంటి ఒత్తిడులు ఎదురైనా తలొగ్గే ప్రసక్తే లేదని చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇజ్రాయెల్ యుద్ధ నేరాలకు పాల్పడినట్లు ఐసీసీ ఆరోపిస్తోందని, అయితే ఇజ్రాయెల్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా పలువురు వ్యక్తులపై జరిగిన భయంకరమైన నేరాలు దానికి కనిపించలేదా? అని ప్రశ్నించారు. మానవాళికి రక్షణ కల్పించేందుకు ఏర్పాటైన ప్రపంచ న్యాయస్థానం.. ఇవాళ మానవాళికే శత్రువుగా మారిందని విమర్శించారు. కోర్టు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవన్నారు. నెతన్యాహుతో పాటు ఇజ్రాయెల్ రక్షణశాఖ మాజీ మంత్రి యోవ్ గాలంట్, హమాస్ నేతలు మహ్మద్ డెయిఫ్, యాహ్యా సిన్వర్, ఇస్మాయిల్ హనియెహ్‌కూ ఐసీసీ వారెంట్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు నెతన్యాహు, గాలంట్‌లపై ఐసీసీ అరెస్ట్ వారెంట్ జారీ చేయడం పట్ల అమెరికా తీవ్రంగా స్పందించింది. ప్రాథమికంగా ఐసీసీ నిర్ణయాన్ని తిరస్కరిస్తున్నామని శ్వేతసౌధం స్పష్టం చేసింది. శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరీన్ జీన్ పియర్ స్పందిస్తూ.. అమెరికా ఆ వారెంట్‌ను అమలు చేయదన్నారు. ఐసీసీ ప్రాసిక్యూటర్ కరీమ్ ఖాన్ పక్షపాత వైఖరితో వ్యవహరించారని ఆరోపించారు. ఆయన తొందరపాటుగా వ్యవహరించారని, తప్పుడు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

విమానాల పైనుంచే దూసుకెళ్లిన ఇరాన్ క్షిపణులు!



న్యూయార్క్, నవంబరు 22: గత నెలలో ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులు పౌర విమానాలకు ముప్పుగా పరిణమించిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇరాన్, ఇరాక్ గగనతలంలో డజనుకు పైగా ప్రయాణిస్తున్న పౌర విమానాల మీదుగానే క్షిపణులు దూసుకెళ్లాయని 'వాల్ స్ట్రీట్ జర్నల్' తన కథనంలో వెల్లడించింది. ఆ క్షిపణులు పైకి వెళ్తున్న సమయంలో అగ్నిగోళాలను విమానాల పైలెట్లు, కొంతమంది ప్రయాణికులు గమనించారని తెలిపింది. ఈ బాలిస్టిక్ క్షిపణులు విమానాల కంటే ఎత్తులో ఎగిరేవైనప్పటికీ.. అవి పైకి లేచే సమయంలో.. దిగే సమయంలో ఆ మార్గంలోని వాటికి హానీ కలిగిస్తాయి. పౌర విమానాలకు ఎటువంటి హెచ్చరికలు జారీ చేయకుండానే ఇరాన్ ఈ క్షిపణులను ప్రయోగించింది. అయితే పైలెట్లు అప్రమత్తమై ఆయా సంస్థలకు సమాచారమిచ్చి విమానాలను దారి మళ్లించారు. అక్టోబర్ మొదటి వారం చేసిన ఈ క్షిపణుల దాడులను ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ పూర్తిగా నిలువరించలేకపోయింది. దీంతో ఆ దేశంలోని పలు స్థానిక స్థావరాలు ధ్వంసమయ్యాయి.

మహా టెన్షన్!

నేడే ఎన్నికల ఫలితాలు

ముంబై, నవంబరు 22: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడనున్నాయి. 288 స్థానాలున్న శాసన సభకు ఈ నెల 20న ఒకే విడతలో పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఫలితాల్లో ఏ కూటమి మెజారిటీ దక్కించుకున్నా కేవలం 72 గంటల్లోనే సర్కారును ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ కాల పరిమితి ఈ నెల 26తో ముగియనున్న నేపథ్యంలో మెజారిటీ దక్కించుకునే పార్టీ లేదా కూటమి అదే సమయానికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. ఇది ఆయా పార్టీలను టెన్షన్ పెడుతోంది. ఒకవేళ ఓటరు తీర్పు ఎవరికీ అనుకూలంగా లేకపోతే హంగ్ ఏర్పడుతుంది. అప్పుడు కేవలం 3 రోజుల్లోనే సర్కారును ఏర్పాటు చేయడం మరింత సంక్లిష్టంగా మారనుంది. ఇదే జరిగితే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన ఏర్పాటు చేసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే.. ఎన్నికల ఫలితాల్లో మెజారిటీ సీట్లు దక్కించుకున్న పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ పిలిచే అవకాశం ఉందని, తర్వాత బలపరీక్షకు ఆదేశించవచ్చని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. 1990ల నుంచి రాష్ట్రంలో ఏ పార్టీకీ పూర్తిస్థాయి మెజారిటీ దక్కకపోవడం గమనార్హం.

రాష్ట్రపతి పాలన ప్రశ్నే లేదు!

ఏ పార్టీకీ మేజిక్ ఫిగర్ రాకపోయినా వెనువెంటనే రాష్ట్రపతి పాలన పెట్టే అవకాశం లేదని సీనియర్ అడ్వొకేట్, మాజీ అడిషనల్ సొలిసిటర్ జనరల్ బిశ్వజిత్ తెలిపారు. తొలుత భారీ సంఖ్యలో సీట్లు దక్కించుకున్న పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు, తర్వాత కొంత గడువులోపల మెజారిటీని నిరూపించుకునేందుకు అవకాశం కల్పిస్తారని చెప్పారు. ప్రస్తుతం బీజేపీ నేతృత్వంలోని మహాయుతి(శివసేన, ఎన్సీపీ) కూటమి, కాంగ్రెస్ నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ(శివసేన-యూబీటీ, ఎన్సీపీ-శరద్‌పవార్) కూటములు బరిలో ఉన్నాయి. గత ఐదేళ్ల విషయాన్ని తీసుకుంటే రెండు కూటములు రాష్ట్రాన్ని పాలించాయి. 1985లో చివరిసారిగా కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా 161 స్థానాల్లో విజయం దక్కించుకుని



ఓట్ల లెక్కింపు కోసం ఓ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు

అధికారం చేపట్టింది. ఇక, ఆ తర్వాత నుంచి ఏడుసార్లుగా కూటములే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నాయి.

సీఎం సీటు కోసం కుస్తీలు

మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు రాకముందే రెండు కీలక కూటముల్లోనూ సీఎం సీటు కోసం నేతలు కుస్తీలు పడుతున్నారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసుకుని సీఎం సీటు తమకంటే తమకేనని పట్టుబడుతున్నారు. ఈ నెల 23న పోలింగ్ ముగిసిన తర్వాత ఈ రెండు కూటములు ప్రభుత్వ ఏర్పాటుపై ధీమా వ్యక్తం చేశాయి. ప్రజల తమవైపే మొగ్గు చూపారని ఇరు పక్షాలు ప్రకటించుకున్నాయి. కాంగ్రెస్ పీసీసీ చీఫ్ నానా పటోల్ స్పందిస్తూ.. మహా వికాస్ అఘాడీ అధికారం చేపట్టి తీరుతుందని చెప్పారు. కాంగ్రెస్ నేత సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. అయితే, పటోల్ వ్యాఖ్యలతో విభేదించిన శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్.. మహా వికాస్ అఘాడీ మెజారిటీ దక్కించుకున్న తర్వాత ముఖ్యమంత్రి పీఠం ఎవరికి ఇవ్వాలనే విషయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇక, మహాయుతి కూటమిలో.. శివసేన అధికార ప్రతినిధి సంజయ్ షిర్సత్ మాట్లాడుతూ ప్రస్తుత సీఎం ఏక్‌నాథ్ శిందేనే తిరిగి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టనున్నారని చెప్పారు. అయితే.. బీజేపీ నేత ప్రవీణ్ దరేకర్ మాత్రం తమ నాయకుడు, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటారని తెలిపారు. ఇదే, మహాయుతి కూటమిలో ఉన్న ఎన్సీపీ కూడా సీఎం సీటుపై ఆశలు పెట్టుకుంది. అజిత్ పవార్‌కు ముఖ్యమంత్రి అయ్యేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని.. ఎన్సీపీ కింగ్ మేకర్‌గా మారనుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

శిబిరాలకు ఉద్ధవ్ సేన!

ఫలితాలు ఇంకా రాకుండానే గెలిచిన అభ్యర్థులను కాపాడుకునేందుకు శివసేన(యూబీటీ) పార్టీ జాగ్రత్త పడుతోంది. తమ ఎమ్మెల్యేలను ఎవరూ ప్రలోభపెట్టకముందే వారిని తరలించడం కోసం పలు హోటళ్లను ముందుగానే రిజర్వ్ చేసుకుంది. "బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది. మరి మా జాగ్రత్తలో మేం ఉంటే తప్పేముంది?" అని ఆ పార్టీ నేత రౌత్ అన్నారు.

ఝార్ఖండ్‌లో గెలుపెవరిదో

న్యూఢిల్లీ, నవంబరు 22: ఝార్ఖండ్‌లోనూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ శనివారం ఉదయం ప్రారంభం కానుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి శాసన సభ ఎన్నికల్లో హోరా హోరీ తలపడ్డాయి. ముఖ్యంగా ఇండియా కూటమిలోని ఝార్ఖండ్ ముక్తి మోర్చా మరోసారి అధికారం దక్కించుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అదేవిధంగా బీజేపీ కూటమి కూడా అధికారం కోసం కష్టించింది. దీంతో రెండు కూటములు అధికార పీఠంపై ఆశలు బాగానే పెట్టుకున్నాయి. మొత్తంగా జేఎంఎం 41 స్థానాల్లో పోటీ చేస్తుండగా.. మిగిలిన స్థానాల్లో మిత్రపక్షాలు బరిలో నిలిచాయి. ఇక, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీజేపీ 68 స్థానాల్లో తలపడింది. మిగిలిన స్థానాలను మిత్రపక్షాలకు కేటాయించింది. ఇక, కాంగ్రెస్ పార్టీ 30 స్థానాల్లోనే పోటీ చేసింది. అయితే.. కీలక నాయకులను పోటీలో నిలపడంతో గెలుపుపై ఆశలు భారీగానే పెట్టుకుంది. ఇదిలావుంటే, ఎగ్జిట్ పోల్స్‌లో బీజేపీ కూటమికే ప్రజలు పట్టం కట్టడం గమనార్హం. ఈ కూటమి 42-47 స్థానాల్లో గెలిచి సర్కారు ఏర్పాటు చేసే అవకాశం ఉందని పలు సర్వేలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా, 13 రాష్ట్రాల్లోని 46 అసెంబ్లీ స్థానాలకు, రెండు లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు కూడా శనివారం వెలువడనున్నాయి. ఇందులో ప్రియాంక పోటీచేసిన వయనాడ్ స్థానంలో ఫలితంపై అంది దృష్టి ఉంది.

అబ్బే..మోదీ పాత్ర ఉందనలేదు

నిజ్జర్ హత్యపై కెనడా భద్రతా సలహాదారు



ఒటావా, నవంబరు 22: ఖలిస్థానీ వేర్పాటువాది నిజ్జర్ హత్యలో భారత ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ పాత్ర ఉందని తమ దేశ దినపత్రిక 'ది గ్లోబ్ అండ్ మెయిల్' ప్రచురించిన కథనాన్ని కెనడా ప్రభుత్వం ఖండించింది. తమ దేశంలో తీవ్ర నేర కార్యకలాపాలతో మోదీకి, మిగతా ఇద్దరికీ లింకుందని తామెక్కడా చెప్పలేదని ప్రధాని జస్టిస్ ట్రూడో భద్రత-నిఘా సలహాదారు నథాలీ డ్రౌయిన్ ప్రకటించారు. అయితే, నిజ్జర్ హత్యకోసం పన్నిన కుట్రకు భారత హోం మంత్రి అమిత్‌షా సారథ్యం వహించారని తాము నమ్ముతున్నట్టు కెనడా జాతీయ భద్రతా అధికారి ఒకరు తమకు సమాచారం ఇచ్చారని సదరు పత్రిక తెలిపింది. ఈ విషయం జైశంకర్, దోభాల్‌తో పాటు మోదీకి కూడా తెలుసని ఆయన చెప్పినట్లు వెల్లడించింది. దీనిపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ట్రూడో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. తమ దేశంలో తీవ్ర నేర కార్యకలాపాలతో మోదీ, జైశంకర్, దోభాల్‌కు సంబంధాలున్నట్టు తామెక్కడా చెప్పలేదని.. ఇందుకు ఆధారాలున్నాయన్న సంగతి కూడా తమకు తెలియదని నథాలీ గురువారం వివరణ ఇచ్చారు. ఇదిలా ఉండగా, భారత్ నుంచి కెనడాకు విద్యార్థి వీసాతో వచ్చేవారిలో అత్యధిక శాతం నకిలీ ధ్రువపత్రాలు ఇచ్చారని 'ది గ్లోబ్ అండ్ మెయిల్' తెలిపింది. 10 వేల మంది భారతీయ విద్యార్థులు తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించారని 'ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ సిటిషన్ కెనడా(ఐఆర్‌సీసీ)' గుర్తించినట్లు ఓ కథనం ప్రచురించింది. వీరిలో 80% మంది గుజరాత్, పంజాబ్ విద్యార్థులేనని పేర్కొంది.

లోకం తీరు



బేబీ సిటింగ్‌కూ సిద్ధం!

» ఖర్చుల కోసం అమెరికాలో భారతీయ విద్యార్థుల పాట్లు

న్యూఢిల్లీ, నవంబరు 22: అమెరికాలోని అంతర్జాతీయ విద్యార్థుల్లో భారత్ నుంచి వెళ్లినవారే అత్యధికం. వీరిలో చాలామంది తమ ఆర్థిక అవసరాల కోసం పార్ట్ టైం ఉద్యోగాలపై ఆధారపడుతుంటారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆ అవకాశాలు సన్నగిల్లుతుండటంతో బేబీ సిటింగ్ వైపు మొగ్గుచూపుతున్నారు. ఏపీ, తెలంగాణ తదితర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఇప్పుడు పిల్లల సంరక్షణ ద్వారా ఆదాయం కోసం ప్రవాస భారతీయ కుటుంబాలను ఆశ్రయిస్తున్నారు. సురక్షిత పని వాతావరణంతో పాటు గంటకు 10 నుంచి 18 డాలర్ల వరకూ ఆదాయం లభించే ఈ బేబీసిటింగ్ మహిళా విద్యార్థులకు అనుకూలం. కొందరు యజమానులు భోజనం, వసతి సదుపాయాలు కూడా సమకూరుస్తుండటం వారికి ఊరటగా మారుతోంది. ఒహియోలో చదువుకుంటున్న హైదరాబాద్‌కు చెందిన ఓ విద్యార్థిని ఆరేళ్ల బాలుడిని సంరక్షించే పనిలో చేరింది. రోజుకు 8గంటలు పని చేసినందుకు గాను గంటకు 13 డాలర్లు చొప్పున సంపాదిస్తోంది. ఆ బాలుడి కుటుంబం తనకు భోజన సదుపాయం కూడా కల్పించిందని, డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో పనిచేయడం కంటే ఈ ఉద్యోగమే బాగుందని పేర్కొంది. కనెక్టికట్‌లో నివసిస్తున్న మరో విద్యార్థిని మాట్లాడుతూ, తాను రెండున్నరేళ్ల చిన్నారిని వారానికి 6 రోజుల పాటు చూసుకుంటున్నట్లు తెలిపింది. అమెరికాలో విద్యార్థులు సగటున నెలకు 300 డాలర్లు అద్దె కోసం వెచ్చిస్తున్నారు. 'ఓపెన్ డోర్స్-2024' నివేదిక ప్రకారం టెక్సాస్‌లో 39వేల మంది, ఇల్లినాయిస్‌లో 20వేల మంది, ఒహియోలో 13,500 మంది, కనెక్టికట్‌లో 7వేల మంది భారతీయ విద్యార్థులు ఉండగా వీరిలో దాదాపు సగం మంది తెలుగువారే. ప్రవాస భారతీయ జనాభా ఎక్కువగా నివసించే కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూజెర్సీ న్యూయార్క్, ఇల్లినాయిస్ రాష్ట్రాల్లో పెరిగిన పోటీతో బేబీ సిటింగ్ వేతనాలు బాగా తక్కువగా ఉన్నాయి.

సెబీ దర్యాప్తు!

న్యూఢిల్లీ: అదానీపై అమెరికాలో లంచం కేసు నమోదైన నేపథ్యంలో భారత క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సైతం ఈ విషయంపై సూత్రప్రాయంగా దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. షేర్ల ధరలను ప్రభావితం చేయగలిగే సమాచారాన్ని తప్పనిసరిగా వెల్లడించాలన్న నిబంధనలను అదానీ గ్రూప్ ఉల్లంఘించిందా..? అన్న కోణంలో విచారిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. లంచం ఆరోపణలపై అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ దర్యాప్తు సమాచారాన్ని సమగ్రంగా వెల్లడించడంలో అదానీ గ్రీన్ ఎనర్జీ విఫలమైందా అని వాకబు చేయాలని స్టాక్ ఎక్స్ఛేంజీ అధికారులను సెబీ కోరిందని వారు వెల్లడించారు. కాగా, స్టాక్ ఎక్స్ఛేంజీలు శుక్రవారం అదానీ కంపెనీలను ఈ విషయంపై వివరణ కోరాయి. అలాగే, అదానీ గ్రూప్‌తో ఎయిర్‌పోర్ట్ విస్తరణ, ఇంధన ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఒప్పందాలను రద్దు చేసుకుంటున్నట్లు కెన్యా ప్రకటించింది. ఈ విషయం పైనా అదానీ గ్రూప్‌ను ఎక్స్ఛేంజీలు స్పష్టత కోరాయి. ఈ విషయంలో నిజానిజాలను నిగ్గుతేల్చే ప్రక్రియకు రెండు వారాలు పట్టవచ్చని.. స్టాక్ ఎక్స్ఛేంజీ అధికారుల విచారణలో తేలే విషయాల ఆధారంగా అదానీ గ్రూప్‌పై అధికారిక దర్యాప్తును ప్రారంభించాలా..? వద్దా..? అనే విషయంపై సెబీ నిర్ణయం తీసుకోనుందన్నారు.

ప్రశ్నార్థకంలో అదానీ గ్రూప్ నైతికత

అదానీపై అమెరికాలో కేసు నమోదైన నేపథ్యంలో అదానీ గ్రూప్ నైతిక పాలన ప్రమాణాలపై మళ్లీ ప్రశ్నలు తలెత్తవచ్చని, గ్రూప్ ప్రతిష్ఠ దెబ్బతీయనుందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్ అంటోంది. మున్ముందు అదానీ కంపెనీలకు దేశీయంగా, అంతర్జాతీయంగా నిధుల సమీకరణ కష్టతరం కావచ్చని, ఇప్పటికే రుణాలిచ్చినవారి నుంచీ ఆందోళనలు వ్యక్తమవుతాయా అని పరిశీలించనున్నట్లు తన నోట్‌లో పేర్కొంది. తాజా వివాదం నేపథ్యంలో అదానీ కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 60 కోట్ల డాలర్ల బాండ్ల జారీని సైతం రద్దు చేసుకోవాల్సి వచ్చింది. మరోవైపు, అమెరికాలో నమోదైన అభియోగాలకు సంబంధించి అదానీ గ్రూప్‌పై దర్యాప్తు ప్రారంభించేందుకు ప్రస్తుతం మీడియాలో వస్తున్న కథనాలను పరిగణనలోకి తీసుకోమని మార్కెట్ పోటీ నియంత్రణ మండలి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఛైర్‌పర్సన్ రవనీత్ కౌర్ స్పష్టం చేశారు. కాగా, అమెరికాలో నమోదైన కేసులను అదానీ జరిమానాలు చెల్లించి సెటిల్‌మెంట్ చేసుకునే అవకాశాలున్నాయి.

అదానీ..దారెటు?

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయపడ్డారు. నేరగాళ్ల అప్పగింత ఒప్పందం కింద నిందితులను తమకు అప్పగించాల్సిందిగా కూడా అడగవచ్చని గురువారం ఓ వార్తాసంస్థకు చెప్పారు. 'భారత్‌లాగే అమెరికాతో ఈ ద్వైపాక్షిక ఒప్పందం ఉన్న దేశాలు.. అమెరికా అడిగిన వ్యక్తులను తప్పనిసరిగా అప్పగించాల్సి ఉంటుంది. అమెరికన్ చట్టాలకు లోబడి ఆయా దేశాలు వ్యవహరించేందుకు నిర్దిష్ట ప్రక్రియ ఉంటుంది. అయితే అసాధారణ పరిస్థితుల్లోనే అప్పగింత జరుగుతుంది. మానవీయ కోణం ఆధారంగా చిలీ మాజీ అధ్యక్షుడు అగస్టో పినోచెట్‌ను అమెరికాకు అప్పగించేందుకు బ్రిటన్ నిరాకరించింది. అదానీ, ఇతరుల కేసులో ఇది వర్తించదు' అని బాత్రా స్పష్టం చేశారు. అమెరికాతో భారత్ 1997లో నేరగాళ్ల అప్పగింత ఒప్పందం కుదుర్చుకుంది. తమ కేపిటల్ మార్కెట్లో అవకతవకల విషయంలో అమెరికన్ చట్టాలు మరింత కఠినంగా ఉంటాయని బాత్రా చెప్పారు. నేరం నిరూపితమయ్యే వరకు తాము నిర్దోషులమని చెప్పుకొనే హక్కు అదానీ తదితరులకు ఉంటుందని.. అయితే తమ ఆత్మరక్షణ వాదనలను నిజాయితీగా, నేర్పుగా వినిపించలేకపోతే ఆ హక్కు వారికి దూరమవుతుందని పేర్కొన్నారు.



సుదీర్ఘ విచారణ ప్రక్రియ...

అదానీపై అమెరికాలో సుదీర్ఘకాలం విచారణ ప్రక్రియ జరిగే అవకాశముంది. అదానీ గ్రీన్ ఎనర్జీపై లంచం, మోసం, కుట్రలకు పాల్పడినట్లు అభియోగాలున్నాయి. రెండు దశాబ్దాల్లో 2 బిలియన్ డాలర్ల లాభం పొందగల సౌరశక్తి ఒప్పందాల కోసం ఆయన 250 మిలియన్ డాలర్లకు పైగా లంచం కింద ఇచ్చినట్లు ప్రాసిక్యూటర్లు ఆరోపిస్తున్నారు.

ఇకముందు ఏం జరగనుంది?

ఇప్పటి వరకూ అమెరికా కోర్టుకు అదానీ హాజరు కాలేదు. అక్కడ ఎలాంటి పిటిషన్ దాఖలు చేయలేదు. ఒకవేళ ఆయన్ను అమెరికాకు అప్పగించినా లేదా ఆయనే లొంగిపోయినా అదానీ తరఫు న్యాయవాదులు అభియోగాలను సవాలు చేయవచ్చు. వారు పిటిషన్ డీల్‌పై చర్చలు జరిపే అవకాశమూ ఉంది. అయితే దీనికి అంగీకరించాల్సిన బాధ్యత అక్కడి ప్రాసిక్యూటర్లకు లేదు. మరోవైపు ఈ కేసు విచారణ ఇప్పట్లో ప్రారంభమయ్యే అవకాశం లేదు. సాక్ష్యాధారాల సేకరణలో సవాళ్లు, అదానీ సహా నిందితులకు వేర్వేరు ట్రయల్స్ సహా చట్టపరమైన చర్యలతో ఈ ప్రక్రియ మరింత ఆలస్యం కానుంది.

రాజీ ప్రయత్నాలకు మొగ్గు

లంచం ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ బృందం... ఒప్పందాలు చేసుకోవడం, జరిమానాలు చెల్లించడం ద్వారా రాజీ చేసుకోవడానికి ప్రయత్నించే అవకాశం ఉంది. అయితే దీనికి కాలపరిమితి ఉన్న నేపథ్యంలో తొలుత అప్పీలు వెళ్లడమే వీరి ముందున్న మొదటి మార్గం అని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే పరిష్కార మార్గాలు అన్వేషించవచ్చని సూచిస్తున్నారు.

'ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ)' కింద నమోదయ్యే లంచం కేసుల్లో రాజీకి రావడానికి అమెరికా చట్టాలు అనుమతిస్తాయి. అదానీ గ్రూప్ జరిమానాలు చెల్లించడం, కొన్ని తప్పులను అంగీకరించడం, నిబద్ధతను మెరుగుపరుచుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చని పేర్కొంటున్నారు. ఉదాహరణకు ఎఫ్‌సీపీఏ ఉల్లంఘనల కేసులో అమెరికా ప్రభుత్వ దర్యాప్తును సెటిల్ చేసుకోవడానికి 2019లో ఎరిక్సన్ కంపెనీ ఒక బిలియన్ డాలర్లకు పైగా చెల్లించడానికి అంగీకరించింది. అలాగే ఈ ఏడాది జనవరిలో దక్షిణాఫ్రికా, ఇండోనేషియాలోని ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన కేసును పరిష్కరించుకోవడానికి 220 మిలియన్ డాలర్లకు పైగా చెల్లించడానికి జర్మనీకి చెందిన ఎస్ఏపీ సంస్థ అంగీకరించింది. అయితే అదానీపై ఇప్పటికి ఆరోపణలు మాత్రమే చేశారని, ఇంకా నేరాన్ని నిరూపించాల్సి ఉందని, ఇదో సుదీర్ఘ ప్రక్రియ అని న్యాయవాదులు చెబుతున్నారు.

భారత్-అమెరికా సంబంధాలు బలంగానే ఉన్నాయి: వైట్‌హౌస్

అదానీ లంచాల వ్యవహారంపై అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ స్పందించింది. ఈ సంక్షోభాన్ని భారత్-అమెరికా అధిగమించగలవని ఆశాభావం వ్యక్తం చేసింది. వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరీన్ జీన్ పియర్ మీడియాతో మాట్లాడుతూ.. 'అదానీపై ఆరోపణల విషయం మా దృష్టికి వచ్చింది. ఈ వ్యవహారంపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్‌చేంజ్ కమిషన్ (సీఈసీ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ (డీవోజే) మాత్రమే సరైన సమాధానం ఇవ్వగలవు. అయితే భారత్, అమెరికా మధ్య సంబంధాలు బలంగానే ఉన్నాయి. ఈ సంక్షోభాన్ని కూడా ఇరు దేశాలు అధిగమించగలవనే నమ్ముతున్నాం' అని చెప్పారు.

అదానీని అరెస్టు చేస్తారా?

ఒకవేళ అదానీ భారత్‌లో ఉంటే అతడిని అప్పగించాలని అమెరికా ప్రాసిక్యూటర్లు కోరవచ్చు. భారతీయ చట్టాల ప్రకారం ఈ అభియోగాలు వర్తిస్తాయో, లేదో ఇక్కడి కోర్టులు అంచనా వేస్తాయి. అలాగే రాజకీయ, మానవ హక్కుల పరమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుంటాయి. అయితే ఈ అప్పగింతను అదానీ సవాలు చేయవచ్చు. అలాగే దీనిపై వ్యాజ్యం దాఖలు చేయడం ద్వారా అప్పగింత ప్రక్రియను పొడిగించే అవకాశం కూడా ఉంటుంది.

ఎలాంటి శిక్షలు పడొచ్చు?

నేరం రుజువైతే లంచం ఇచ్చినందుకు ఐదేళ్ల, మోసం, కుట్ర అభియోగాల కింద 20 ఏళ్ల వరకూ అదానీకి జైలుశిక్షతో పాటు భారీగా జరిమానాలు కూడా విధించే అవకాశం ఉంది. ఏ శిక్ష అయినా అంతిమంగా న్యాయాధిపతి నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. అయితే ఏ శిక్ష విధించినా అదానీ తరపు న్యాయవాదుల బృందం దానిపై అప్పీలు చేయవచ్చు. తద్వారా ఇదొక సుదీర్ఘ న్యాయపోరాటంగా మారే అవకాశం ఉంది.

అదానీ గ్రూపు ఏమందంటే..

సౌర విద్యుత్తు కాంట్రాక్టులు దక్కించుకునేందుకు పెద్ద మొత్తంలో లంచం ఇవ్వజూపారంటూ తమ సంస్థపై అమెరికా ప్రాసిక్యూటర్లు చేసిన ఆరోపణలను అదానీ గ్రూపు తోసిపుచ్చింది. ఈ ఆరోపణలన్నీ నిరాధారమైనవని, తమ సంస్థ చట్టాలకు లోబడి నడుచుకుంటుందని స్పష్టం చేసింది.

మూడో ప్రపంచయుద్ధం మొదలైంది!

» ఉక్రెయిన్ యుద్ధంలో అమెరికా, రష్యా తలపడటం దీనికి సూచిక

» ఉక్రెయిన్ మాజీ సైన్యాధిపతి వాలెరీ



న్యూయార్క్, నవంబరు 22: మూడో ప్రపంచ యుద్ధం మొదలైందని.. ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో పలు ఇతర దేశాలు పాల్గొనటం దీనినే సూచిస్తోందని ఉక్రెయిన్ మాజీ సైన్యాధిపతి వాలెరీ జలుఝ్నీ పేర్కొన్నారు. 'ఉక్రెయిన్ యుద్ధంలో అగ్రరాజ్యాలు అమెరికా-రష్యా ముఖాముఖి తలపడుతున్నాయి. ఉత్తర కొరియా సైనికులు పాల్గొంటున్నారు. చైనా ఆయుధాలను అందజేస్తోంది. ఇరాన్ సైనిక సాయంతోపాటు డ్రోన్ల వంటి వాటిని సమకూరుస్తోంది. ఎటువంటి సంశయం లేకుండా బహిరంగంగా ఉక్రెయిన్ సాధారణ పౌరులను చంపుతున్నారు. అంటే, ఉక్రెయిన్ కేవలం రష్యాను మాత్రమే ఎదుర్కోవటం లేదు' అని తెలిపారు. తన వద్ద ఉన్న అత్యాధునిక టెక్నాలజీతో ఉక్రెయిన్ యుద్ధాన్ని కొనసాగిస్తుండవచ్చుగానీ.. ఇతర దేశాల మద్దతు లేకుండా విజయం సాధ్యం కాదని వాలెరీ స్పష్టం చేశారు. రష్యాతో యుద్ధానికి సంబంధించిన వ్యూహరచన విషయంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి వాలెరీ జలుఝ్నీకి మధ్య బేధాభిప్రాయాలు తలెత్తటంతో వాలెరీని ఈ ఏడాది ఫిబ్రవరిలో సైన్యాధిపతి పదవి నుంచి తొలగించారు. కాగా, రష్యాపైకి ఉక్రెయిన్ ఇటీవల అమెరికా, బ్రిటన్‌ల క్షిపణులను ప్రయోగించటంతో.. దానికి ప్రతిగా, రష్యా గురువారం ఉక్రెయిన్ మీదికి ఖండాంతర మధ్య శ్రేణి క్షిపణిని ప్రయోగించింది. ఉక్రెయిన్‌తో జట్టు కట్టే ఏ దేశ భూభాగం మీదికైనా ఈ క్షిపణులను ప్రయోగించగల సత్తా తమకుందని పుతిన్ హెచ్చరించారు.

పుతిన్‌కు సైన్యం.. కిమ్‌కు ఆయుధాలు

రష్యా, ఉత్తర కొరియాపై దక్షిణ కొరియా ఆరోపణలు

సియోల్, నవంబరు 22: ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా తరఫున పోరాడేందుకు 10 వేల మంది సైనికులను పంపినందుకు గాను ఉత్తర కొరియాకు పుతిన్ వివిధ రూపాల్లో సహకారం అందిస్తున్నారని దక్షిణ కొరియా శుక్రవారం ఆరోపించింది. ఉత్తరకొరియాకు రష్యా అత్యాధునిక యాంటీ ఎయిర్ మిస్సైళ్లను ఇచ్చిందని దక్షిణ కొరియా అత్యున్నత భద్రతా సలహాదారు షిన్ వోన్సిక్ విలేకరులకు వెల్లడించారు. ఐక్యరాజ్య సమితి ఆంక్షలను అతిక్రమించి మరీ ఈ ఏడాది మార్చి నుంచి రష్యా సుమారు లక్ష బ్యారెళ్ల చమురును ఉత్తరకొరియాకు సరఫరా చేసిందని బీబీసీ ఓ కథనంలో పేర్కొంది. సైనిక సాయానికి బదులుగానే రష్యా చమురు సరఫరా చేసిందని వెల్లడించింది. ఇవేకాక, కొన్ని జంతువులు, పక్షులను ఉత్తరకొరియాకు రష్యా కానుకగా పంపిందని కథనాలు వెలువడ్డాయి.

కొన్నిసార్లు మనసు చంపుకొని పని చేయాల్సి వస్తుంది!

ఆక్రమణల తొలగింపులో అది తప్పదు.. చెరువుల్లో అక్రమ నిర్మాణాలను కూల్చేస్తాం: రంగనాథ్

» ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణలో ఇబ్బందులపై విశ్రాంత ఇంజనీర్లు, నిపుణులతో భేటీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): "చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపుపై మానవతా కోణంలో ఆలోచిస్తే సమాజమంతా బాధపడుతుంది. కొన్ని చోట్ల మనసు చంపుకొని పని చేయాల్సి వస్తుంది" అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. అనుమతులు లేకుండా చెరువుల్లో చేపట్టే నిర్మాణాలు పెద్దలవైనా, పేదలవైనా కూల్చేస్తామని స్పష్టం చేశారు. చెరువుల ఎఫ్‌టీఎల్‌తో సంబంధం లేకుండా సర్వే నంబర్లు మార్చి, నిర్మించిన భవనాలనే ఇప్పటి వరకు కూల్చేశామని చెప్పారు. చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు నిపుణుల కమిటీ వేస్తామని తెలిపారు.

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఏ ప్రతిపాదికన నిర్ధారించాలి? అందుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలు ఏంటి? అనే అంశంపై శుక్రవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో మేధోమథనం జరిగింది. రంగనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్ విశ్రాంత ఇంజనీర్లు, సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ అధికారులు, పర్యావరణవేత్తలు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే చెరువుల్లో ఉన్న నివాసాలను తొలగించబోమని, మున్ముందు ఆక్రమణలు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చెరువుల నీటి నిల్వ విస్తీర్ణం, సర్వే ఆఫ్ ఇండియా, ఇరిగేషన్, గ్రామ పటాలను పరిశీలించి హద్దులు నిర్ధారిస్తామని చెప్పారు. ఇందుకోసం అధునాతన సాంకేతికతనూ వినియోగిస్తామన్నారు. బతుకమ్మకుంట పునరుద్ధరణ పనులపై కోర్టు స్టేటస్ కో ఇచ్చిందని, త్వరలో దాన్ని ఎత్తివేయించి సుందరీకరణ పనులు చేపడతామని చెప్పారు.

చెరువుల వివరాల్లో గందరగోళం..

● అమీన్‌పూర్ చెరువు విస్తీర్ణం 1949 కెడస్ట్రియల్ మ్యాప్ ప్రకారం - 96.8 ఎకరాలు కాగా, చెరువు చరిత్ర (మెమొయిర్స్) ప్రకారం - 93.37 ఎకరాలు.. సర్వే ఆఫ్ ఇండియా టోపోషీట్(2005) ఆధారంగా - 132.97 ఎకరాలు.. 2001లో చెరువులో నిలిచిన నీటి విస్తీర్ణం - 103 ఎకరాలు.. హెచ్ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ విభాగాల సర్వే ప్రకారం - 464 ఎకరాలు

● అందుబాటులో ఉన్న చరిత్ర ప్రకారం దుర్గం చెరువు విస్తీర్ణం - 64 ఎకరాలు.. ప్రభుత్వ విభాగాలు నిర్వహించిన సర్వే ప్రకారం - 160 ఎకరాలు.

ఈ రెండు మేజర్ చెరువుల పూర్తి నీటి నిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్), విస్తీర్ణం, బఫర్ జోన్‌కు సంబంధించిన వివరాలు ఒక్కో విభాగం రికార్డుల్లో ఒక్కోలా ఉన్నాయి. ఇది చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అమీన్‌పూర్ చెరువు విస్తీర్ణం 464 ఎకరాలుగా హెచ్ఎండీఏ, ఇరిగేషన్ విభాగాలు నిర్ణయించగా.. స్థానికులు కోర్టుకు వెళ్లారు. చరిత్రలోని వివరాలకు భిన్నంగా ఎఫ్‌టీఎల్ నిర్ధారణను కోర్టు తప్పుబట్టింది. ప్రస్తుతం చెరువులో 400 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో నీళ్లు ఉన్నాయి. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణలోనూ గందరగోళం నెలకొంది. గతంలో హుడానే ఇక్కడ లే అవుట్లకు అనుమతి ఇచ్చింది. కాలనీలూ వెలిశాయి. ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయంటూ కొన్నాళ్ల క్రితం ఇళ్లకు రెవెన్యూ విభాగం నోటీసులిచ్చింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణకు సంబంధించి ఇప్పటికీ సమగ్ర విధానాలు లేకపోవడం వల్లే ఈ దుస్థితి. లేక్ ప్రొటెక్షన్ కమిటీ (ఎల్‌పీసీ) నిర్ణయం మేరకు మైనర్ ఇరిగేషన్ సీఈ 2013లో రూపొందించిన మార్గదర్శకాల ఆధారంగా ఇప్పటి వరకు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరుగుతోంది. రికార్డుల్లో ఉన్న వివరాలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారించాల్సి వస్తోంది. దీంతో న్యాయపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. మున్ముందు అలాంటి ఇబ్బందులు లేకుండా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ ఎలా చేయాలన్న దానిపై సమావేశంలో చర్చించారు.



నిపుణులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

నలుగురు డీఈవోల బదిలీ

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పలు జిల్లాల విద్యాధికారుల(డీఈవో)ను బదిలీ చేస్తూ శుక్రవారం విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల డీఈవో జగన్‌మోహన్‌రెడ్డిని సిరిసిల్ల జిల్లాకు, జనగాం డీఈవో రామును జగిత్యాలకు బదిలీ చేశారు. సిరిసిల్ల డీఈవో రమేష్ కుమార్‌ను నారాయణపేటకు, నారాయణపేట డీఈవో అబ్దుల్ ఘనిని వనపర్తికి బదిలీ చేశారు.

కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ ఆత్మహత్య

సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు కక్ష కట్టారని సూసైడ్ నోట్

» పురుగుల మందు తాగి బలవన్మరణం


సాయిరెడ్డి (ఫైల్)

కల్వకుర్తి నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి (80) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. తనపై సీఎం రేవంత్ రెడ్డి సోదరులు కక్ష గట్టారని, పార్టీల నింద మోపుతూ తన ఇంటి దారికి అడ్డంగా గోడ నిర్మించడానికి పూనుకొన్నారని సూసైడ్ నోట్ రాశారు. ఈ ఘటన శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో జరిగింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. స్థానికులు, సూసైడ్ నోట్‌లోని వివరాల ప్రకారం.. కొండారెడ్డిపల్లిలో సాయిరెడ్డి ఇంటి ముందు ఇటీవల పశువైద్యశాల నూతన భవనాన్ని నిర్మించి ప్రారంభించారు. శుక్రవారం ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు అక్కడికి వచ్చారు. ప్రహరీ రూపంలో తన ఇంటి దారికి అడ్డంగా గోడ నిర్మిస్తారనే ఆందోళనతో సాయిరెడ్డి అక్కడే రోడ్డుపై పడుకొని నిరసన తెలిపారు. ఇది గొడవకు దారితీసింది. అధికారులిచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. దారి కోసం ఆరు ఫీట్ల స్థలం వదులుతారని సాయిరెడ్డికి నచ్చచెప్పి వెళ్లిపోయారు. అనంతరం సాయిరెడ్డి కల్వకుర్తికి వచ్చారు. పంజుగుల రోడ్డులో పురుగుల మందుతాగి కింద పడిపోయారు. గుర్తించిన స్థానికులు ఆయన్ను కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అందించేలోపే సాయిరెడ్డి మృతి చెందారు. మనస్తాపానికి గురైన సాయిరెడ్డి 40 ఏళ్లుగా తమ ఇంటికి ఉన్న దారిని సీఎం సోదరులు తన మీద కక్ష కట్టి ఇంటి ముంగిట పశువుల దావాఖాన నిర్మించారని మరణవాంగ్మూలంలో పేర్కొన్నారు. తన ఇంటికి దారి ఉండదనే బాధతో చనిపోతున్నానని పేర్కొన్నారు. కాగా సాయిరెడ్డి ఆత్మహ్యా ఘటనపై కుమారుడు మాధవరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సూసైడ్ నోట్‌ను నిపుణుల విశ్లేషణకు పంపి విచారణ చేపడతామని సీఐ నాగార్జున చెప్పారు. మరోవైపు.. సాయిరెడ్డి ఆత్మహత్యకు సీఎం రేవంత్ బాధ్యత వహించాలని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వలబాల రాజు డిమాండ్‌చేశారు. సీఎం సోదరులు అవమానించడం వల్లే సాయిరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారని చెప్పారు.

రాష్ట్రానికి రూ.1,453 కోట్లు

» అక్టోబరులో కేంద్ర గ్రాంట్ల కింద రాక

» కాగ్ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద రాష్ట్ర ప్రభుత్వానికి మరిన్ని నిధులు అందాయి. ఈ పద్దు కింద అక్టోబరులో రూ.1,452.71 కోట్లు వచ్చాయి. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.3,899.74 కోట్లు వచ్చినట్లయింది. కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద ఈసారి రూ.21,636.15 కోట్లు వస్తాయని అంచనా వేయగా.. అక్టోబరు వరకు రూ.3,899.74 కోట్లు (18.02%) వచ్చాయి. ఈ మేరకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) శుక్రవారం రాష్ట్ర ఆదాయ, వ్యయాలపై అక్టోబరు నివేదికను విడుదల చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మొదటి మూడు నెలల్లో (ఏప్రిల్, మే, జూన్) కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎలాంటి గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్లను విడుదల చేయలేదు. అయితే జూలైలో రూ.1,880.18 కోట్లు, ఆగస్టులో రూ.566.85 కోట్లు విడుదల చేసింది. సెప్టెంబరులో నయా పైసా ఇవ్వలేదు. అక్టోబరులో రూ.1,452.71 కోట్లు విడుదల చేసింది. ఇక అన్ని రకాల రాబడుల కింద అక్టోబరునాటికి రూ.1,25,989.74 కోట్లు వచ్చాయి. ఈసారి బడ్జెట్‌లో అన్ని రకాల రాబడుల కింద రూ.2,74,057.64 కోట్లు అంచనా వేయగా 45.97 శాతం నిధులు సమకూరాయి. మొత్తం రూ.49,255.41 కోట్ల మేర అప్పులు తీసుకుంటామని ప్రభుత్వం అంచనా వేయగా... అక్టోబరునాటికి 71.30 శాతం మేర అప్పులు సేకరించింది. రెవెన్యూ రాబడుల్లో పన్నుల కింద అంచనా వేసిన రూ.1,64,397.64 కోట్లకుగాను రూ.82,135.38 కోట్లు, పన్నేతర రాబడి కింద రూ.35,208.44 కోట్లకుగాను రూ.4809.33 కోట్లు వచ్చాయి. వస్తు సేవల పన్ను(జీఎస్టీ) కింద రూ.58,594.91 కోట్లకుగాను రూ.29,526.14(50.39%) కోట్లు, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల కింద రూ.18,228.82 కోట్లకుగాను రూ.8,359.87 కోట్లు(45.86%), అమ్మకం పన్ను కింద రూ.33,449.21 కోట్లకుగాను రూ.18,595.66 (55.59%) కోట్లు, రాష్ట్ర ఎక్సైజ్ సుంకాల కింద రూ.25,617.53 కోట్లకుగాను రూ.10,921.88 కోట్లు(42.63%), కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.18,384.19 కోట్లకుగాను రూ.10,159.63 కోట్లు(55.26%), ఇతర పన్నుల కింద రూ.10,111.78 కోట్లకుగాను రూ.4571.52 కోట్లు(45.21%) వచ్చాయి. అక్టోబరు నాటికి అన్ని రకాల వ్యయాల కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.1,23,799.29 కోట్లు ఖర్చు చేసింది. మొత్తం అంచనా వ్యయం రూ.2,54,431.31 కోట్లలో ఇది 48.66 శాతం.

అంతర్రాష్ట్ర మండలి పునరుద్ధరణ

» శాశ్వత ఆహ్వానితుడిగా కిషన్ రెడ్డి

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం, సహకారం కోసం పని చేసే అంతర్రాష్ట్ర మండలి(ఇంటర్ స్టేట్ కౌన్సిల్)ని భారత ప్రభుత్వం పునరుద్ధరించింది. ప్రధాని మోదీ ఈ మండలికి అధ్యక్షుడిగా ఉంటారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రధాని ప్రతిపాదించిన తొమ్మిది మంది కేంద్ర మంత్రులు మండలిలో సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు 13 మంది కేంద్ర మంత్రులు మండలి శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. ఇందులో భాగంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అంతర్రాష్ట్ర మండలి శాశ్వత ఆహ్వానితుడిగా నియమితులయ్యారు. అలాగే, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన అంతర్రాష్ట్ర మండలి స్టాండింగ్ కమిటీని కూడా పునరుద్ధరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నేరస్థుడు నెతన్యాహూ!

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ మీద ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు–ఐసీసీ అరెస్టువారెంట్ జారీ చేసింది. ఆయనతోపాటు మాజీ రక్షణమంత్రి యోవ్ గల్లాంట్ మీద కూడా గాజాలో యుద్ధనేరాలకు, మానవహననానికీ పాల్పడినందుకు, మానవత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించినందుకు ఐసీసీ అరెస్టువారెంట్లు జారీ చేసింది. ఐసీసీ అరెస్టువారెంట్ల ప్రభావమెట్టిది, వీరిద్దరూ అరెస్టవుతారా, చేయగలవారెవ్వరు ఇత్యాది ప్రశ్నలను అటుంచితే, ఈ తీర్పు నెతన్యాహూకు నైతికంగా ఎదురుదెబ్బ. ఆయనకు నష్టం ఉన్నా లేకున్నా ఈ తీర్పు తరువాత ప్రపంచదేశాలు ఇజ్రాయెల్ తరఫున ఏకపక్షంగా, నిస్సిగ్గుగా నిలవకుండా కాస్తంతైనా వెనుకంజవేస్తాయని ఆశ.


గాజాలో హత్యలు, హింస ఇత్యాది అమానుష చర్యలతో పాటు, ఆకలి చావులకు వీరిద్దరు కారకులని ఐసీసీ ఆరోపించింది. అన్నం, నీళ్ళు, మందులు అందనివ్వకుండా చేసి, మానవ మనుగడనే ప్రశ్నార్థం చేసి, సంక్షోభం తీవ్రస్థాయికి చేర్చారని వ్యాఖ్యానించింది. పౌరులను, ప్రధానంగా చిన్నారులను లక్ష్యంగా చేసుకున్నారని నిర్ధారించడానికి నిర్దిష్టమైన ఆధారాలున్నందున అరెస్టు వారెంట్లు జారీ చేస్తున్నట్టు న్యాయస్థానం ప్రకటించింది. ఇవన్నీ తప్పుడు మాటలనీ, తిరస్కరిస్తున్నామని, ఆత్మరక్షణ కూడా పాపమైపోతే ఎలా అనీ ఇజ్రాయెల్ చాలా విమర్శలు చేసింది. దేశ రక్షణలో ఏమాత్రం రాజీపడననీ, ఏ శక్తీ తనను అడ్డుకోలేదనీ, ఇటువంటి కుట్రలు ఎన్నిచేసినా యుద్ధం ఆపేదిలేదని నెతన్యాహూ గొప్పలకు పోయారు. మానవాళి రక్షణకు కృషిచేయాల్సిన న్యాయస్థానం శత్రువుగా మారిందన్నారు.

నెతన్యాహూ, గల్లాంట్‌లతో పాటు ముగ్గురు కీలకమైన హమాస్‌నేతలపై కూడా అరెస్టువారెంట్లు జారీచేసిన విషయం తెలిసిందే. ఐసీసీ తీర్పు నెతన్యాహూ కంటే జోబైడెన్‌కు ఎక్కువ ఆశ్చర్యాన్ని, ఆగ్రహాన్ని కలిగించింది. ఒక నిరపరాధితో పోలీసులు బలవంతంగా నేరాన్ని ఒప్పించి నేరగాడుగా చిత్రీకరించినంత బాధ అమెరికాకు కలిగింది. నిజానికి, రోమ్ ఒప్పందంమీద సంతకాలు చేసిన 124 దేశాల్లో ఎక్కడ అడుగుపెట్టినా ఈ తీర్పుకు లోబడి సదరు దేశం నెతన్యాహూను అరెస్టుచేయాల్సి ఉంది. అమెరికా ఈ ఒప్పందంలో లేదన్నది వేరే విషయం. మరి, బ్రిటన్ అందుకు సిద్ధమేనా? అన్న ప్రశ్నకు ఆ దేశ హోంమంత్రి సమాధానం ఇవ్వనన్నారు. బ్రిటన్‌లో ప్రభుత్వం మారిన తరువాత, కొన్ని రకాల ఆయుధాల సరఫరాలు, వినియోగంమీద ఏవో పరిమితులు విధిస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికా మాదిరిగా అప్పుడప్పుడు ఆగ్రహిస్తున్నట్టు, అలుగుతున్నట్టు కనబడటం వినా, ఇజ్రాయెల్‌కు ఆయుధాలు అమ్ముకుంటున్న పశ్చిమ దేశాలేవీ ఎన్ని ఉద్యమాలు జరిగినా, ప్రపంచవ్యాప్తంగా ఎంతటి వ్యతిరేకత చవిచూస్తున్నా ఆయుధ సరఫరాలను ఆపిందే లేదు. ఈ ఏడాది మే నెలలో ఐసీసీ చీఫ్ ప్రాసిక్యూటర్ కరీంఖాన్ ఇజ్రాయెల్‌మీద ఈ ఆరోపణలను సూచించడం, అదే నెలలో ఐసీజే తీవ్రంగా ఇజ్రాయెల్ రఫా ప్రవేశాన్ని వ్యతిరేకించడం, గాజాలోని వివిధ ఆస్పత్రులను ఇజ్రాయెల్ బలగాలు కుప్పకూల్చి, సజీవంగా ఉన్న రోగులను నిలువునా పాతిపెట్టినటువంటి అనేక నేరాలూ ఘోరాలు సైతం ఈ దేశాల మనసు మార్చలేకపోయాయి.

హమాస్ మీద యుద్ధం చేస్తున్నానని నెతన్యాహూ చెప్పుకోవచ్చును కానీ, గాజాలో ఆయన చేస్తున్నది సామాన్యులను ఊచకోతకోయడమని ఈ తీర్పు మరోమారు స్పష్టంచేస్తోంది. అన్నం నీళ్ళు మందులు లేకుండా చేయడం వంటి వ్యాఖ్యలు ఇజ్రాయెల్ నాయకుల నోటినుంచి ఈ ప్రపంచం విన్నది. ఆ రీతిన పాలస్తీనియన్లను చంపేయాలన్న కసి వారి మాటల్లోనూ, చేతల్లోనూ విస్పష్టంగా కనిపిస్తూనే ఉంది. ఇక విద్యాలయాలు, వైద్యాలయాలు సహా ప్రతీ చోటా హమాస్ ఉగ్రవాదులు ఉన్నారన్న వాదనతో వాటిని నేలమట్టం చేయడం, మారణాయుధాలు ప్రయోగించి వందలాదిమంది అమాయకులను హత్యచేయడం నిర్లజ్జగా సాగుతూనే వచ్చింది. నెతన్యాహూ పాల్పడుతున్న ఈ యుద్ధనేరాల్లో ఆయనకు ఆయుధాలు అమ్మిన దేశాలు కూడా భాగస్వాములే. ఆ పాపంలో వాటి వాటాయే అధికం. మారణాయుధాల సరఫరా సాగుతున్నంతకాలం ఏ యుద్ధమూ ఆగదు. నెతన్యాహూను ఎవరు అరెస్టు చేస్తారు, చేయగలరు అన్న ప్రశ్నలకంటే, ఐసీసీ ఆదేశాల్లో ఉన్న సారాంశానికి అనుగుణంగా ఆయాదేశాలు ఆయుధాల సరఫరాన్ని నిలుపుదల చేయడం ముఖ్యం. మానవాళిమీద అఘాయిత్యాలకు పాల్పడుతున్న నేరస్థులకు ఆయుధాలు అందించి, ఆ పాపంలో పాలుపంచుకోవడం ఆగిపోవాలి.

డార్విన్ 'జీవపరిణామ' విప్లవం

అది 1859, నవంబర్ 24. జీవపరిణామ సిద్ధాంతం వెలుగుచూసిన రోజు. ఛార్లెస్ డార్విన్ రాసిన 'జాతుల పుట్టుక' (The Origin of Species) గ్రంథం విడుదలైన సందర్భం. నాటి మేధో ప్రపంచాన్ని, శాస్త్ర కోవిదుల్నీ ఒక్క కుదుపు కుదిపేసిన అరుదైన సంఘటన. అది ఎంతటి సంచలనం సృష్టించిందంటే ఆ పుస్తకం వచ్చిన తొలినాడే 1250 కాపీలు అమ్ముడైనాయి. విజ్ఞానశాస్త్ర రంగంలో ఏ ఇతర ఆవిష్కరణ కలిగించనంతటి కదలికను డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం తీసుకొచ్చింది. జీవుల ఉనికిపై, అవి భూమిపై ఎలా అభివృద్ధిచెందాయో వివరించే సిద్ధాంతం కావటం అందుకు ఒక కారణం. అంతేకాదు. అప్పటి వరకూ నమ్ముతూ వస్తున్న జీవ సృష్టి సిద్ధాంతానికిది సవాల్ అవ్వడం. జీవ ప్రపంచాన్ని అర్థం చేసుకోవటానికి కొత్త బాట వేసింది. ఇంతకు ముందు ఊహించనైనా ఊహించని కొత్త కోణాన్ని ఆధారాలతో ఆవిష్కరించింది. జీవుల పుట్టుకపై డార్విన్ వివరణ సరళంగా, సులభగ్రాహ్యంగా ఉంది. జీవులు ఇప్పుడు ఎలా ఉన్నాయో అలానే సృష్టించబడినాయన్న విశ్వాసాన్ని వమ్ము చేసింది. జాతి అనేది దగ్గరి పోలికలున్న మరో జాతి నుండి పరిణామం చెందుతుందని చెప్పాడు. అంతటితో ఆగిపోలేదు డార్విన్. పరిణామం ఎలా చెందుతుందో కూడా చెప్పాడు. అదే 'ప్రకృతి ఎంపిక' లేదా Natural Selection. పరిణామాన్ని నడిపించే భౌతిక శక్తిగా ప్రకృతి పరిస్థితులు పని



చేస్తాయనీ, ఆయా కాలాల్లో ఉన్న వాతావరణ పరిస్థితుల్ని తట్టుకుని నిలబడ్డ జీవులే ముందు తరాలకు తమ లక్షణాలను బదిలీ చేస్తాయన్నది దీని సారాంశం.

ఈ సిద్ధాంతం ఎదుర్కొన్న వ్యతిరేకత, విమర్శలు మున్నెన్నడూ కనీ వినీ ఎరుగనివి. ప్రకృతి ఎంపికను వివరించేందుకు సాధారణంగా పారిశ్రామికీకరణ కాలం నాటి బ్రిటన్‌ను ఉదహరిస్తారు. పారిశ్రామిక విప్లవానికి ముందు చెట్ల బోదెలపై తిరుగాడే సీతాకోక చిలుకలు తెల్లగా ఉండేవి. అదే 19వ శతాబ్దం ద్వితీయార్థంలో తెల్లటి సీతాకోక చిలుకల సంఖ్య తగ్గి నల్లటి సీతాకోక చిలుకలు ఎక్కువగావటం జరిగింది. కాలుష్యంతో చెట్ల బోదెలు నల్లబారటం తెల్లవాటిని శత్రువులు తేలిగ్గా గుర్తించేలా చేయటమే ఇందుకు కారణం. అదే సమయంలో నల్లటి సీతాకోక చిలుకలకు అది వరమైంది. శతాబ్దాంతానికి కాలుష్యం నివారించబడినపుడు ఈ పరిస్థితి తల్లక్రిందులు కావటం జరిగింది. జీవుల జనాభాపై వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని ఈ ఉదాహరణ తేటతెల్లం చేస్తున్నది. ఇది వాస్తవమే అయినప్పటికీ సీతాకోక చిలుకలు సీతాకోక చిలుకల్లానే ఉన్నాయి కదా! ఈ దృష్టాంతం జీవ పరిణామానికి సాక్ష్యం కానేరదని సృష్టివాదులు తిరస్కరించారు. వాతావరణ పరిస్థితులు స్వల్ప మార్పులను తీసుకరాగలవేమోగాని నూతన జాతులను సృష్టించలేవని వారి వాదన. దీనిలో కొంత హేతుబద్ధత లేకపోలేదు. డార్విన్ కాలానికి సహేతుకమైన సమాధానం లేదు. డార్విన్ మరణించిన ఒక దశాబ్దం తర్వాతగాని ఈ చిక్కుముడి వీడలేదు.

మన కళ్లెదుట అపరిమితమైన జీవవైవిధ్యం కనిపిస్తుంది. అంటే భిన్నజాతులు కలసిమెలసి జీవిస్తున్నాయి. భిన్న జాతులు అంటున్నామంటే వాటి మధ్య ప్రత్యుత్పత్తి సంబంధాలు ఉండవని అర్థం. పరస్పరం ప్రత్యుత్పత్తి జరపగలిగిన జీవులనే ఒక జాతిగా గుర్తిస్తారు. ఒక జాతి నుండి మరో కొత్త జాతి ఆవిర్భావం జరగటం సత్యమైతే వాటి రెండింటి మధ్య ఏ రకమైన ప్రత్యుత్పత్తి సంబంధం ఉండకూడదు. ఇదెంతవరకు సాధ్యం. ప్రకృతిలో అసలు జరుగుతుందా? ఇరవయ్యో శతాబ్దపు ఆరంభంలో ప్రిమిరోజ్ (పూల మొక్కలు) మొక్కల్లో వికసించిన హైబ్రిడ్ల రూపంలో దీనికి సమాధానం దొరికింది.

లండన్ రాయల్ బొటానికల్ గార్డెన్ నిర్వహించిన పుష్ప ప్రదర్శనలో ఒక మొక్క అందరి దృష్టిని ఆకర్షించి ప్రత్యేక బహుమతి అందుకుంది. ఈ ప్రిమిరోజ్ అసాధారణంగా పెద్ద ఆకులు, పూలతో ఉండటమే అందుకు కారణం. దీనికి క్యూ ప్రిమిరోజ్‌గా పేరు పెట్టారు. దీన్ని ఒక హైబ్రిడ్‌గా భావించి, ఏ మొక్కల కలయిక వలన ఇవి వచ్చి ఉంటాయో ఊహించి, వాటి మధ్య సంకరం చేశారు. కాని వచ్చిన మొక్కలు వంధ్య (గొడ్డుమోతు)గా మిగిలిపోయాయి. ఈ వంధ్య మొక్కల్లో 1905లో మరో అద్భుతం చోటుచేసుకుంది. ఏ కాయలూ కాయని ఒక వంధ్య మొక్కలో ఒక కొమ్మ మాత్రం పూలు పూయటం ఆ అద్భుతం. వీటి విత్తనాల నుండి వచ్చిన మొక్కలు పరస్పరం ప్రత్యుత్పత్తి జరపగలిగాయి. కాని హైబ్రిడ్‌కి జన్మనిచ్చిన వాటి తల్లిదండ్రులతో మాత్రం ప్రత్యుత్పత్తి విఫలమైంది. అంటే ఒక 'కొత్త జాతి' ప్రకృతి సహజంగా ఎవరి ప్రమేయం లేకుండానే ఆవిర్భవించింది. ఒరిజినల్ ప్రిమిరోజ్‌లు వంధ్యంగా ఎందుకున్నాయి? కొత్తగా వచ్చినవి ఎందువలన ఫలవంతమైనాయి? దీనికి లెటీస్ డిగ్బీ (Lettice Digby) పరిశోధనలు సమాధానమిచ్చాయి. క్రోమోజోముల సంఖ్య ఇందుకు కీలకం. వంధ్య ప్రిమిరోజ్‌లలో 18 క్రోమోజోములుంటే ఫలవంతమైన వాటిలో అందుకు రెట్టింపు 36 ఉండటమే కారణం. నూతన జాతులు ఆవిర్భవిస్తాయన్న డార్విన్ సూత్రీకరణను ఇది బలపరిచింది. ఇలాంటి అనేక రుజువులు గత శతాబ్ద కాలంలో కొల్లలుగా వచ్చి పరిణామ సిద్ధాంత విశిష్టతను చాటిచెప్పాయి. జాతుల పుట్టుక 'వెలువడిన నవంబర్ 24ను ప్రపంచం 'జీవపరిణామ దినోత్సవం'గా జరుపుకుంటున్నది.

• ప్రొ. కట్టా సత్యప్రసాద్

వీరి దోస్తీ భారత్‌కు మేలు చేసేనా?

డోనాల్డ్ ట్రంప్ ప్రస్తుతానికి అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన నాయకుడు మాత్రమే. ఆయన అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టేందుకు ఇంకా ఏడు వారాల వ్యవధి ఉంది. అయితేనేం, ప్రపంచవ్యాప్తంగా ప్రతి చోటా విద్యావంతుల మాటా మంతీ, సామాన్యుల పిచ్చా పాటీ అంతా ఆయన గురించే సుమా! మరీ ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ రెండో రాకడ ప్రపంచం మీద, నిర్దిష్ట దేశం మీద, ఇంకా చెప్పాలంటే మీ పట్టణం మీద, మీ సొంత ఉద్యోగం మీద, మన జీవితాలతో సంబంధమున్న ప్రతి వ్యవహారం మీద ఎలాంటి ప్రభావం చూపనున్నదనేదే అందరి ఉత్కంఠ.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

అమెరికా అధ్యక్ష ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత మార్కెట్ సూచీలు అధో ముఖంలో ఉన్నాయి. నవంబర్ 5న సెన్సెక్స్ 78, 782 పాయింట్లకు ఎగబాకింది. రూపాయి–డాలర్ మారకం రేటు రూ.84.11. ఈ వ్యాసాన్ని నేను రాస్తుండగా, సెన్సెక్స్ శుక్రవారం నాడు 77,156 పాయింట్లకు ఎగబాకింది. రూపాయి–డాలర్ మారకం రేటు రూ.84.50.

ఆర్థిక వ్యవహారాలలో డోనాల్డ్ ట్రంప్ ప్రధాన విశ్వాసాలు ఏమిటో చూద్దాం. ఆయన ఒక వ్యాపారవాది. అధిక సుంకాలు మాత్రమే అమెరికా ప్రయోజనాలను కాపాడగలుగుతాయని గట్టిగా నమ్మే వాణిజ్య దక్షుడు. దిగుమతి చేసుకునే సరుకులపై, ముఖ్యంగా చైనా ఉత్పత్తులపై గరిష్ఠ సుంకాలు విధిస్తానని ఆయన పదే పదే హెచ్చరించారు. అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ పాలనలో చైనాతో అమెరికా వాణిజ్య లోటు: 2021లో 352 బిలియన్ డాలర్లు; 2022లో 382 బిలియన్ డాలర్లు, 2023లో 279 బిలియన్ డాలర్లు, 2024 (సెప్టెంబర్ వరకు)లో 217 బిలియన్ డాలర్లు. అమెరికాలోని సంపన్న వర్గాల వారికి చైనా సరుకులు, వస్త్రోత్పత్తులు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, యంత్రాలు మొదలైనవి అవసరం. మరి రాబోయే ట్రంప్ ప్రభుత్వం చైనా నుంచి దిగుమతులపై అధిక సుంకాలు విధిస్తే అమెరికన్ పరిశ్రమలు, వినియోగదారులకు ఖర్చులు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధాన వడ్డీ రేటు (మన ఆర్బీఐ విధించే రెపో రేటు లాంటిది)ను పెంచుతుంది. అమెరికా నిర్ణయాలు ఏవైనా చైనా తన కార్మిక శ్రేణుల ఉద్యోగాలను నిలబెట్టేందుకు సరుకుల ఉత్పత్తిని కొనసాగిస్తుంది. అమెరికా అధిక సుంకాల కారణంగా చైనా తన ఉత్పత్తులను ఇతర దేశాలకు తక్కువ ధరకు ఎగుమతి చేయడం అనివార్యమవుతుంది. మన ప్రభుత్వం ఇప్పటికే దేశంలోకి చైనా ఉత్పత్తుల వెల్లువను నిరోధించేందుకు రెండుసార్లు గరిష్ఠ స్థాయిలో యాన్టీ డంపింగ్ సుంకాలను విధించింది. చర్యకు ప్రతి చర్య ఉంటుంది కదా. అమెరికా అధిక సుంకాలకు దీటుగా చైనా, ఇతర దేశాలు కూడా గరిష్ఠ సుంకాలు తప్పక విధిస్తాయి. ఇది ప్రపంచ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపడం ఖాయం.

ద్రవ్యలోటును అదుపు చేయడం గురించి భారత్ తదితర దేశాలలో హైరానా పడినంతగా అమెరికాలో ఎవరూ ఆందోళన చెందరు. కారణమేమిటి? అమెరికా తన ద్రవ్యలోటును సులభంగా భర్తీ చేసుకోగలుగుతుంది. చైనాతో సహా పలు దేశాలు అమెరికా ట్రెజరీ బాండ్స్ (అమెరికా ప్రభుత్వం జారీ చేసే కోశాగార పత్రాలు) కొనుగోలు చేస్తుండడం వల్ల అమెరికాకు అవసరమైన నిధులు సమృద్ధిగా లభిస్తాయి. అమెరికా జాతీయ రుణం (21,000 బిలియన్ డాలర్లు)లో చైనాకు 1170 బిలియన్ డాలర్లపై చైనాకు స్వామ్యం ఉన్నది. అమెరికా ద్రవ్యలోటు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమవుతుంది. పర్యవసానంగా అధిక వడ్డీ రేట్లు పెట్టుబడి ప్రవాహాన్ని వెనక్కి మళ్లిస్తుంది. భారత్ లాంటి అభివృద్ధి చెందిన దేశాల నుంచి పెట్టుబడులు తరలిపోతాయి. శక్తిమంతమైన డాలర్‌తో, రూపాయి విలువ పడిపోతుంది.

అమెరికా నుంచి తరలిపోయిన ఫ్యాక్టరీలను వెనక్కి తీసుకువస్తానని డోనాల్డ్ ట్రంప్ వాగ్దానం చేశారు. అమెరికన్ కంపెనీలు తమ ఫ్యాక్టరీలను అమెరికాలోనే నెలకొల్పేందుకై ఆయన పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ఇచ్చే అవకాశం ఎంతైనా ఉన్నది. ఇది జరిగినప్పుడు అమెరికాకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మందగిస్తాయి. అయినా అమెరికన్ కంపెనీలు తమ ఫ్యాక్టరీలను విదేశాలలోనే ఉంచడం జరిగితే సాంకేతికతల ఎగుమతిపై ఆంక్షలు విధించేందుకు ట్రంప్ వెనుకాడరు. ట్రంప్ తన మొదటి పాలనా కాలంలో అమెరికా సరుకులపై భారత్ అధిక సుంకాలు విధిస్తుందని, 'కరెన్సీ మేనిప్యులేటర్ (రూపాయి విలువను కృత్రిమంగా తగ్గించేందుకు ద్రవ్య విధానాన్ని ఉపయోగించుకునే దేశం)గా వ్యవహరిస్తుందని ఆరోపించారు. మరి డోనాల్డ్ ట్రంప్–నరేంద్ర మోదీ మధ్య 'దోస్తీ' ఇప్పుడు భారత్ పట్ల ట్రంప్ తన నిక్కచ్చి వైఖరిని సడలించేందుకు తోడ్పడుతుందా లేదా అనేది ఒక చర్చించాల్సిన ప్రశ్న.

మరొక విషమ సమస్య అక్రమ వలసలు. అమెరికా సమాజంలోని నిరుద్యోగిత, పెచ్చరిల్లుతున్న నేరాలు, మాదక ద్రవ్యాలు మొదలైన సమస్యలు అన్నిటికీ అక్రమ వలసలే కారణమని ట్రంప్ నిందిస్తున్నారు. అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి 100 రోజుల్లో పది లక్షల మంది అక్రమ వలసదారులను బలవంతంగా వెనక్కి పంపించివేస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు. చట్టవిరుద్ధంగా అమెరికాలో ఉంటున్న విదేశీయులను వెనక్కి పంపించే బాధ్యతను, వలసలను తీవ్రంగా వ్యతిరేకించే టామ్ హోమాన్‌కు అప్పగించారు. ఎంత మంది భారతీయులను భారత్‌కు పంపించివేస్తారనేది ఇంకా కచ్చితంగా తెలియదు. ఎంతో కొంత మందిని తప్పక బహిష్కరిస్తారు. అయితే ఆ చర్య భారత్–అమెరికా సంబంధాలను ఏదో ఒక మేరకు ప్రతి కూలంగా ప్రభావితం చేయడం ఖాయం. హెచ్ 1 బి1 వీసాల నిబంధనలను ట్రంప్ మరింత కఠినతరం చేసే అవకాశమున్నది. మెరుగైన వృత్తి నిపుణులయిన భారతీయులు మరింతగా అమెరికాకు రావాలని అంతిమంగా అమెరికా పౌరులు కావాలని అమెరికన్ విశ్వవిద్యాలయాలు, ఆరోగ్య భద్రతా వ్యవస్థలు ప్రగాఢంగా కోరుకుంటున్నాయి. అయినా ట్రంప్ తన విధానాలకు దృఢంగా కట్టుబడి ఉంటే, అలాగే అమెరికా యాజమాన్యాలు కూడా భారతీయ వృత్తి నిపుణులను స్వాగతించాలన్న దృఢ వైఖరిని కొనసాగిస్తే



ట్రంప్ తన మొదటి పాలనా కాలంలో అమెరికా సరుకులపై భారత్ అధిక సుంకాలు విధిస్తున్నదని, 'కరెన్సీ మేనిప్యులేటర్'గా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. అక్రమంగా వలస వచ్చిన వారిని బలవంతంగా వెనక్కి పంపించేందుకు ట్రంప్ ఈ మారు కృతనిశ్చయంతో ఉన్న దృష్ట్యా ఎంతో కొంత మంది భారతీయులనూ తప్పక బహిష్కరిస్తారు. హెచ్1 బి1 వీసాల నిబంధనలను ట్రంప్ మరింత కఠినతరం చేసే అవకాశమున్నది.

ఒక ప్రబల ప్రతిబంధకాన్ని ఒక మహాశక్తి ఎదుర్కోవడమే అవుతుంది.

చమురు, ఔషధోత్పత్తి రంగాలపై ట్రంప్ పాలన పెను ప్రభావాన్ని చూపడం ఖాయం. ఇంధన మంత్రిగా క్రిస్ రైట్‌ను ట్రంప్ ప్రతిపాదించారు. చమురు, సహజ వాయువు నిక్షేపాలను మరింతగా వినియోగించుకోవాలని రైట్ కోరుతున్నాడు. వాతావరణ మార్పు సంక్షోభం అనేది ఒక మిథ్య అని ఆయన ఎప్పుడో కొట్టిపారేశాడు. అజర్ బైజాన్‌లోని బాకు నగరంలో జరుగుతున్న కాప్ చర్చలు విఫలం కాకపోవచ్చు కానీ వాటిలో గణనీయమైన పురోగతి ఉండకపోవచ్చు. భూతాపాన్ని తగ్గించి తీరాలని, అయితే ఆ లక్ష్య సాధన నెమ్మదిగా జరగాలన్నదే భారత్ వైఖరి. బహుశా అంతిమంగా ఇదే జరగవచ్చు. ఫార్మాస్యూటికల్ రంగానికి వస్తే ట్రంప్ రాకతో నియంత్రణల సడలింపు, ధరల పెరుగుదలకు అవకాశాలు కన్పించడంతో ఫార్మా స్టాక్‌ల ధర బాగా పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఔషధాల ధరలు పెరుగుతాయి. ఆరోగ్య భద్రత సదుపాయాలు అందరికీ కల్పించే ప్రయత్నాలకు తీవ్ర విఘాత మేర్పడుతుంది.

పశ్చిమాసియాలోను, ఐరోపాలోను ఇప్పుడు రెండు భీకర యుద్ధాలు జరుగుతున్నాయి. ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో అమాయక ప్రజలు హతమవుతున్నారు. పాఠశాలలు, ఆస్పత్రుల లాంటి కీలక సదుపాయాలు ధ్వంసమైపోతున్నాయి. మరి ఈ రెండు యుద్ధాల పట్ల డోనాల్డ్ ట్రంప్ వైఖరి ఏమిటి? తనను ఎన్నుకుంటే ఆ యుద్ధాలను నిలిపివేస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు. అయితే అది ఎలా సాధించగలిగేది ఆయన వెల్లడించలేదు శాంతి సాధనకు ఆయన ఏమి చేయనున్నారు? గతంలో ఆయన అనుసరించిన విధానాలు, చేసిన ప్రకటనల ఆధారంగా చూస్తే పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు ఆయన గట్టి మద్దతు ఇస్తారని స్పష్టమవుతుంది. రష్యాతో ఒక ఒప్పందానికి రావలసిందిగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై ఒత్తిడి తెచ్చే అవకాశమున్నది. దూకుడుగా, అనాలోచితంగా నిర్ణయాలు తీసుకుంటే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. అటు ఐరోపాలో గానీ, ఇటు పశ్చిమాసియాలో గానీ యుద్ధం నిలిచిపోదు, శాంతి నెలకొనదు. అందుకు విరుద్ధంగా ఆ యుద్ధాలు మరింతగా తీవ్రమయితే సప్లై చైన్స్ (ఉత్పత్తి, సరఫరా ప్రక్రియల పరంపర)కు తీవ్ర అంతరాయమేర్పడుతుంది. ఈ పరిణామం అభివృద్ధి చెందుతున్న దేశాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది.

అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేద్దాం అనేది ట్రంప్ నినాదం. అది ఆయన హామీ. అయితే ఆ వాగ్దాన పాలన ఈ ధరిత్రిని మరింత మెరుగైన, మరింత భద్రమైన, మరింత సంపద్వంతమైన ప్రదేశంగా మార్చగలుగుతుందా? మార్చలేకపోవచ్చు. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా రూపొందించడమనేది అమెరికా స్వప్రయోజనాలను కాపాడేందుకేనన్నది ట్రంప్ సునిశ్చిత విశ్వాసం. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు కూడా ట్రంప్ స్వార్థపరత్వాన్ని రుజువు చేశాయి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

విశ్వనాథ సాహిత్యపీఠం ద్విదశాబ్ది ఉత్సవాలు

విశ్వనాథ సాహిత్యపీఠం స్థాపించి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, నవంబరు 24వ తేదీ ఆదివారం 'ద్విదశాబ్ది ఉత్సవాలు' నిర్వహిస్తున్నాం. సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్, నిజామియా అబ్జర్వేటరీ క్యాంపస్, అమీర్‌పేట్, హైదరాబాద్‌లో ఉదయం 11 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథులు. ఆవుల మంజులత, సి.మృణాళిని, ఎల్.వి. సుబ్రహ్మణ్యం, కె.వి.రమణాచారి, కె. రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, వెల్దండ నిత్యానందరావు, తనికెళ్ళ భరణి, మాడభూషి శ్రీధర్, టి. కిషన్‌రావు, నిఖిలేశ్వర్, అయినంపూడి శ్రీలక్ష్మి, ఓలేటి పార్వతీశం తదితరులు పాల్గొంటారు.

– వెల్చాల కొండలరావు (విశ్వనాథ సాహిత్యపీఠం)

బాలలకు రాజ్యాంగ విలువలు

నేటి బాలలే రేపటి పౌరులు. 142 కోట్ల భారతదేశ జనాభాలో 15 ఏళ్లలోపు ఉన్న బాలలు 36 కోట్ల మంది ఉన్నారు. దేశ జనాభాలో వీరు 25.4శాతం. భావిభారతావని ముఖచిత్రాన్ని మార్చే మూల స్తంభాలే ఈ చిన్నారులు. కుల, మత భావోద్వేగాలను రాజకీయాలకు వాడుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో భారత రాజ్యాంగ విలువలను నేటి బాలలకు నేర్పించడం అత్యావశ్యకం.

నవ భారత నిర్మాత డా. బిఆర్ అంబేడ్కర్ చెప్పినట్లు ఆశయాలను ఆచరణలో పెడితే మానవుడే మహనీయుడు అవుతాడు. భారతదేశ ప్రజలందరి ఆశయాల కూర్పే మన రాజ్యాంగం. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 74 సంవత్సరాలు పూర్తయ్యాయి. జాతి జీవనంలో భిన్నత్వంలో ఏకత్వం కొనసాగడానికి రాజ్యాంగం ఎంతో దోహదపడింది. భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది.

భారత రాజ్యాంగం అత్యున్నత విలువలతో కూడుకున్నది. ప్రజలు, కుల, మత, భాష, లింగ, ప్రాంత, జాతి మొదలైన తారతమ్యాలు లేకుండా అందరూ సమానమేనని రాజ్యాంగం పునరుద్ఘాటించింది. స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం, సమ న్యాయం, లౌకికవాదం సమగ్రత మొదలైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా ఆచరించేలా రూపొందించారు. భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, ఆదేశ సూత్రాలతో దేశ ప్రజలందరూ ఒక్కటే అని చాటి చెప్పింది. నేటి బాలల్లో చిన్నప్పటి నుంచే భారత రాజ్యాంగ విలువలు పెంపొందించాలి. ప్రజలంతా ఒకటే అనే భావన వారి మనసుల్లో నాటేందుకు, సామాజిక, ఆర్థిక అంతరాలు మనుషులను దూరం చేయకూడదనే సమతా భావం పెంపొందించేందుకు బాలలకు భారత రాజ్యాంగ విలువలు బోధించాలి. బాలలకు భారత రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించుట కోసం బాల్యం నుంచే ప్రతిరోజు బడుల్లో ప్రార్థన సమయంలో విధిగా భారత రాజ్యాంగ ప్రవేశిక చదివించాలి. దీని ద్వారా భారత రాజ్యాంగంపై బాల్యం నుండే బాలలకు గౌరవం, అధ్యయనం చేయాలనే ఆలోచన పెరుగుతుంది.

బాలల్లో రాజ్యాంగ విలువలు, లక్ష్యాల మీద పూర్తి అవగాహన కల్పించడం వల్ల వారిని అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్ది భవిష్యత్ తరానికి అందించినవారమవుతాము. రాజ్యాంగ రచయితల ఆశయ సాధనకు కృషి చేసినవారమవుతాము. ఒక రాజ్యాంగం ఎంత మంచిదైనా, గొప్పదైనా కావచ్చు కానీ దానిని అమలు చేసే వాళ్ళు చెడ్డవాళ్ళు అయితే అది పని చేయదు అని డాక్టర్ అంబేడ్కర్ చెప్పారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత భారతీయులందరిపైన ఉంది. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ తీసుకొని బాలల్లో భారత రాజ్యాంగ విలువల పెంపుపై నిర్ణయం తీసుకొని రాజ్యాంగ మౌలిక లక్ష్య సాధన కోసం అన్ని విద్యా సంస్థల్లో ప్రార్థన సమయంలో భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించేలా చర్యలు తీసుకోవాలి. రాజ్యాంగ మౌలిక లక్ష్యాలపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కలిగేలా కార్యక్రమాలు చేపట్టాలి.

– పాకాల శంకర్‌గౌడ్

(నవంబర్ 26: భారత రాజ్యాంగ దినోత్సవం)

ఈ విభజనలతో దేశం ఏమయ్యేట్టు?

రాజకీయ పార్టీలు సమాజాన్ని విడగొడుతున్నాయన్నది ప్రస్తుతం దేశమంతటా తీవ్రస్థాయిలో చర్చింపబడుతున్న విషయం. ఎన్నికల సమయంలో ప్రధాన జాతీయ పార్టీలు రెండూ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. హిందూ సమాజాన్ని కులాలుగా విడగొట్టుతున్నారని ఒక పార్టీ ఆరోపణ. హిందువులు–ముస్లింలను విడగొడుతున్నారని మరొక పార్టీ ఆరోపణ. ఈ రెండు ఆరోపణల్లోనూ కొంత సత్యం ఉంది. అయినా దేశ సంరక్షణ, దేశ సమైక్యత దృష్ట్యా ఏ వాదం సరైనది అన్న విషయాన్ని పరిశీలించాలి.

హిందూ సమాజాన్ని కులాలుగా విడగొడుతున్నారు అనే ఆరోపణను చూద్దాం. హిందూ సమాజంలో 4 వర్ణాల వ్యవస్థ అనాదిగా ఉంది. అన్ని ప్రాచీన సంస్కృతుల్లో అలాగే ఉండేది. ఈ వ్యవస్థను వేదంలోని కొన్ని భాగాల్లోనూ, భగవద్గీతలోనూ చూడగలం. మత గ్రంథాలే ఈ విభజనకు మూలం అని అంగీకరించాలి. అయితే సమాజం అవసరాలను బట్టి, వృత్తుల ఆధారంగా ఏర్పడిన అనేక కులాలు – కమ్మరి, కుమ్మరి, నేతకారులు, స్వర్ణకారులు మొదలైనవి, వృత్తుల ఆధారం కాకుండా ఏర్పడిన కులాలు –రెడ్డి కమ్మ మొదలైన వేలాది కులాలకు హిందూమత గ్రంథాలు మూలం కాదు. అనేక సామాజిక కారణాల వల్ల ఏర్పడినవే ఆ కులాలు. అయినా సమాజంలో ఆదివరకు నాలుగు వర్ణాల మధ్య ఉన్న హెచ్చుతగ్గుల భావన ఈ వేలాది కులాలకు కూడా వర్తింపబడింది. మతంతో ప్రమేయం లేకుండా కేవలం సమాజంలోని వ్యక్తులు చేసిన విభజన ఇది.

వృత్తిని బట్టి ఏర్పడిన కులాలు యూరప్ లాంటి దేశాల్లో ఉన్నప్పటికీ పారిశ్రామిక విప్లవం తర్వాత అవి సమసిపోయాయి. బ్రిటిష్ పాలనలో ఉన్నందువల్ల మనదేశంలో పారిశ్రామిక విప్లవం రాలేదు, సమాజంలో మార్పు రాలేదు. దానికి భిన్నంగా బ్రిటిష్ ప్రభుత్వం కులాల లెక్కింపును చేపట్టి కులాల మధ్య హెచ్చుతగ్గుల్ని నిర్ణయించి, కొన్ని వర్గాలకు రాయితీలు ఇవ్వడం కొన్ని వర్గాలను దూరం ఉంచడం ద్వారా కులవ్యవస్థను మరింత పటిష్ఠం చేసింది. అంతేకాక కొన్ని వర్గాలపై పీడించబడ్డవారు, మరికొన్ని వర్గాలపై పీడించే వర్గాలు అనే ముద్రను వేసింది. దీని ద్వారా వలసపాలకుల వ్యూహంలో భాగమైన మతాంతరీకరణ సులభమయింది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దురదృష్టవశాత్తు రాజకీయ కారణాలవల్ల కులాల పార్టీలు ఏర్పడడం, అలాగే సామాజిక న్యాయం పేరిట కొన్ని వర్గాలకు రాయితీలు ఇవ్వడం, వారిని ఓటు బ్యాంకులుగా తయారు చేయడం వల్ల సహజంగా సమసిపోవాల్సిన కులవ్యవస్థ మరింత పటిష్ఠంగా నిలిచింది.

ఇప్పుడు రెండవ ఆరోపణను పరిశీలిద్దాం. ఒక జాతీయ పార్టీ హిందువులను, ముస్లింలను విడదీస్తోందని ఆరోపణ. హైందవం, ఇస్లాం రెండూ మతాలే. వీటికి విభిన్న సిద్ధాంతాలున్నాయి. హిందూ సిద్ధాంతంలో ఇతర మతాలను నిర్మూలించాలన్న, ప్రపంచమంతా హిందూ మతాన్ని వ్యాపింపజేయాలన్న ఆదేశాలు లేవు. ఇస్లాంలో ఈ విషయమై స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అందువల్ల ఇస్లాంను నమ్మేవారు, నమ్మనివారు అంటూ ప్రపంచంలోని మనుషులందరూ రెండు వర్గాలుగా విభజింపబడ్డారు. తమ మతాన్ని నమ్మని వారిని క్రమక్రమంగా తమ మతంలోకి తీసుకురావడమే దేవుడిచ్చిన ఆదేశం. కాబట్టి ఈ రెండు వర్గాలను కలిపి ఉంచాలని ఒక వర్గం వారు చేస్తున్న వాదన ఎంతవరకు ఆచరణలో సాధ్యమవుతుందో తెలియదు.

మత గ్రంథం ఆధారంగా ఇదివరకే విడిపోయిన వారిని ఇప్పుడు ఎవరు విడదీస్తున్నట్లు? మన దేశానికి స్వతంత్రం రాక ముందు నుండి ఒక వర్గం వారు మరొక వర్గంపై ఇదే ఆరోపణను చేస్తూ వచ్చారు. వీరు ఒక విధంగా ఆశావాదులు, అందరూ కలిసి ఉంటారు అనే భావన కలిగినవారు. ఈ వాదన అందరికీ ఉదారవాదంగాను, ఆమోదయోగ్యంగాను కనిపిస్తుంది. కానీ హిందువులు ముస్లింలు ఒకటిగా ఉండలేము అనే వాదనతోనే భారతదేశ విభజన జరిగింది. మేము హిందువులతో కలిసి ఉండలేమన్న వాదన ఇస్లాం నుండి వచ్చింది. ఇప్పుడు కూడా, భారతదేశాన్ని ఇస్లామిక్ దేశంగా మార్చడం తమ లక్ష్యం అంటూ ఆ మత పెద్దలు అనేక మంది బాహాటంగా ప్రకటించడాన్ని చూస్తున్నాం. స్వాతంత్ర్య సాధన తర్వాత 70 ఏళ్లకు పైగా క్రమక్రమంగా ముస్లిం సమాజం ఒక పార్టీకి ఓటు బ్యాంకుగా మారింది. అలాగే క్రైస్తవ సమాజం కూడా. దీనికి తోడు మరిన్ని ఓటు బ్యాంకుల్ని పొందగలిగితే శాశ్వతంగా అధికారంలో ఉండగలమనే వ్యూహం ఒక జాతీయ పార్టీది. అందువల్ల ఈ రెండు వర్గాలను కలపడం అనే వాదన ఆశావాదమా లేక అవకాశవాదమా అని సందేహం కలుగుతుంది. అమెరికాలో ఇటీవలి పరిణామాల్ని గమనిస్తే సరిగ్గా ఇలాంటి వ్యూహాన్ని ఒక పార్టీ వారు అమలు చేశారు కానీ ఊహించిన ఫలితాలు రాలేదు.

మనదేశంలో ఈ రెండు వర్గాలు చేస్తున్న ప్రయోగాల పరిణామాలు ఎలా ఉంటాయి? మొదటగా కులాల లెక్కింపును గమనిద్దాం. సామాజిక మార్పు, ఆధునికీకరణ వల్ల సహజంగా కనుమరుగవడానికి సిద్ధంగా ఉన్న కులాలను మళ్లీ లేవగొట్టి వారి మధ్య గోడల్ని పటిష్ఠం చేయడం వల్ల కులాల వారీగా ప్రాంతీయ పార్టీలు రావచ్చు. హిందూ మతానికి కులాలకు సంబంధం లేకపోయినా ఈ కులాలన్నిటికీ హిందూ మతమే కారణం అని హిందూ మతంపై నింద కూడా పడుతుంది. కులాల హెచ్చుతగ్గులపైన మరిన్ని వ్యాసాలు, కథనాలు (narratives) రావడం వల్ల తాము పీడింపబడినవారు అనే భావన కొన్ని వర్గాల్లో పెరగడం, ఇతర మతాల్లోకి వెళ్లడం సహజంగా జరుగుతుంది. రెండు అబ్రహామిక్ మతాలు బలపడినప్పుడు దేశాన్ని ఏ విధంగా విభజించగలం అని సుమారు 15 సంవత్సరాల క్రితం అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో చేసిన విశ్లేషణలను రాజీవ్ మల్హోత్రా 'బ్రేకింగ్ ఇండియా' అనే పుస్తకంలో ముఖచిత్రంగా చూపారు. భారతదేశం ఆ విధంగా మూడు, నాలుగు భాగాలుగా విభజింపబడే అవకాశం ఉంటుంది. భారతదేశం ప్రపంచంలో ఒక శక్తిగా ఎదుగుతున్నదని ఒకవైపు భావిస్తున్న సమయంలో ఇలాంటి పరిణామాలు దానికి వ్యతిరేక దిశలో దేశాన్ని లాక్కు వెళతాయి.

సంతృప్తికరణ విధానంతో ఒక వర్గానికి పెద్దపీట వేయడం మరొక వర్గంలో అసంతృప్తినే నిలుపుతుంది. అందువల్ల రెండు వర్గాలను వీరు కూడా విడదీసినట్లే. అంతేగాక హిందూ సమాజంలో దానిపట్ల రియాక్షన్ (ప్రతిక్రియ) వచ్చి వారందరూ ఏకమయ్యే అవకాశం ఉంది. అలాంటి అవకాశం ఇవ్వకుండా వారిని కులాలుగా చీల్చడం అన్నది అధికారం పొందాలనే వ్యూహంలో ఒక ఎత్తుగడ కావచ్చు. సామాజిక న్యాయం కోసం ఇప్పుడు ఎవరూ ఆందోళన చేయడం లేదు. చాలా కులాలవారు వారి అస్తిత్వాన్ని మరిచిపోవాలనే భావనతో ఉన్నారు. అయినా మళ్లీ వారి నెత్తిన కులం స్టాంపు వేయడం ఎంతవరకు సబబు తెలియదు.

అలాగే అవకాశవాద పార్టీలు కొన్నాళ్లు అధికార పీఠంపై వెలగవచ్చు. కానీ ఒకానొక స్థాయిలో జనాభా నిష్పత్తులు మారినప్పుడు ఈ పార్టీలు కనుమరుగై అబ్రహామిక్ మతాల ప్రభావంలోకి వెళతాయి. ప్రపంచమంతా గౌరవాన్ని పొందిన ఉపనిషత్ సిద్ధాంతం కేవలం కులం అనే కళంకంతో నిర్మూలించబడవచ్చు.

ఇప్పుడు హిందువులు, ముస్లింలు అంటూ సమాజాన్ని విడగొడుతున్నారనే ఆరోపణను చూద్దాం. దీనిలో కొంతవరకు నిజం ఉంది. ఇన్నాళ్లు అందరికీ తోడు, అందరికీ ప్రగతి అంటూ మాట్లాడిన పార్టీ ఎలక్షన్ సమయంలో ముస్లిం వ్యతిరేకంగా మాట్లాడడం ప్రజలకు నచ్చినట్లు కనపడదు. ఇదివరకటి ప్రభుత్వాల కన్నా ఎక్కువగా ఇచ్చామని గణాంకాల్ని కూడా ఇదివరలో చూపించారు, కానీ ఎన్నికల సమయంలో దానికి విరుద్ధంగా మాట్లాడడం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. దీనివల్ల ఆ పార్టీకి ఇదివరకే వ్యతిరేకంగా ఉన్న ఓటు బ్యాంకు మరింత పటిష్ఠమైంది. పోతే హిందూ సమాజం పూర్తిగా ఒకటి కాలేదు. మత ప్రాతిపదికపై సమాజాన్ని విడదీస్తున్నారనే ఆలోచనను హిందూ సమాజంలోని కొన్ని వర్గాలు హర్షించవు. ఈ ప్రయోగం ఫలితాలను సాధిస్తుందా లేదా చెప్పలేము కానీ ఆ పార్టీకి గౌరవప్రదంగా ఉందని చెప్పలేం.

మైనారిటీల సహాయంతో అధికారంలోకి వచ్చిన పార్టీలు మైనారిటీల డిమాండ్లకు లొంగాల్సి ఉంటుంది. ప్రభుత్వం క్రమక్రమంగా నిర్వీర్యమవుతుంది. ఈ పరిస్థితిని దేశంలోని అనేక రాష్ట్రాల్లో చూడగలం. అలాంటి వాతావరణం రాకుండా నివారించడం ప్రభుత్వం బాధ్యత. సమాజంలో జరిగే పరిణామాలను పోలీసు గాని ఆర్మీ కాని నివారించలేని పరిస్థితులు ఏర్పడతాయి. సమాజంలోని అనేక వర్గాలకు న్యాయం చేకూరదు.

పైన మనం గమనించినట్లు తమ మత గ్రంథం ఆదేశాల ప్రకారం ఇస్లాం మిగతా మతాలకు దూరంగా ఉంటుందని, వాటితో కలిసి ఉండలేదని చెప్పగలం. భారతదేశ చరిత్ర, ఇటీవల చరిత్ర కూడా ఇందుకు సాక్ష్యం. హిందూ సమాజాన్ని ఏకం చేయాలి అనే భావన మంచిదే కానీ దానికి మరేదో మార్గంలో ప్రయత్నించాలి. హిందూ మతాచార్యులు కూడా దానికి తోడ్పడాలి.


కులాల లెక్కింపు చేస్తున్న పార్టీ కూడా ఆత్మ విమర్శ చేసుకోవడం అవసరం. తమ ప్రయోగం నిజానికి సామాజిక న్యాయాన్ని ఉద్దేశించినదేనా లేదా ఏదో విధంగా ఓటు బ్యాంకుల కూడికలతో అధికారంలోకి వచ్చే ప్రయత్నమా అని ప్రశ్నించుకోవాలి. ఒకప్పుడు బ్రిటిష్ పాలకులు సమాజాన్ని విభజించే ఎజెండాతో ఆచరించిన విధానాన్ని తాము మళ్లీ ఆచరణలో పెడుతున్నామని, అది మరొకసారి దేశ విభజనకు కూడా దారి తీయవచ్చని ఆ పార్టీ గ్రహించాలి.

మైనారిటీల సహాయంతో అధికారంలోకి వచ్చిన పార్టీలు మైనారిటీల డిమాండ్లకు లొంగాల్సి ఉంటుంది. ప్రభుత్వం క్రమక్రమంగా నిర్వీర్యమవుతుంది. ఈ పరిస్థితిని దేశంలోని అనేక రాష్ట్రాల్లో చూడగలం. సమాజంలో జరిగే పరిణామాలను పోలీసు గాని ఆర్మీ కాని నివారించలేని పరిస్థితులు ఏర్పడతాయి. సమాజంలోని అనేక వర్గాలకు న్యాయం చేకూరదు.





■ కె. అరవిందరావు
మాజీ డీజీపీ





ఎమ్మెల్సీ ఛాన్స్ ఎవరికో?

మార్చిలో ఖాళీ కానున్న నాలుగు శాసనమండలి స్థానాలు

- ఎమ్మెల్యేల కోటాలో పెద్దల సభకు అవకాశాలపై పార్టీల్లో చర్చ
- కాంగ్రెస్ నుంచి తెరపైకి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు పేరు
- సీఎం రేవంత్‌రెడ్డి గతంలోనే హామీ ఇచ్చారంటున్న వర్గీయులు
- ప్రయత్నాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి, ఝాన్సీరెడ్డి, ఇందిర
- ఇప్పటికే సీఎం, పలువురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడిపై ఒత్తిడి
- 'గులాబీ' అధిష్ఠానం దృష్టిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి పేరు?
- మళ్లీ హాట్‌టాపిక్‌గా మారిన ఓరుగల్లు పాలిటిక్స్



కొండా మురళీధర్‌రావు, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మామిండ్ల ఝాన్సీరెడ్డి, శనిగరపు ఇందిర

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వచ్చే మార్చిలో ఎమ్మెల్యేల కోటాలో నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. వాటిలో ప్రస్తుతం శాసనసభలోని బలబలాల దృష్ట్యా కాంగ్రెస్‌కు మూడు, బీఆర్‌ఎస్‌కు ఒకటి దక్కే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నుంచి ఆశావాహులు ఎమ్మెల్సీ సీట్లపై నజర్ వేశారు. ప్రధానంగా కాంగ్రెస్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అవకాశం దక్కని వారితో పాటు పలువురు సీనియర్ నేతలు ఎమ్మెల్సీ సీటు దక్కించుకునేందుకు అధిష్ఠానం వద్ద పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో ఓరుగల్లు నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు మరోసారి శాసనమండలిపై కన్నేశారనే చర్చ జరుగుతోంది. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, శనిగపురం ఇందిరతో పాటు మామిండ్ల ఝాన్సీరెడ్డి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఇక బీఆర్‌ఎస్ నుంచి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేరును అధిష్ఠానం పరిశీలిస్తోందని సమాచారం. ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ స్థానాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఎవరికి సీటు దక్కుతుందోనన్న ఉత్కంఠ ఓరుగల్లు రాజకీయాల్లో నెలకొంది.

ఎమ్మెల్సీ సీటుపై కొండా దృష్టి?

ప్రస్తుతం అధికార పార్టీలో ఎమ్మెల్సీ సీటుపై తీవ్ర పోటీ నెలకొంది. మరో నాలుగు నెలల్లో శాసనసభ్యుల కోటాలోని ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఇప్పటి నుంచే అధిష్ఠానం వద్ద నేతలు పైరవీలు చేస్తుండగా, మరికొందరు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని గుర్తు చేస్తున్నారు. ప్రధానంగా మంత్రి కొండా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు శాసనసభ్యుల కోట నుంచి ఎమ్మెల్సీ రేసులో ఉన్నారనే చర్చ జరుగుతోంది. 2023 ఎన్నికల్లో పరకాల నుంచి పోటీకి మురళీ ప్రయత్నాలు చేశారు. ఎన్నికల తరువాత ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తామని నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వటంతో ఆయన పరకాల బరి నుంచి తప్పుకున్నారని అప్పట్లో చర్చించుకున్నారు. ఆ తరువాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పోచమ్మమైదాన్ వద్ద జరిగిన సభలో కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి స్వయంగా మురళికి పదవి ఇచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ప్రస్తుతం శాసన సభ్యుల కోటాలో ఎమ్మెల్సీ సీట్లు ఖాళీ అవుతుండటంతో కొండా మురళికి ఎమ్మెల్సీ పదవీపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టుగా సమాచారం. 2009లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించి తొలిసారి శాసన మండలిలో కొండా మురళి అడుగు పెట్టారు. ఆ తరువాత 2015 డిసెంబరు 11న జరిగిన ఎన్నికల్లో రెండోసారి బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే 2021వరకు ఎమ్మెల్సీగా పదవీకాలం ఉన్నప్పటికి 2018లో కొండా దంపతులు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మారిన నేపథ్యంలో 2018 డిసెంబరు 22న ఎమ్మెల్సీ పదవికి కూడా కొండా మురళీధర్‌రావు రాజీనామా చేయాల్సి వచ్చింది. మూడోసారి శాసన మండలిలో అడుగు పెట్టేందుకు మురళీధర్‌రావు ప్రయత్నాలు చేస్తున్నారనే చర్చ జరుగుతోంది.

తెరపైకి కొమ్మూరి, ఝాన్సీ, ఇందిర పేర్లు..

కాంగ్రెస్ నుంచి మరికొందరు కీలక నేతలు ఎమ్మెల్సీ సీటుపై దృష్టి పెట్టారు. వీరిలో జనగామ మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఆఫర్ వచ్చిందనే చర్చ జరుగుతోంది. 2004లో అప్పటి చేర్యాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రతాప్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తరువాత

మిగతా 8వ పేజీలో..

గులాబీ సీటు ఎర్రబెల్లికేనా?

ఎమ్మెల్యే కోటలో నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతుండగా అందులో బీఆర్‌ఎస్‌కు పక్కాగా ఒక సీటు దక్కుతుందని, ఆ సీటును మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కేటాయిస్తారనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి వరంగల్‌కు చెందిన మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ పదవి కాలం కూడా ఈ మార్చిలోనే పూర్తవుతుండగా.. తనకు మరోసారి అవకాశం కల్పిస్తారనే ఆశతో సత్యవతి ఉన్నట్టు సమాచారం. అయితే ప్రస్తుతం కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అనే విధంగా రాష్ట్రంలో రాజకీయాలు ఉండటంతో బలమైన నేతను మండలికి పంపించాలని గులాబీ బాస్ కేసీఆర్ భావిస్తున్నారని సమాచారం. ఎర్రబెల్లితో పాటు మరో నలుగురైదుగురి పేర్లను కూడా పరిశీలిస్తున్నప్పటికి ప్రధానంగా ఎర్రబెల్లి వైపే అధిష్ఠానం మొగ్గు చూపుతారన్న అంచనాలున్నాయి. కాగా, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఎర్రబెల్లి ఏడు సార్లు చట్టసభలకు ఎన్నికయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎర్రబెల్లి క్రియ శీలకంగా రాజకీ యాల్లో ఉండటంతో గులాబీ అధిష్ఠానం దయాకర్‌రావుకే అవకాశం ఇస్తుందనే చర్చ గులాబీ వర్గాల్లో జరుగుతోంది.



అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

అధికారుల సమీక్షలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద



కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె మామునూరు ఎయిర్‌పోర్ట్, మెగా టెక్స్‌టైల్ పార్కు, ఇన్నర్ రింగ్‌రోడ్ పనులపై వరంగల్ కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరంగల్ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రతీ మంగళవారం సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో అధికారులు నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు నాగేశ్వర్‌రావు, ఇక్బాల్, రాజ్‌కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ జితేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ, నేషనల్ హైవే అధికారి సల్మాన్‌రాజ్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలి..

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో చేపట్టే పనులు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో ఉపాధిహామీ పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యటించి ఏ గ్రామానికి ఏది అవసరమో గుర్తించి పనులు చేపట్టాలని ఎంపీడీవోలు, ఏపీవోలకు సూచించారు. ఈనెల 26న పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఇందిరా మహిళా శక్తి, ఉపాధి భరోసా కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామాన్ని సందర్శించి ఎలాంటి పథకాలు కావాలనేది దిశనిర్దేశం చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీపీవో కల్పన, సీపీవో గోవిందా రాజన్, ఎంపీడీవోలు, ఏపీవోలు, అధికారులు పాల్గొన్నారు.



మహిళల రక్షణ గురించే తెలిపే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ

వేధింపులపై మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

6



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

అభివృద్ధి పనులలో వేగం పెంచండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పను లు వేగవంతంగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రగతి, ముఖ్యమంత్రి (సీఎంఏ) హామీ నిధులు, జీవో 65 జనరల్ ఫండ్ తదితర పనులపై కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూడీజీ) పనులు మూడు మాసాల్లో పూర్తి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు శ్రీనివాస్, సంతోష్‌బాబు, డీఈ శ్యాం మోహన్, ఏఈ సౌజన్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- జేఎన్ఎస్‌లో సందడిగా ప్రారంభమైన దివ్యాంగుల క్రీడా పోటీలు



జెండా ఊపి దివ్యాంగుల క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 22:(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం అండగా ఉంటోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ జేఎన్ఎస్‌లో జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో దివ్యాంగులు అందరితో సమానమేనని, వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తాను రాజకీయాల్లోకి రాక ముందు పలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా దివ్యాంగులకు కృత్రిమకాళ్లు, చేతులు, అవయవాలు, బ్యాటరీ సైకిళ్లు అందజేశానన్నారు. చిన్నారుల్లో జన్యుపరమైన లోపాలను అంగన్‌వాడీ సెంటర్లలలో ముందస్తుగానే గుర్తించాలన్నారు. మాటలు రాని దివ్యాంగులకు ప్రత్యేకంగా స్పీచ్ థెరపీ, మానసిక వైద్య నిపుణుల ద్వారా చికిత్స అందిస్తే 80 శాతం వ్యాధి బారినుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో 5శాతం దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించి మంజూరు చేశారన్నారు. విశిష్ట అతిథి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దివ్యాంగులు సంకల్ప సిద్ధులని వారికున్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే వారు ఎంచుకున్న రంగాల్లో రాణిస్తారని అన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, రానున్న అసెంబ్లీ సమావేశాల్లో దివ్యాంగుల సంక్షేమం కోసం చర్చిస్తామన్నారు. దివ్యాంగుల సంఘ ప్రతినిధులు, అధికారులు, సంబంధిత డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించారు.

కాగా, జిల్లా స్థాయిలో ఒక్క రోజు పాటు క్యారం, చెస్, అథ్లెటిక్స్, షాట్‌పుట్ క్రీడాంశాల్లో నిర్వహించిన పోటీల్లో సుమారు 300మంది దివ్యాంగులు పాల్గొన్నారు. ఇక్కడ జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున జిల్లా అధికారుల చేతుల మీదుగా బహుమతులను, ట్రోఫీలను, సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నారు ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ఇన్‌చార్జి డీవైఎస్‌వో శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, రెడ్ క్రాస్ సొసైటీ ఈసీ మెంబర్ శ్రీనివాస్, పారా త్రోబాల్ క్రీడాకారుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ట్స్ కళాశాల మైదానంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎంవోయూల మార్పిడి (ఫైల్)

స్వయం సంఘాలకు సోలార్ ప్లాంట్లు

- ఎస్‌హెచ్‌జీలకు అప్పగించేందుకు సర్కారు ఏర్పాట్లు
- రేవంత్ సమక్షంలో కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 54 మెగావాట్ల ఉత్పత్తికి కసరత్తు
- స్థల సేకరణలో డీఆర్‌డీఏ అధికారులు నిమగ్నం
- ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు రూ.4కోట్లు వ్యయం
- ఎస్‌హెచ్‌జీల వాటా పది శాతం.. మిగతా మొత్తం బ్యాంకు రుణం

8

అర్ధరాత్రి అలజడి

వాజేడులో మావోయిస్టుల ఘాతుకం

- పోలీసు ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరి హత్య
- మారణాయుధాలతో దాడి చేసి హతమార్చిన వైనం
- 2007 తరువాత అతి పెద్ద సంఘటన
- మృతుల్లో ఒకరు పంచాయతీ కార్యదర్శి, మరొకరు కూలీ
- ఇద్దరూ వరసకు సోదరులు
- న్యాయం చేయాలని మృతదేహాలతో కుటుంబీకుల ధర్నా



ఉయిక రమేష్ మృతదేహం

రమేష్(ఫైల్)

అర్జున్(ఫైల్)

అర్జున్ మృతదేహం

మన్యంలో అర్ధరాత్రి అలజడి రేగింది. ఆదివాసీ ప్రాంతమైన వాజేడు మండలంలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారన్న నెపంతో ఇద్దరిని కిరాతకంగా హత్యచేశారు. గురువారం అర్ధరాత్రి సమయంలో తమ తమ ఇళ్లలో నిద్రలో ఉన్న ఆ ఇద్దరిపై ఏకకాలంలో గొడ్డళ్లు, కత్తులతో దాడి చేసి హతమార్చారు. పెనుగోలు కాలనీలో జరిగిన ఈ ఘటనలో పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేష్, అతడి పెదనాన్న కుమారుడైన ఉయిక అర్జున్ మృతిచెందారు. ఈ విషయం తెల్లవారేసరికి మన్యమంతా వ్యాపించడం తో గిరిపల్లెలు భయం గుప్పిట బిక్కుబిక్కుమంటు న్నాయి. ఏజెన్సీ మండలాల్లో ఇప్పటికే మావోయిస్టుల టార్గెట్‌గా ఉన్న నేతలు, వ్యాపారులు సురక్షిత ప్రాంతాలకు తరలినట్టు తెలుస్తోంది. సురక్షిత ప్రాంతంగా ఉన్న వాజేడులో పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో మావోయిస్టులు ఈ ఘటనకు పాల్పడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. 2007 తర్వాత వాజేడు ప్రాంతంలో జరిగిన అతిపెద్ద సంఘటన కావడం అందరిలోనూ ఆందోళన రేకెత్తిస్తోంది.

\- వాజేడు, ఆంధ్రజ్యోతి

8





ఎన్పీడీసీఎల్ సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు

పదోన్నతులపై సీఎండీకి ధన్యవాదాలు

హనుమకొండ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్‌లో పదోన్నతులు కల్పించడానికి చొరవ చూపిన సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిని రాష్ట్ర విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, సెక్రెటరీ అంజయ్య, ఫైనాన్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ తిరుపతిరెడ్డి శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చారిటబుల్ ట్రస్టుకు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈకార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ కంపెనీ అధ్యక్షుడు వి.వేణుబాబు, సెక్రెటరీ ఎం.సుదర్శన్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ నట్టి ఉపేందర్, నవీన్‌కుమార్, కార్యదర్శి వెంకట్, జెన్కో, ట్రాన్స్‌కో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న 'ఎల్కతుర్తి సమాఖ్య'



హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న సమాఖ్య సభ్యులు

ఎల్కతుర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవిల్లో గుర్తింపు పొందిన ఎల్కతుర్తి మండల సమాఖ్య సభ్యులు శుక్రవారం జాతీయ స్థాయి అవార్డును అందుకున్నారు. ఏపీ మాస్ (ఆంధ్రప్రదేశ్ మహిళ అభివృద్ధి సంస్థ), ఎస్బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), ఎఫ్‌డబ్ల్యూడబ్ల్యూ, డీజీఆర్‌వీలు సంయుక్తంగా 2014 సంవత్సరానికి జాతీయ స్థాయి ఎస్‌హెచ్‌జీ ఫెడరేషన్ అవార్డులను ప్రకటించగా ఉత్తమ పనితీరు కలిగిన ఎల్కతుర్తి మండల ఎస్‌హెచ్‌జీ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైంది. దీంతో హైదరాబాద్‌లో ఎస్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్, ఏపీ ఎంఏఎస్ ఉపాధ్యక్షుడు మహావరాలి, ఈఎస్ఏపీ సీఈవో, ఎండీ పాల్‌థామస్, సీఈవో సీఎస్ రెడ్డిలు ప్రశంస పత్రంతో పాటు షీల్డు, రూ. లక్ష నగదును ఎల్కతుర్తి సమాఖ్య సభ్యులకు అందజేశారు. అవార్డును అందుకోవడం గర్వంగా ఉందని సమాఖ్య సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు స్వర్ణలత, కార్యదర్శి శైలజా, అదనపు ప్రాజెక్టు అధికారి సుధీర్‌కుమార్, ఏపీఎం రవిందర్‌లు పాల్గొన్నారు.

ఆటోలో వెళ్తుండగా ఆభరణాల చోరీ

వరంగల్ చౌరస్తా, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చెవి కమ్మలను రిపేర్ చేయించి హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకొని ఆటోలో వెళ్తుండగా దొంగలు బ్యాగ్ లాక్కెళ్లారు. ఈ మేరకు బాధితులు శుక్రవారం ఇంతేజార్ గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గీసుగొండ మండలం కొనాయిమాకుల గ్రామానికి చెందిన అమీనా బేగం.. తన భర్త హైదర్‌పాషాతో కలిసి శుక్రవారం వరంగల్ చౌరస్తాలో ఆటో ఎక్కి వెళ్లే క్రమంలో హ్యాండ్‌బ్యాగ్ దొంగిలించారని, కమ్మల విలువ రూ. 65 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమితి ఆవిర్భావం

త్వరలో పట్టణ, మండల, నియోజకవర్గ కమిటీల ఏర్పాటు : వ్యవస్థాపకులు దార్ల రమాదేవి, మచ్చిక నర్సయ్యగౌడ్‌ల వెల్లడి



నర్సంపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యమకారులు

నర్సంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట నియోజకవర్గంలోని బీఆర్ఎస్‌కు చెందిన ఆరు మండలాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు నర్సంపేటలో శనివారం ఉద్యమనాయకులు దార్ల రమాదేవి, మచ్చిక నర్సయ్యగౌడ్, అప్పాల సుదర్శన్ ఆధ్వర్యంలో సమావేశమై తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమితిని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా ఉద్యమాల గడ్డగా పేరుగాంచిన నర్సంపేటలో టీఆర్‌యూఏఎస్ ఆవిర్భవించడం చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా ఉద్యమ నాయకులు దార్ల రమాదేవి, మచ్చిక నర్సయ్య, అప్పాల సుదర్శన్ మాట్లాడుతూ.. ఉద్యమ నేత కేసీఆర్ నాయకత్వంలో టీఆర్‌యూఏఎస్ పనిచేస్తుందన్నారు. ఉద్యమకారుల హక్కుల కోసం సమితి పాటుపడుతుందన్నారు. 2021నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పనిచేసి నష్టపోయిన ఉద్యమకారులకు అండగా ఉంటుందన్నారు. ఎన్నికల ముందు ఉద్యమకారులకు మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం కోసం సమితి ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలను కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. నర్సంపేటలో ఆవిర్భవించిన టీఆర్‌యూఏఎస్ రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటై హక్కుల కోసం ఉద్యమిస్తుందన్నారు. త్వరలో గ్రామ, పట్టణ, మండల, నియోజకవర్గ స్థాయి, జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కమిటీలు ఏర్పాటైన తర్వాత టీఆర్‌యూఏఎస్ కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతుందన్నారు.

ఈ సమావేశంలో ఉద్యమ నాయకులు బైరి తిరుపతిరెడ్డి, డ్యాగల శ్రీనివాస్, గుండెకారి రంగారావు, కుంచారపు వెంకట్‌రెడ్డి, గాదె భద్రయ్య, గాదె జనార్దన్‌రెడ్డి, డ్యాగల శ్రీనివాస్, పులిగిల్ల యాదగిరి, తనుగుల సుధాకర్, కొర్ర గవర్‌సింగ్, పెండ్యాల యాదగిరి, జమాండ్ల చంద్రమౌళి, బానోతు కిషన్‌నాయక్, పల్నాటి సాంబయ్య, దొంగల సురేశ్, వల్లెపు శ్రీనివాస్, మోడెం విద్యాసాగర్, పెండ్యాల కృష్ణ, కాలె రాజు, దోనాల రవి, మునిగాల సాయికృష్ణరెడ్డి, పెరుమాండ్ల ప్రభాకర్ రెడ్డి, ఇర్ఫాన్, గాండ్లోజు భాస్కర్, దండిగె రమేశ్, ఊరటి అమరేందర్, కట్ట స్వామి, రమేశ్, భిక్షపతి, ఐలోని రాజమౌళి, ఆకారపు చందర్, వీరస్వామి, సాంబయ్య, కుమార స్వామి, కోటి, సుధీర్ రెడ్డి, పెరుమాండ్ల రవి ఆరు మండలాల ఉద్యమకారులు పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి తెలియకుండా ఆ పార్టీ ఉద్యమకారులు సమావేశమై టీఆర్‌యూఏఎస్‌ను ఏర్పాటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

కోలాహలంగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 22: (ఆంధ్రజ్యోతి) జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లోని సింథటిక్‌ట్రాక్‌పై శుక్రవారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. అండర్-8, 10, 12 బాలబాలికల 100, 200, 400, మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రోలో ఏర్పాటు చేసిన ఎంపిక పోటీలను అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లా స్థాయిలో నిర్వహించిన సబ్ జూనియర్స్ బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో జిల్లావ్యాప్తంగా 700 మంది అథ్లెట్లు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు డిసెంబర్ 1నుంచి మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీడీలు రజినీకాంత్, కృష్ణమూర్తి, డీఎస్ఏ అథ్లెటిక్స్ కోచ్ శ్రీమన్నారాయణ, కోచ్ దిమ్మిక నాగరాజు పాల్గొన్నారు.



100మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

24న జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న హనుమకొండ జేఎన్ఎస్‌లోని కబడ్డీ కోర్టులో జిల్లా స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ కబడ్డీ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమెన్ విభాగంలో 75కిలోల బరువులోపు, మెన్ విభాగంలో 85కిలోల బరువు లోపు ఉన్న క్రీడాకారులు ఈ ఎంపిక పోటీలల్లో పాల్గొనవచ్చునన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు డిసెంబర్ 7నుంచి 9వ తేదీవరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9346040311, 9849388305 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

వేసవి దృష్ట్యా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

హనుమకొండ టౌన్, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవి కాలం దృష్ట్యా విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సీఎండీ వరుణ్‌రెడ్డి ఎస్ఈలు, డీఈలను ఆదేశించారు. శుక్రవారం ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. డిమాండ్‌కు అనుగుణంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, అలాగే అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి పనులు పూర్తి చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్స్ ఫెయిలైనప్పుడు రవాణా సౌకర్యం కచ్చితంగా డిపార్ట్‌మెంట్ వాహనం ద్వారానే జరగాలన్నారు. ప్రత్యామ్నయ విద్యుత్ సరఫరా అందించేందుకు ఇంటర్ లింకింగ్ పనులు త్వరతగితన పూర్తి చేసేందుకు సమాయత్తం కావాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జీరో స్థాయికి తీసుకురావడానికి ముమ్మర చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని మహిళ కుటుంబ సభ్యులకు అప్పగింత

కాళోజీ జంక్షన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : మతి స్థిమితం లేక నర్సంపేట నుంచి హనుమకొండకు వచ్చిన మహిళను సఖీ కేంద్రం నిర్వాహకులు చేరదీసి శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గురువారం సాయంత్రం హనుమకొండ కలెక్టరేట్‌లో ఒంటరిగా కూర్చొని ఉన్న మహిళను కలెక్టరేట్ సిబ్బంది గమనించారు. ఆమెను పలకరించినా ఎవరితోనూ మాట్లాడకపోవడంతో వారు వెంటనే హనుమకొండ సఖీ సెంటర్‌కు సమాచారం అందించారు. జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు సఖీ సిబ్బంది ఆ మహిళను సఖీ సెంటర్‌కు తీసుకెళ్లి తాత్కాలికంగా వసతి కల్పించారు. శుక్రవారం ఆ మహిళకు కౌన్సెలింగ్ నిర్వహించగా తాను నర్సంపేట నివాసినని తెలిపింది. కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకొని సఖీ సెంటర్ నుంచి ఫోన్ చేయగా ఆమె కూతురు వచ్చి తగిన ఆధారాలు చూపించగా సఖీ నిర్వాహకులు మహిళను కూతురుకు అప్పగించారు.

వేధింపులకు గురయ్యే మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయండి

సీపీ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ టౌన్, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులకు గురయ్యే మహిళలు మౌనం వీడి ధైర్యంగా షీటీంకు ఫిర్యాదు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మహిళలకు పిలుపునిచ్చారు. మహిళలకు అవగాహన కల్పించడంలో భాగంగా తెలంగాణ మహిళా రక్షణ విభాగంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మహిళలు, బాలికల రక్షణ కోసం పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడే వ్యక్తులపై కఠిన వ్యవహరిస్తుందన్నారు. బాలికలు, మహిళలు అపరిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకొవద్దని సూచించారు. మహిళలు తాము పనిచేసే ప్రాంతంలో వేధింపులకు గురైన, విద్యార్థినులు, బాలికలు ర్యాగింగ్ పేరుతో ఇబ్బందులకు గురైన వెంటనే షీటీమ్‌కు లేదా డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, వరంగల్ షీటీమ్ ఇన్స్‌పెక్టర్ సుజాత, షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్‌డీవోగా శ్రీను బాధ్యతల స్వీకరణ

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారిగా ఎం.శ్రీను శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన డీఆర్‌డీవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనుకు ఉపాధిహామీ ఉద్యోగుల టెక్నికల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, జేఏసీ చైర్మన్ లింగయ్యతోపాటు నాయకులు విజయ్, మోహన్‌రావు, కుమారస్వామి, రఘు, వెంకన్న, శివప్రసాద్, రామన్న, రమేష్, నరేందర్‌లు పూలమొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీఎన్‌జీవోలు

ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని కలిసిన టీఎన్‌జీవో నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా టీఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో టీఎన్‌జీవో నేతలు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. రూ.90కోట్లతో అద్భుతంగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, రాజేష్, శ్యాంసుందర్, రామునాయక్, లక్ష్మీప్రసాద్, నరేశ్, శ్రీనివాస్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర దొంగ అరెస్టు

37 తులాల బంగారం, 8 తులాల వెండి స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హసన్‌పర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాత్రిపూట ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను అరెస్టు చేసి అతడి వద్ద రూ.25 లక్షల విలువ చేసే 37 తులాల బంగారం, 8 తులాల వెండితోపాటు ఒక టీవీని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ పోలీసుస్టేషన్ ఆవరణలో ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నిందితుడి వివరాలను వెల్లడించారు.

వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం నడిగడ్డ తండాకు చెందిన మాలోత్ హత్యా అలియాస్ చిరంజీవి, రమేష్ 15ఏళ్ల కిందటే హనుమకొండ వడ్డెపల్లి చర్చి వద్ద ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తే వచ్చే డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. రాత్రి పూట తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడేవాడు. ఇలా 2019 నుంచి ఇప్పటి వరకు కాకతీయ యూనివర్సిటీ, ఇంతేజార్‌గంజ్, మడికొండ, స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసుస్టేషన్ల పరిధిలో 11 దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇలా దొంగతనానికి పాల్పడిన సొత్తుతో జల్సాలకు, వ్యక్తిగత అవసరాలకు వాడుకోగా మిగిలిన దొంగ సొత్తును తన వద్ద దాచి పెట్టుకున్నాడు. వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీలపై అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించి నిందితుడిని గుర్తించినట్లు ఏసీపీ తెలిపారు. నేరస్తుడు తన వద్ద ఉన్న దొంగ సొత్తును వరంగల్ ప్రాంతంలోని బంగారం షాపులలో అమ్మేందుకు వెళ్తుండగా శుక్రవారం కేయూసీ క్రాస్‌రోడ్డు వైపు వెళ్తుండగా అతడిని అదుపులోకి తీసుకొని విచారించి అతడి వద్ద ఉన్న 37 తులాల బంగారం, 8 తులాల వెండితో పాటు ఒక టీవీని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెల్లడించారు. ఈ కేసును చేధించడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.బాలాజీ వర ప్రసాద్, కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్, సీసీఎస్ సిబ్బంది ఏఎస్సై శివకుమార్, హెడ్ కానిస్టేబుళ్లు మున్న వేణుగోపాల్, సదానందం, కేయూ క్రైం సిబ్బంది, హెడ్ కానిస్టేబుళ్లు నర్సింగరావు, అహ్మద్‌పాషా, రవి ప్రసాద్‌లను ఏసీపీ అభినందించారు.

వరంగల్‌ను అభివృద్ధి చేయాలనేదే సీఎం సంకల్పం

ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ సలహాదారుడు వేణుగోపాల్‌రావు

ధర్మసాగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కంటే వరంగల్ జిల్లాను మరింత అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పమని ప్రభుత్వ సలహాదారుడు అరుకార వేణుగోపాల్‌రావు అన్నారు. శుక్రవారం ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి, కేశవనగర్ గ్రామాలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. వరంగల్ పట్టణాన్ని హైదరాబాద్ కంటే ఎక్కువ అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో సీఎం ఉన్నారని ఆయన అన్నారు. ఏపీలో కడప, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం ఇలా ఎన్నో విమానాశ్రయాలు ఉన్నాయన్నారు. తెలంగాణలో హైదరాబాద్ తప్ప మరో ఎయిర్‌పోర్ట్ లేదన్నారు. తెలంగాణ ఏర్పడ దశాబ్ద కాలం దాటినా గత పాలకులు ఎప్పుడు కూడా ఈప్రాంతం, రాష్ట్ర అభివృద్ధి గురించి ఏనాడు శ్రద్ధ చూపిన దాఖలాలు లేవన్నారు. తెలంగాణ ప్రజలకు ఏదో మాయమాటలు చెప్పి పబ్బం గడుపుకుని లక్షల కోట్ల అప్పులు చేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొటిగా నేరవేరుస్తూ గృహజ్యోతి, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్‌ను ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. మామునూరు, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్‌ల మంజూరు అనుమతుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు అనేకసార్లు ఢిల్లీ వెళ్లి అనుమతులు తీసుకువచ్చామన్నారు. సీఎం నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు దూసుకువెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్తిరెడ్డి అమరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అవనిజ విప్లవరెడ్డి, పూజారులు పావన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

'కేటీఆర్ అండ్ కో'పై చర్యలు తీసుకోండి..

పోలీసులకు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

వరంగల్ చౌరస్తా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొండా దంపతులపై సోషల్‌మీడియాలో లేనిపోని వ్యాఖ్యలు చేస్తున్న కేటీఆర్ అండ్‌కోపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం దాసరి రాజేష్, కూచన రాజేందర్ ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ట్విట్టర్ అకౌంట్‌లో నిప్పుకోడి అనే సంస్థ పేరు మీద లేనిపోని వ్యాఖ్యలు పెట్టి కొండా అభిమానులను బాధపెడుతున్నారని వాపోయారు. దీని వెనుక ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని సీఐ షకూర్‌కు ఫిర్యాదు పత్రం ఇచ్చారు.

విద్యారంగ సమస్యలను విస్మరించిన ప్రభుత్వం

టీఎస్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్



అంబేద్కర్ విగ్రహం వద్ద సభలో మాట్లాడుతున్న కూరెళ్ల మహేష్‌కుమార్

వడ్డెపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను విస్మరించిందని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శుక్రవారం టీఎస్ఎస్ఏ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నయీంనగర్‌లోని వాగ్దేవి కళాశాల నుంచి పబ్లిక్ గార్డెన్ మీదుగా కాళోజీ జంక్షన్ ద్వారా అంబేద్కర్ విగ్రహం వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీని నిర్వహించారు. తొలుత హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కూరెళ్ల మహేష్ కుమార్‌తో పాటు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ల సత్యం మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృహాలకు, గురుకుల పాఠశాలలు, కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న మెస్ చార్జీలు రూ.1500 నుంచి రూ.4వేల వరకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సభలో టీఎస్ఎస్ఏ రాష్ట్ర, జిల్లా నాయకులు గోవింద్‌రాజు, ఈర్ల ప్రసాద్, సుధాకర్, మేడి నాగరాజు, ఎనమల్ల ప్రవీణ్‌కుమార్, నిర్మల సతీష్ మహజన్, కూరెళ్ల ఉదయ్, తాటిపాముల తరుణ్, లక్ష్మీ ప్రసన్న, స్వాతి, ఇమ్మడి ప్రసన్న, పద్మావతి, సరళ, స్వరూప, దివ్య, పద్మ, రమ, భాగ్య, శ్రీదేవి, ఆదర్శ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా రవికిరణ్



శంభునిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ ప్రాసిక్యూషన్ ఎన్నికల్లో వరంగల్ శంభునిపేట ప్రాంతానికి చెందిన ప్రముఖ న్యాయవాది పస్తం రవికిరణ్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రవికిరణ్ ఇటీవలే అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పదోన్నతి పొంది నర్సంపేట సెషన్స్ కోర్టుకు బదిలీ అయ్యారు. శుక్రవారం జరిగిన పబ్లిక్‌ప్రాసిక్యూటర్‌ల రాష్ట్ర అసోసియేషన్ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావటం పట్ల జగిత్యాల జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కంచ ప్రసాద్‌తో పాటు పలువురు జడ్జీలు అభినందించారు. వీరితో పాటు కాకతీయ సేవాసమితి అధ్యక్షుడు, జాతీయ అవార్డు గ్రహీత మండల నరసింహరాములు, నవీన్‌రెడ్డి, కోల రాము, చందా మనోహర్, పాకాల రవి, మిమిక్రీ నంది పురస్కార్ అవార్డు గ్రహీత రాగి దామోదర్ తదితరులు రవికిరణ్‌ను అభినందించారు.

ఆర్‌పీఐ రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడి నియామకం



కాజీపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా కాజీపేటకు చెందిన కాందారి సుభాష్ చంద్రబోస్‌ను నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవి కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లి క్రిస్టఫర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఖోఖో పోటీలకు జేఎస్ఎమ్ విద్యార్థి



జేసింత్

శంభునిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రంగశాయిపేటకు చెందిన గోగు జేసింత్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. జేసింత్ జేఎస్ఎమ్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. తండ్రి పీడీ గోగు నారాయణ శిక్షణలో జిల్లా స్థాయి క్రీడల్లో రాణించి 68వ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్-14 ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ ఎస్.రమేష్ రావు, ప్రిన్సిపాల్ కె.శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం జేసింత్‌ను అభినందించారు.

చార్‌బౌళి స్కూల్లో వంట గ్యాస్ లీక్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ చార్‌బౌళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం వంటగ్యాస్ లీక్ అయింది. పాఠశాల ముగిసిన తర్వాత మధ్యాహ్న భోజన సామగ్రి నిలువ ఉంచిన గది నుంచి గ్యాస్ వాసన వస్తుండటంతో స్థానికులు వెంటనే పాఠశాల సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి సిలిండర్లను సరిచేశారు. సమాచారం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ ఫుర్ఖాన్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతోనే గ్యాస్ లీకేజీ అయినట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

25న పారా మెడికల్ కౌన్సెలింగ్

వరంగల్ మెడికల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న కేఎంసీ ఆడిటోరియంలో పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి నిర్వహించే కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని సూచించారు.

కళాక్షేత్రం ఏర్పాటు చేయడం హర్షనీయం

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో కాళోజీ కళాక్షేత్రం ఏర్పాటు చేయడం హర్షనీయమని, పనులు పూర్తి చేయడానికి పూర్తి సహకారం అందించిన బల్దియా కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు సదానందం అన్నారు. కాళోజీ కళాక్షేత్రం ప్రారంభమైన సందర్భంగా శుక్రవారం ఆయన బల్దియా కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఆయన వెంట కళాకారులు చక్రపాణి, బిక్షపతి, రవీందర్, బాలాజీ, ప్రసాద్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఘనంగా వినయ్‌భాస్కర్ జన్మదిన వేడుకలు

బాలసముద్రం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బాలసముద్రం బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ జన్మదిన వేడుకలను పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఉడుతల సారంగపాణి, జోరిక రమేష్, డివిజన్ అధ్యక్షుడు సదాంత్, కోటేశ్వర్‌రావు, సుంచు కృష్ణ, నాయకులు రజినీకుమార్, బుద్దె వెంకన్న, విజయ్, రాజు, రఘు, మహేష్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పులి రజినీకాంత్

● హసన్‌పర్తి: గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సంగాల విక్టర్‌బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగట్టుదేవస్థానం మాజీ చైర్మన్లు అటికం రవిందర్‌గౌడ్, చింతల లక్ష్మణ్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు నాయకపు శ్రీనివాస్, రాయికంటి సురేష్, పోగుల రమేష్, పొరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కేయూ క్యాంపస్: కేయూలో బీఆర్ఎస్ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, రాష్ట్ర నేత మాచర్ల శరత్‌చంద్ర నేతృత్వంలో దాస్యం వినయభాస్కర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వర్సిటీ మొదటి గేటు వద్ద బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కేక్‌కట్ చేసి సంబురాలు చేశారు. బాణాసంచాలు కాల్చి వినయ్‌భాస్కర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ డాక్టర్ అరూరి రంజిత్, రాష్ట్ర నాయకులు కలకోట సుమన్, గోల్లపల్లి వీరాస్వామి, బీఆర్ఎస్వీ నాయకులు పస్తం అనిల్, రత్నం, అశోక్, రోహిత్, మూడుసాని, మహమ్మద్, కిరణ్, పవన్, రాము తదితరులు పాల్గొన్నారు.



కేయూ గేట్ ఎదుట కేక్ కట్ చేస్తున్న బైరపాక ప్రశాంత్, శరత్ తదితరులు

కేసీఆర్‌ను కలిసిన వినయ్‌భాస్కర్

బాలసముద్రం: తన జన్మదినం సందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ శుక్రవారం కేసీఆర్‌ను మెదక్ జిల్లా ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కలిశారు. తన కుటుంబ సభ్యులతో వెళ్లి కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి ఆశీర్వాదం తీసుకున్నారు.

● మల్లికాంబ మనోవికాస కేంద్రంలో 7వ డివిజన్ ప్రెసిడెంట్ కొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పిల్లలకు పండ్లు, టవల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి జనార్దన్, జనరల్ సెక్రటరీ రాజశేఖర్, సుదర్శన్, దేవి, రోషిని, శ్రీదేవి, సరస్వతి, ఆకుల విజయ, సారంగం, భరత్ పాల్గొన్నారు.

● కాజీపేట: కాజీపేట 47, 62, 63 డివిజన్లలో బీఆర్ఎస్ నాయకులు మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్‌చేసి, బాణా సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అయ్యప్ప దేవాలయంలో పాము రాజేశ్ ప్రత్యేక పూజలు చేశారు. అయ్యాల దానం ఆధ్వర్యంలో సెయింట్ ఆన్స్ ఓల్డేజ్ హోమ్‌లో వృద్ధులకు అన్నదానం చేశారు. యూత్ విభాగం నాయకులు గబ్బెట కరుణ్ సిద్ధూ, ఆర్. రాజేశ్, పిట్టల కళ్యాణ్, ముధాసిర్ అహ్మద్ ఆధ్వర్యంలో 600 మంది పేదలకు భోజనం పంపిణీ చేశారు. కార్పొరేటర్ సంకు నర్సింగ్, నాయకులు నార్లగిరి రమేశ్, గబ్బెట శ్రీనివాస్, సుంచు కృష్ణ, బెదరకోట రంజిత్ కుమార్, కోండ్ర శంకర్, ఎమ్డీ అప్జల్, జుబేర్, మర్యాల కృష్ణ, తండమల్ల వేణు పాల్గొన్నారు.

న్యాయవాదుల నివాళి

వరంగల్ లీగల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది పింగిళి కేశవరెడ్డి మృతికి వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. కేశవరెడ్డి మృతి న్యాయవాద సమాజానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు, తీగల జీవన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు లాదె రమేష్, ముదసర్ అహ్మద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. అంతకు ముందు హనుమకొండ జిల్లా జడ్జి కోర్టు హాల్‌లో జిల్లా జడ్జి సీహెచ్. రమేష్‌బాబు ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోచ్‌ఫ్యాక్టరీ పనులు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న టీరైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్

కాజీపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాజీపేట జంక్షన్‌కు మంజూరైన వ్యాగన్ పరిశ్రమ, కోచ్‌ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ హోదా, టౌన్ స్టేషన్ అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టి, సకాలంలో పూర్తిచేయాలని కోరుతూ ఆదివారం నుంచి సర్వమత ప్రార్థనలు చేస్తున్నట్లు టీరైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు తెలిపారు. కాజీపేట రైల్వే ఇంగ్లీషు మీడియం పాఠశాల గ్రౌండ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో షెడ్యూల్ వివరాలు తెలిపారు. ఈ నెల 24న ఉదయం 4.45 నిమిషాలకు మడికొండ మెట్టు రామలింగేశ్వర దేవాలయంలో రుద్రాభిషేకం, 27న భద్రకాళి అమ్మవారికి చీర, సారెతో పూజలు, 29న కాజీపేట దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, డిసెంబరు 1న ఫాతిమానగర్ చర్చిలో బిషప్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో పాల్గొనడానికి ఆసక్తి గల వారు శనివారం రైల్వే జేఏసీ వాట్సప్ గ్రూప్‌లో తమ పేరు, మొబైల్ నంబర్ పోస్ట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల అనంతరం డిసెంబరు చివరి వారంలో ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తామన్నారు. ఈ సమావేశంలో రైల్వే జేఏసీ వైస్ చైర్మన్‌లు గుర్రపు సుధాకర్ రావు, బి.మాధవరావు, ఎస్.లక్ష్మీనారాయణ, కో - కన్వీనర్‌లు అనుమాల శ్రీనివాస్, ఎం.మహేశ్, పి.రమేశ్, టీ.ప్రవీణ్, జి.భాస్కర్ పాల్గొన్నారు.

● **బీసీల భేరిని జయప్రదం చేయండి**

కాళోజీ జంక్షన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నెల 25న నిర్వహించే బీసీల సమర భేరిని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఐలేష్ యాదవ్, జాతీయ ఉపాధ్యక్షుడు పి. పోచమల్లు సంయుక్త ప్రకటనలో బీసీలకు పిలుపు నిచ్చారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, కేంద్రంలో బీసీల కోసం మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం బీసీల పట్ల అవలంబిస్తున్న మెతక వైఖరిని విడనాడాలని తదితర డిమాండ్లతో సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

● **నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

హనుమకొండ టౌన్, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని దర్గా, హౌసింగ్‌బోర్డు కాలనీ, బియాబనీనగర్, గాంధీనగర్, బీజేపీ క్వార్టర్స్, భీంనగర్, ఈపీఎఫ్ ఆఫీస్ రోడ్డు ఏరియాలో ఉదయం 10 నుంచి 1 గంట వరకు, వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్సారీ ట్రస్టు, గాయత్రినగర్‌లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

● **రేపు ఆర్‌యూపీపీటీ ఆత్మీయ సమ్మేళనం**

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీటీ) హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్. లక్ష్మీనారాయణ, ఫారుక్ సాదత్ అలీలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పదోన్నతులు పొందిన భాషా పండితులతో పాటు నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన భాషా పండితులకు ఆత్మీయ సమ్మేళనం ద్వారా సత్కారం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

● **వనభోజనాలను జయప్రదం చేయండి**

ఖిలావరంగల్, నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న ఖిలావరంగల్ ఏకశిల పిల్లల పార్కులో గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (గోపా) వరంగల్, హనుమకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీక మాస వన భోజనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోపా వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ, రాష్ట్రఅధ్యక్షుడు బొనగాని యాదగిరిగౌడ్, మండ వెంకన్న కోరారు. శుక్రవారం ఖిలావరంగల్ ఏకశిల పిల్లల పార్కులో తీగల శ్రీధర్ అధ్యక్షతన పార్కును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముఖ్య అతిథులుగా పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూర్య (సీతక్క) హాజరవుతారని వారు తెలిపారు.

విధుల్లో మలేరియా సిబ్బంది

కాలనీలలో పెద్ద ఎత్తున ఫాగింగ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బల్దియా మలేరియా సిబ్బంది శుక్రవారం పెద్దఎత్తున విధులకు హాజరయ్యారు. 'ఆంధ్రజ్యోతి'లో 'మలేరియాలో మాయాజాలం' అనే కథనానికి స్పందించిన బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే... అన్ని కాలనీలలో క్రమం తప్పకుండా ఫాగింగ్, స్ప్రే చేయాలని ఆదేశించారు. దీంతో బయాలజిస్ట్ మాదవరెడ్డి సైతం 162 మంది ఔట్‌సోర్సింగ్, పబ్లిక్ హెల్త్ వర్కర్స్ విధులకు హాజరు కావాలని హెల్త్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. దీంతో మలేరియా సిబ్బంది యుద్ధప్రాతిపదికన విధులకు హాజరయ్యారు. శుక్రవారం సాయంత్రం మలేరియా సిబ్బంది సెంట్రల్ జైలు పెట్రోల్ పంపు వద్దకు ఫాగింగ్ మిషన్‌లతో వచ్చారు. ఫాగింగ్ మిషన్ నడిచేందుకు ఉపయోగించే డీజిల్‌తో పాటు దోమల నివారణకు ఉపయోగించే మలాథిన్ మందును బయాలజిస్ట్ దగ్గరుండి మరీ ఫాగింగ్ మిషన్‌లలో కలిపించారు. వరంగల్ ట్రైసిటీస్‌తో పాటు విలీన గ్రామాలలో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. డీజిల్, పెట్రోల్ విక్రయించినట్టు తన దృష్టికి వస్తే విధుల నుంచి తొలగించడంతో పాటు క్రిమినల్ కేసులు పెట్టిస్తానని హెచ్చరించినట్టు సమాచారం.

స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి



శంభునిపేటలో ధర్నా చేస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

శంభునిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) ఆధ్వర్యంలో శుక్రవారం రంగశాయిపేట జంక్షన్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా నవీద్ మాట్లాడుతూ.. డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం అవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికే ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కళాశాలలు మూసివేసి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించాయని, అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవటం వారి ప్రజాపాలనకు నిదర్శనం అని దుయ్యబట్టారు. రీఇంబర్స్‌మెంట్స్‌తో పాటు, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రోహిత్, నాయకులు సోహన్, ఇర్ఫాన్, రాజు, సుమన్, నవీన్, మోహన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టి కోసం అధికారులను సంప్రదించండి

నీటిపారుదల శాఖ ఈఈ బి.సీతారాం

బాలసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువులో పూడికతీతలో వచ్చే నల్లమట్టి కోసం ప్రజలు ప్రభుత్వ ధరతో మట్టి కావాల్సిన వారు హనుమకొండ నక్కలగుట్ట ఇరిగేషన్ డివిజన్-2 కార్యాలయంలో సంప్రదించాలని ఈఈ బి.సీతారాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ రేటు ప్రకారం సుమారు ఒక ఘనపు మీటరకు రూ.144 చెల్లించి మట్టి కావాల్సిన వారు ఈ నెల 30 తేదీ వరకు 90001 72854 సెల్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

వడ్డెపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అడిషనల్ డీసీపీ రవి విద్యార్థినులకు పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బాటనీ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్‌ప్లాంటు సైన్స్ రీసెర్చ్' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళి గౌడ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డీసీపీ రవి మాట్లాడుతూ.. పట్టుదల, లక్ష్య నిర్దేశనంతో కష్టపడి చదివితే ఉన్నత ఉద్యోగాలను సాధించవచ్చని తెలిపారు. ప్రతీ విద్యార్థిని ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా తమ చదువును కొనసాగించాలని సూచించారు. ఈ సదస్సులో సీనియర్ సైంటిస్టు డాక్టర్ కోటేశ్‌కుమార్, సదస్సు సమన్వయ కర్త డాక్టర్ సునిత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, అధ్యాపకులు శ్రీలత, జ్యోతిర్మయి, మహిత, మీనాక్షి, హెప్సీబా, మమత తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ రవి

సీకేఎం ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీకేఎం కళాశాల అధ్యాపక బృందంతో పాటు రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మవారి సన్నిధిలో రైల్వే ఐజీ



ఐజీకి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న ఈవో శేషు భారతి

వరంగల్ కల్చరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చారిత్రక వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారిని సౌత్ సెంట్రల్ రైల్వే ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) అరోమాసింగ్ ఠాకూర్ దర్శించుకున్నారు. శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి రాగా ఈవో శేషు భారతి స్వాగతం పలికారు. అనంతరం ఐజీ వల్లభ గణపతితో పాటు భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వారికి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను, శేష వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైల్వే పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

26న సీఐటీయూ ధర్నా

బాలసముద్రం, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): కార్మిక, రైతు, వ్యవసాయ, ప్రజా వ్యతిరేక విధా నాలకు పాల్పడుతున్న కేంద్రం విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ ప్రథమ మహా సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ సంపదను లూటీ చేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలకు కేంద్రం పాల్పడుతోందని విమర్శించారు. సీఐటీ యూ జిల్లా అధ్యక్షుడు టి. ఉప్పలయ్య మాట్లాడుతూ.. కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిర్వహించే నిరసనలో కార్మికవర్గం వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బొట్ల కుమార్, మల్లికార్జున్, రాణి, బండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 27 మందితో నార్త్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ కన్వీనర్ మంద మల్లేశం తెలిపారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు

హనుమకొండ టౌన్, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): నిషేధిత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలపై వరంగల్ నార్కోటిక్స్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ఆర్ యూనివర్సిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కోటిక్స్ డీఎస్పీ సైదులు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు ఉపయోగించడం, రవాణా చేయడం, కల్గి ఉండటం నేరమని అలాంటి వారు తారసపడితే 8712661711 నెంబర్‌కు సమాచారం అందించాన్నారు. మత్తు పదార్థాలు ఉపయోగించడం వల్ల కలిగే అనార్థాలు, ఆకర్షితులు కాకుండా తమకు తాము ఏలా కాపాడుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ యూనివర్సిటీ డీన్స్ డాక్టర్ ఏ.వి సుధాకర్, భూపాల్‌రాజు, నార్కోటిక్స్ సీఐ రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

గుండె సంబంధిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● ప్రముఖ వైద్య నిపుణుడు రామక శ్రీనివాస్

కేయూ క్యాంపస్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుండె వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ గుండె వైద్యుడు రామక శ్రీనివాస్ ఉద్బోధించారు. శుక్రవారం కేయూ సెనెట్ హాల్‌లో 'సీపీఆర్‌పై అవగాహనతో ప్రాణ రక్షణ' అనే నినాదంతో ఉద్యోగులకు, సిబ్బందితో పాటు యువతకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామక శ్రీనివాస్ సీపీఆర్ విధానాన్ని చేసి చూపించారు. అనంతరం మాట్లాడుతూ.. గుండె సంబంధిత వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గుండె వ్యాధులు ఎదురైనప్పుడు అప్రమత్తమై వ్యవరించాల్సిన విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, ఇతర ఉద్యోగులు, యువత పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి

● ప్రముఖ హెల్త్ ట్రైనర్ సురేందర్

కేయూ క్యాంపస్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అందరూ ఆరోగ్య నియ మాలను తప్పనిసరిగా పాటిస్తూ ఆరోగ్యం గా జీవించాలని ప్రముఖ హెల్త్ ట్రైనర్ సురేందర్ అన్నారు. శుక్రవారం కేయూ కెమిస్ట్రీ విభాగంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, విభాగాధిపతి నేతృత్వంలో విద్యార్థులకు 'రోల్ ఆఫ్ యోగా ఇన్ స్పోర్ట్స్ పర్ఫార్మెన్స్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్ హాజరై విద్యార్థులకు హెల్త్ టిప్స్‌ను వివరించారు. ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. దినచర్యలో వ్యాయామం భాగం కావాలని చెప్పారు. రేపటి ఆరోగ్యం నేటి పరిశ్రమపై ఆధారపడి ఉంటుందన్నారు.

ఉదయం నిద్రలేవడం, త్వరగా పడుకోవ డం, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. వివిధ నడక పద్ధతులు, రన్నింగ్ పద్ధతులను వివరించారు. లక్ష్యంపై దృష్టిసారించి జీవితంలో మంచిస్థాయికి ఎదగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి. సవితా జ్యోత్స్న, ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ కె.మమత, డాక్టర్ చంద్రశేఖర్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ విద్యార్థులు, ఎంఎస్సీ స్టూడెంట్స్, స్కాలర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే శారీరక, మానసిక ఆరోగ్యం

● కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

● ఇంటర్ కాలేజీయేట్ క్రికెట్ టోర్నమెంట్ షురూ

కేయూ క్యాంపస్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కేయూ క్రీడమైదానంలో కేయూ ఇంటర్ కాలేజీయేట్ పురుషుల క్రికెట్ టోర్నమెంట్‌ను టాస్‌వేసి, క్రికెట్ ఆడి యువతను ఉత్సాహ పరుస్తూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వర్సిటీ విద్యార్థులు తమ క్రీడాస్ఫూర్తిని కొనసాగిస్తూ జాతీయస్థాయి పోటీల్లో ముందుండాలన్నారు. శుక్రవారం వర్సిటీ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల, హనుమకొండలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాల క్రీడ జట్లు పోటీపడ్డాయి. ఈ సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య, వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అమరవాది శేషాశేలం, క్రీడా నిర్వహకులు మట్టెడ కుమార్, కలకోట సుమన్, డాక్టర్ వంగాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి రాజమణి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రాజమణి

కాశిబుగ్గ, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మన్యూనత భావాన్ని వీడి ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని జిల్లా సంక్షేమశాఖ అధికారిణి బి.రాజమణి సూచించారు. డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఓ సిటీలోని స్టేడియంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుం దన్నారు. జూనియర్స్ సీనియర్స్‌కు, మహిళ లకు, పురుషులకు వేర్వేరుగా క్రీడలు నిర్వహిం చారు. రన్నింగ్, వీల్‌చైర్ రేస్, షాట్‌పుట్, క్యారమ్, చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి సాధించిన వారు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, జిల్లాస్థాయి పోటీల్లో విజేతకు డిసెం బరు 3న బహుమతులు అందిస్తామని నిర్వా హకులు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవోలు విద్య, దెబోరా, జూనియర్ అసిస్టెంట్ హేమలత, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి అనిరుధ్, సూపర్‌వైజర్లు కళ్యాణి, కవిత పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఛాన్స్.. ఎవరికో?

(5వ పేజీ తరువాయి)

2009లో నియోజకవర్గాల పునర్విభజనలో చేర్యాల కనుమరుగవటంతో జనగామ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న సన్నిహిత సంబధాలతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని నియోజకవర్గంలో దీటుగా ఎదుర్కొనేందుకు కొమ్మూరికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలనే ఒత్తిడి ఆయన వర్గీయుల నుంచి అధిష్ఠానంపై ఉన్నట్టు సమాచారం. కొమ్మూరి కూడా వచ్చే ఎన్నికల నాటికి తన కుమారుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డిని క్రియాశీలక రాజకీయాల్లోకి తీసుకవచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. తొలుత జనగామ జడ్పీ చైర్మన్ పీఠం లక్ష్యంగా ప్రశాంత్‌రెడ్డి లేదంటే ఆయన సతీమణిని బరిలో దించాలనే ఒత్తిడి కొమ్మూరి వర్గీయుల నుంచి ఉందనే చర్చ జరుగుతుంది. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించిన మామిండ్ల ఝాన్సీరెడ్డి పేరు కూడా ఎమ్మెల్సీ జాబితాలో వినిపిస్తోంది. పాలకుర్తిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు దీటుగా రాజకీయాలు చేసేందుకు ఝాన్సీరెడ్డికి పదవి ఇవ్వాలనే ఒత్తిడి అధిష్ఠానంపై పలువురు ఎమ్మెల్యేలు తీసుకొస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఎమ్మెల్సీ పదవి దక్కకపోతే.. నామినేటెడ్ పోస్టు అయినా ఝాన్సీరెడ్డికి ఇచ్చే అవకాశాలున్నాయనే చర్చ ఉంది. ఝాన్సీరెడ్డి మాత్రం ఎమ్మెల్సీ పదవి రాకపోతే జనగామ జడ్పీ చైర్‌పర్సన్ సీటుపై ఫోకస్ చేస్తారని భావిస్తున్నారు. ఇక స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గం నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోయిన సింగపురం ఇందిర పేరు కూడా ఎమ్మెల్సీ రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్ గూటికి చేరటంతో ఇందిర వర్గంలో అసంతృప్తి నెలకొంది. శ్రీహరి చేరిక సమయంలోనూ పదవిపై అధిష్ఠానం ఇందిరకు హామీ ఇచ్చింది. ఇప్పటికే ఏఐసీసీ నేత ఖర్గే, కేసీ వేణుగోపాల్ తదితర నేతలను కలిసి తన రాజకీయ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో ఎమ్మెల్సీ లేదా కీలకమైన నామినేటెడ్ పోస్టుపై ఏఐసీసీ నేతలు హామీ ఇచ్చినట్టు తెలిసింది. దీంతో ఎమ్మెల్సీ లేదంటే ఎదైనా కీలకమైన పదవి ఇందిరా దక్కే చాన్స్ ఉందనే టాక్ వినబడుతోంది. వీరితో మరో అరడజను మందికి పైగా కాంగ్రెస్ సీనియర్ నేతలు ఎమ్మెల్సీ సీటుపై ఆశలతో అధిష్ఠానం ఒత్తిడి తెస్తున్నారు. దీంతో శాసన మండలిలో అధ్యక్షా అనే అదృష్టం ఎవరిని వరిస్తుందో అనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా జరుగుతోంది.

ప్రారంభమైన అయ్యప్ప దీక్షలు

వరంగల్ కల్చరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వాముల మాలధారణ దీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని భద్రకాళి అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప భక్త సేవాశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపక నిర్వాహకుడు బ్రహ్మశ్రీ టీఆర్ బాలసుబ్రహ్మణ్యశర్మ, గణపతిశర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వాములకు మాలధారణ చేయించారు. పలువురు చిన్న వయసు వారు సైతం దీక్ష చేపట్టడం విశేషం.

స్వయం సంఘాలకు
సోలార్ ప్లాంట్లు

- ఎస్‌హెచ్‌జీలకు అప్పగించేందుకు సర్కారు ఏర్పాట్లు
- రేవంత్ సమక్షంలో కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 54 మెగావాట్ల ఉత్పత్తికి కసరత్తు



హనుమకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) ద్వారా సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఆదానీ, అంబానీలకే ఇప్పటి వరకు పరిమితమైన సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ఇక నుంచి స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలు కూడా చేయొచ్చని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించింది తెలిసిందే. ఎస్‌హెచ్‌జీ గ్రూపుల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ఇదే విజయోత్సవ సభలో సీఎం సమక్షంలో సెర్ప్, రెడ్కో, డిస్కమ్‌ల మధ్య కుదిరిన ఎంవోయూల ఆదాన ప్రదానం జరిగింది తెలిసిందే. వరంగల్ గడ్డపై నుంచే ఈ వినూత్న పథకానికి సీఎం శ్రీకారం చుట్టడంతో దీనిని విజయవంతం చేయడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ రెడ్కో, టీఎస్ఎన్‌పీడీసీఎల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.



పీచరలోని సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు కానున్న సోలార్ ప్లాంట్

కొత్తకొండ, పీచరలో..

హనుమకొండ జిల్లాలో 9 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు 18 ఎకరాల భూ సేకరణకు డీఆర్‌డీఏ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ సబ్‌స్టేషన్, వేలేరు మండలం పీచర సబ్ స్టేషన్ పరిధిలో అనువైన స్థలం అందుబాటులో ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. మరికొన్ని చోట్ల కూడా స్థల పరిశీలన జరుగుతోంది. అయితే సబ్ స్టేషన్లకు సమీపంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నచోట అక్కడికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేకపోవడం, కొన్ని చోట్ల రాళ్ల రప్పలు ఉండడం, మరికొన్ని చోట్ల గుంతలమయంగా ఉండడం వల్ల అవి ప్లాంట్ల ఏర్పాటుకు అనువుగా లేవు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 9వ తేదీన విజయోత్సవం జరిగేనాటికల్లా తొలి విడతగా కనీసం రెండు మూడు సోలార్ ప్లాంట్లయినా ఏర్పాటు అయ్యేలా కసరత్తు జరుగుతోంది.

ఉమ్మడి జిల్లాకు 54 మెగావాట్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 54 మెగావాట్ల మేరకు సోలార్ పవర్‌ను ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ జిల్లాల్లో 9 మెగావాట్ల చొప్పున ఉత్పత్తికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆ మేరకు ముందుకు వచ్చే స్వయం సహాయక సంఘాలకు చేయూత నిచ్చేందుకు సిద్ధంగా ఉన్నది. ఒక యూనిట్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు రూ.3.50కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు అవసరమవుతుంది. ఈమొత్తంలో ఎస్‌హెచ్‌జీ 10 శాతం సమకూర్చితే మిగతా మొత్తాన్ని బ్యాంకులు రుణంగా ఇస్తాయి. దీనిని నెలవారిగా చెల్లించాల్సి ఉంటుంది. సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన ఉపకరణాలను రెడ్కో 30శాతం సబ్సిడీపై ఎస్‌జీహెచ్‌లకు సరఫరా చేస్తుంది. ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు గరిష్ఠంగా రెండెకరాల స్థలం అవసరమవుతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 54 ప్లాట్ల స్థాపనకు 108 ఎకరాల స్థలం అవసరమవుతుంది. ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన స్థలం కోసం డీఆర్‌డీఏ అధికారులు అన్వేషిస్తున్నారు. ప్లాంట్ ఏర్పాటు చేసే స్థలం సమీప సబ్‌స్టేషన్‌కు రెండు కిలోమీటర్ల పరిధిలో ఉండాలి. ఆ స్థలం వద్దకు వెళ్లడానికి సరైన రహదారి ఉండాలి. స్థలం చదునుగా ప్లాంట్ ఏర్పాటుకు అనువుగా ఉండాలి. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు కావలసిన స్థలాన్ని ప్రభుత్వమే సమకూరుస్తుంది. ఇందుకు 30 ఏళ్ల కాలపరిమితితో స్థలాన్ని ప్రభుత్వం ఎస్‌ఎచ్‌జీకి లీజుకు ఇస్తుంది. ప్రభుత్వ స్థలాలు లేని చోట దేవాదాయ శాఖకు చెందిన భూములను కూడా వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో ప్లాంట్ల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న అనువైన భూముల పరిశీలన చేయడం కూడా పూర్తయింది. ఈ మేర కు దేవాదాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక కూడా సమర్పించారు.

ఏడాదికి రూ.30లక్షల ఆదాయం

సోలార్ పవర్ ప్లాంట్ల ద్వారా మహిళలకు నెలకు రూ.2.5 లక్షల చొప్పున ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. అంటే యేడాదికి రూ.30లక్షలు వస్తాయి. ఒక స్వయం సహాయక బృందంలోని 10 మంది మహిళలు కలిసి ఒక సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే ఇంత ఆదాయం వస్తుంది. సోలార్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను డిస్కంలకు అమ్ముకోవచ్చు. ఇందుకు డిస్కమ్‌లు ప్రస్తుతం యూనిట్‌కు రూ.3.13 చొప్పున చెల్లిస్తున్నాయి. నెలవారీ ఉత్పత్తి అయ్యే కరెంట్‌ను డిస్కంలు కొనేలా ప్రభుత్వం ఏర్పాటు కూడా చేసింది. అందువల్ల కరెంట్‌ను ఎవరు కొంటారనే ఆందోళన అక్కర్లేదు. ఈ మేరకు ఏజెన్సీగా రెడ్కో, గ్రామీణ దారిద్ర్య నిర్మూలనా సంస్థ(సెర్ప్), రెండు డిస్కమ్‌లు టీఎస్ఎన్‌పీడీసీఎల్, టీఎస్ఎస్‌పీడీసీఎల్‌లు అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఇంధన శాఖ అనుమతిస్తుంది. అది కూడా ఇచ్చేలా ప్రభుత్వమే చేస్తుంది. అనుమతి ఇచ్చాక రెడ్కో మూడు రోజుల్లో సోలార్ ప్లేట్లను అమర్చి ప్లాంట్‌ను సిద్ధంచేసి ఎస్‌హెచ్‌జీకి అప్పగిస్తుంది. ఒకసారి ప్లాంట్‌ను ఏర్పాటుచేసుకుంటే పెద్దగాఖర్చు లేకుండా 20-25ఏళ్లపాటు నిర్వహించవచ్చు.

కొనుగోలు ఇలా..

సోలార్ ప్లాంట్లను వాటి పరిధిలోని సమీప సబ్‌స్టేషన్‌కు అనుసంధానిస్తారు. ప్లాంట్‌లో ఉత్పత్తి అయిన సౌరవిద్యుత్‌ను సబ్‌స్టేషన్ స్వీకరిస్తుంది. అక్కడి నుంచి గ్రిడ్‌కు వెళుతుంది. ప్లాంట్ నుంచి ఎంత సోలార్ పవర్ తీసుకున్నది నెట్‌మీటర్ ఎప్పటికప్పుడు రికార్డు చేస్తుంది. దీనిని బట్టి బిల్లు చెల్లింపు జరుగుతుంది. ఎస్‌హెచ్‌జీలకు ఆరునెలలకోసారి కాకుండా ప్రతీ నెల చెల్లించనున్నట్టు సమాచారం. ఎస్‌హెచ్‌జీలకు నెలకు రూ.2.5 లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఆదాయం సమకూరనున్నది. ఈ మొత్తంలో నుంచి లోన్ ఇన్‌స్టాల్‌మెంట్ పోను మిగిలినది గ్రూప్ సభ్యులు పంచుకుంటారు. ప్లాంట్ల ద్వారా స్థిరమైన ఆదాయం రావడం వల్ల గ్రూప్ సభ్యుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడే అవకాశం ఉంది. వచ్చిన ఆదాయం నుంచే పెట్టుబడి పెట్టి ప్లాంట్లను విస్తరించినట్లయితే మరింత ఆదాయం సమకూరి భవిష్యత్తులో వారు పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంది.

మహిళలు పారిశ్రామికవేత్తలవుతారు..

మేన శ్రీను, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, హనుమకొండ



స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు నిర్ణయం చాలా అద్భుతమైనది. విప్లవాత్మకమైనది. ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లోని మహిళలు ఆర్థికంగా బలపడేందుకు అవకాశం ఉంది. ప్లాంట్ల ద్వారా స్థిరమైన ఆదాయం సమకూరనుండడంతో వారు భవిష్యత్తులో తమ ప్లాంట్లను మరింతగా విస్తరించి పారిశ్రామిక వేత్తలుగా ఎదగగలుగుతారు. ప్రతీ మహిళ కోటీశ్వరురాలు కావాలన్న ప్రభుత్వ సంకల్పం ఈ విధంగా నెరవేరనున్నది. హనుమకొండ జిల్లాలో 9 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తికి కేటాయింపు లభించింది. ప్లాంట్ల ఏర్పాటుకు 18 ఎకరాల స్థల సేకరణకు ప్రతిపాదనలు పంపాం. అనువైన స్థలాల కోసం పరిశీలన జరుపుతున్నాం.

అర్ధరాత్రి అలజడి..

- వాజేడులో మావోయిస్టుల ఘాతుకం
- పోలీసు ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరి హత్య
- మారణాయుధాలతో దాడి చేసి హతమార్చిన వైనం
- మృతుల్లో ఒకరు పంచాయతీ కార్యదర్శి, మరొకరు కూలీ
- న్యాయం చేయాలని మృతదేహాలతో కుటుంబీకుల ధర్నా



రమేష్ నూతన గృహం వద్ద రోదిస్తున్న బంధువులు

వాజేడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మన్యం ప్రాంతమైన ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని పెనుగోలు కాలనీలో మావోయిస్టులు అర్ధరాత్రి సమయంలో అలజడి సృష్టించారు. పోలీసు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారన్న నెపంతో వరుసకు సోదరులైన ఇద్దరిపై మారణయుధాలతో దాడి చేసి కిరాతకంగా హతమార్చారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనలో పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేష్(37)తో పాటు అతడి పెదనాన్న కుమారుడైన ఉయిక అర్జున్(41) మృతిచెందారు. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి 11గంటల సమయంలో రమేష్, అర్జున్ ఇద్దరు ఎవరిళ్లల్లో వారు నిద్రిస్తుండగా.. ఆలీవ్‌గ్రీన్ దుస్తులు ధరించిన మావోయిస్టులు ముగ్గురు చొప్పున రెండు బృందాలుగా ఏక కాలంలో వారిళ్లలో ప్రవేశించారు. పరదా చించివేసి ఉయిక రమేష్ ఇంట్లోకి ప్రవేశించిన మావోయిస్టులు గాఢ నిద్రలో ఉన్న రమేష్ తలపై గొడ్డలితో దాడి చేయగా ఆ అలజడికి నిద్ర నుంచి లేచిన రమేష్ భార్య రాంబాయి మావోయిస్టులను ప్రతిఘటించి భర్తను కాపాడుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఆమెను పక్కకు నెట్టివేసిన మావోయిస్టులు రమేష్‌పై గొడ్డలి, కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చి వెళ్లిపోయారు. రమేష్ భార్య కేకలు వేయగా రమేష్ తల్లిదండ్రులు కూడా అక్కడికి వచ్చారు. వారి ఏడుపులు, అరుపులతో చుట్టుపక్కల వారు వచ్చి రమేష్‌ను 108లో ఏటూరునాగారం తరలించగా చికిత్స అందిస్తున్న క్రమంలో మృతిచెందాడు. ఇక రమేష్ ఇంటికి సుమారు 100 మీటర్ల దూరంలోనే నివాసం ఉండే ఉయిక అర్జున్ ఇంట్లో నిద్రిస్తుండగా.. ఇంటి బయట అతడి భార్య సావిత్రి నిద్రిస్తోంది. ఈ క్రమంలో కత్తులు, గొడ్డలితో వచ్చిన మావోయిస్టులు బయటపడుకుంది అర్జునే అని భావించారు. కానీ దాడి చేసే ముందు లైట్ వేయగా అక్కడ ఉన్నది అర్జున్ భార్య అని గుర్తించి.. అర్జున్‌లో లోపల ఉన్నాడని నిర్ధారించుకుని తలుపులను పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఈ అలజడికి నిద్రలో నుంచి మేల్కొన్న అర్జున్‌ను బయటకు లాక్కొచ్చి గొడ్డలితో మెడపై, నడుము భాగంలో తీవ్రంగా పొడవడంతో అర్జున్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ జంట హత్యల తర్వాత మావోయిస్టులు అక్కడి నుంచి సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం మృతదేహాలకు ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించగా.. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెనుగోలు నుంచి ఏకైక ప్రభుత్వ ఉద్యోగి..

తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలోని పెనుగోలు గుట్టలు ఉన్నాయి. ఆ గిరిజన గూడేనికి రహదారి మార్గం లేదు. వాజేడు నుంచి సుమారు 17కిలోమీటర్లు కాలినడకన మూడు వాగులు, నాలుగు గుట్టులు దాటుకుంటూ అక్కడికి చేరుకోవాలి. అలాంటి మారుమూల కుగ్రామం నుంచి ఉయిక రమేష్ ప్రభుత్వ కొలువు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. గుట్టలు దిగి వసతిగృహాల్లో ఉంటూ డిగ్రీ, బీఈడీ విద్యను అభ్యసించి 2019లో పంచాయతీ కార్యదర్శిగా కొలువు సాధించి మండలంలోని పేరూరు జీపీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. మండల కేంద్రంలోని పెనుగోలు కాలనీలో సొంత ఇల్లు నిర్మించుకుంటున్న రమేష్ ఆ ఇంట్లో గృహ ప్రవేశం చేసేందుకు సన్నాహాలు చేస్తున్న క్రమంలో మావోయిస్టులు హత్య చేయడం సంచలనంగా మారింది.

గిరిజనులను గుట్టలు దింపేందుకు ఏళ్లుగా ప్రయత్నాలు..

పెనుగోలు గుట్టల్లో నివాసముంటున్న సుమారు 60కుటుంబాల్లో 15 ఏళ్ల క్రితం 30కుటుంబాలు గుట్టలు దిగి రాగా గత ఆరేళ్లల్లో మరో 20 కుటుంబాల వరకు మండల కేంద్రంలోని పెనుగోలు కాలనీకి చేరుకున్నాయి. మిగిలిన 10 కుటుంబాలను కూడా కిందకు దించేందుకు అధికారులు పలు మార్లు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆగస్టులో మంత్రి సీతక్క కూడా వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, కిందకు వచ్చేందుకు వారితో మాట్లాడుతున్నామని ప్రకటించారు. ఈ క్రమంలో పెనుగోలు గుట్టలు కొంత కాలం నుంచి మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా ఉన్నాయి. ఉన్న 10 కుటుంబాలు కూడా కిందకు దిగితే మావోయిస్టులకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అయితే ఆ కుటుంబాలను కిందకు దించేందుకు ఉయిక రమేష్ ఒత్తిడి చేస్తున్నాడని, పలుమార్లు హెచ్చరించినా పట్టించుకోకపోవడంతో రమేష్ ఖతం చేస్తున్నామని మావోయిస్టులు రమేష్ మృతదేహం వద్ద వదిలిన లేఖలో పేర్కొనడం గమనార్హం. పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రమేష్ పోలీసులకు సహకరిస్తున్నాడని, గుట్టలపై తమ దళాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు వారికి చేరవేస్తున్నాడని, ఈ విషయంపై పలుమార్లు హెచ్చరించినా తీరు మార్చుకోలేదన్న కోపంతో మావోయిస్టులు హతమార్చినట్లు స్పష్టమవుతోంది. ఇదే సమయంలో రమేష్ పెదనాన్న కొడుకైన ఉయిక అర్జున్‌ను కూడా హతమార్చడం సంచలనంగా మారింది.

ఉలిక్కిపడ్డ వాజేడు..

మావోయిస్టులు ఒకే రోజు ఇద్దరు వ్యక్తుల్ని హతమార్చడంతో వాజేడు మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు ఉలిక్కిపడ్డాయి. 1987లో వాజేడుకు చెందిన బుద్దరాజు సీతాపతిరాజును ఇంటి వద్దను హత్య చేయడం అప్పట్లో పెను సంచలనమైంది. అనంతరం 2007లో దంతులూరి తిరుపతిరాజును దూలాపురంలో ఉదయం పూటే ట్రాక్టరులో ఉండగానే మావోయిస్టులు చంపేశారు. అనంతరం 2012లో పేరూరులో ఓ ఆర్ఎంపీ డాక్టరును హతమార్చిన మావోయిస్టులు వాజేడులో కార్యకలాపాలు చేయలేదు. ఇన్నేళ్ల అనంతరం పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఒకే రోజు ఇద్దరు ఆదివాసీలను హతమార్చడంతో ఏజెన్సీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఘటనతో ఏజెన్సీలోని వాజేడు, వెంకటాపురం మండలాల్లో మావోయిస్టులకు టార్గెట్‌గా ఉన్న నేతలు, వ్యాపారస్థులు ఉలిక్కిపడ్డారు. సురక్షిత ప్రాంతంగా ఉన్న వాజేడులో మావోయిస్టులు పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో జంటహత్యలకు పాల్పడడంతో టార్గెట్ నేతలతో పాటు అధికార, ప్రతిపక్ష నాయకులను పోలీసులు అప్రమత్తం చేస్తుండగా వారంతా సురక్షిత ప్రాంతాలకు తరలేప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం.



ఇంటి వద్ద రోదిస్తున్న అర్జున్ భార్య, బంధువులు

ఉనికి కోసమే ఆదివాసీలపై మావోల దాడులు : ఎస్పీ శబరీష్

ములుగు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోల్పోయిన ఉనికిని కాపాడుకునేందుకు మావోయిస్టులు ఆదివాసీలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ములుగు ఎస్పీ శబరీశ్ తెలిపారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుగా ఉన్న ములుగు జిల్లాలోని కర్రెగుట్ట అటవీ ప్రాంతాన్ని గెరిల్లాబేస్‌గా మార్చే యత్నంలో భాగంగా వరుస దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. వాజేడులో ఇరువురిని మావోయిస్టులు హత్య చేసిన నేపథ్యంలో ఎస్పీ స్పందించారు. మీడియాకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కనీస వసతులు లేని మారుమూల గ్రామమైన పెనుగోలుకు చెందిన ఉయిక రమేష్ కష్టపడి చదువుకుని పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం పొందాడని, విద్యావంతుడైన ఆదివాసీ యువకుడిని మావోయిస్టు పార్టీకి సహకరించాలని ఒత్తిడి చేశారని తెలిపారు. అటవీ ఉత్పత్తుల సేకరణపై జీవనాధారంగా బతుకుతున్న అర్జున్‌ను పార్టీలో చేరాలని ఒత్తిడి చేశారని తెలిపారు. దీంతో వారు పెనుగోలును వదిలివచ్చారన్నారు. తమకు సహకరించడంలేదనే నెపంతో ఈ ఇద్దరిపై పోలీస్ ఇన్‌ఫార్మర్ ముద్ర వేసి పాశవికంగా హత్య చేశారన్నారు. ఈ ఘటనపై పౌర హక్కుల సంఘాలు స్పందించాలన్నారు. వాజేడు మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ఇల్లందుల యేసు అనే వ్యక్తి గతంలో మందుపాతర పేలిన ఘటనలో మరణించాడని, మరో ఘటనలో వెంకటాపురం మండలానికి చెందిన డర్రా సునీత అనే మహిళ మందుపాతర పేలి వికలాంగురాలిగా మారిందని ఎస్పీ వెల్లడించారు.



వాజేడు-జగన్నాథపురం ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

న్యాయం చేయాలని కుటుంబసభ్యుల ధర్నా

మావోయిస్టులు హతమార్చిన ఇద్దరి కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. మృతిచెందిన రమేష్‌కు భార్యతో పాటు ఇద్దరు అబ్బాయిలు, చిన్న పాప ఉంది. అలాగే అర్జున్‌కు భార్య సావిత్రితో పాటు ముగ్గురు అమ్మాయిలున్నారు. పెద్ద అమ్మాయి ఇంటర్, రెండో, మూడో అమ్మాయి పది, ఎనిమిది తరగతులను వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్నారు. అర్జున్ తన కుమార్తెలను కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబాలు రోదిస్తున్న రోదనలు మిన్నంటాయి. కుటుంబ పెద్దలను కోల్పోయిన తమకు న్యాయం చేయాలంటూ రమేష్, అర్జున్ కుటుంబాలు మృతదేహాలతో వాజేడు-జగన్నాథ పురం ప్రధాన రహదారి శుక్రవారం సాయంత్రం ధర్నా చేపట్టారు. అమాయక ఆదివాసీలను పొట్టన పెట్టుకోవడం మావోయిస్టులకు తగదన్నారు. పోలీసుల వైఖరిపై సైతం బాధిత కుటాంబాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అర్ధరాత్రి జరి గిన హత్యలపై పోలీసులకు సమాచారం ఉన్నా సంఘటనా స్థలానికి రాకపోవ డమేంటని ప్రశ్నించారు. పోస్టుమార్టం చేయించడంలోనూ పోలీసులు నిర్లక్ష్యం చేశారంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మృతదేహాలతో జాతీ య రహదారిపై ఆందోళనకు బయలుదేరిన బాధిత కుటుంబ సభ్యులు, స్థాని కులకు వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సైలు హరీష్, తిరుపతిరావు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం తరఫున రెండు కుటుంబాలకు రూ25లక్షలు చొప్పున నగదు, రెండు కుటుంబాలలో ఎవరికైనా రెండు ఉద్యోగాలు ఇచ్చేందుకు జిల్లా ఉన్నతాదికారులతో మాట్లాడతామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరవింపచారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ కుమార్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లలో భారీగా తిరస్కరణ

- దరఖాస్తులో పొరపాట్ల కారణంగా 5,380 దరఖాస్తుల తిరస్కరణ
- నేటి నుంచి మరో అవకాశం

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ- వరంగల్ - ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చే ఏడాది మార్చి నెలలో జరుగనున్నాయి. ఇందు కోసం ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఈనెల 6 వరకే ఎన్‌రోల్‌మెంట్ గడువు ముగిసింది. అయితే ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పరిధిలో 28,658 మంది ఉపాధ్యాయ, అధ్యాపకులు ఓటర్లుగా నమోదు చేసుకోగా, 23,278 దరఖాస్తులు ఆమోదయోగ్యమయ్యాయి. ఇక 5,380 మంది దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. అయితే ఉపాధ్యాయ, అధ్యాపకులతో పాటు ఆశావహ అభ్యర్థులు కొంత మందివి దరఖాస్తు చేశారు. ఇందులో భారీగానే తప్పులు దొర్లినట్లు తెలుస్తోంది. దీంతో ఈసారి భారీగా తిరస్కరణకు గురికావడంతో ఎన్నికల కమిషన్ ఈ నెల 23 నుం చి మరోసారి అవకాశం కల్పించింది.

అసంపూర్తి దరఖాస్తుల తిరస్కరణ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో చాలా దరఖాస్తులు అసంపూర్తిగా ఉండటంతో తిరస్కరణకు గురయ్యాయి. సమర్పించిన దరఖాస్తుల్లో కౌంటర్ సంతకాలు, హెచ్‌వోడీల సంతకాలు లేకపోవడంతో అనేక మంది దరఖాస్తులు తిరస్కరణకు గురయిన ట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయ, అధ్యాపకులు చేసుకున్న దరఖాస్తుల్లో ఆరోవంతు తిరస్కరణకు గురికావడంతో ఒకానొక దశలో ఇప్పటికే పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు ఆశావహ అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. అయితే ఎన్నికల కమిషన్ ప్రకటనతో వారు ఊపిరి పీల్చుకుంటున్నారు.

నేటి నుంచి మరో అవకాశం

దరఖాస్తుల్లో దొర్లిన తప్పులతో భారీగా తిరస్కరణకు గురికావడంతో ఆలోచించిన ఎన్నికల కమిషన్.. మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఈనెల 23 నుంచి తిరస్కరణకు గురైన దరఖాస్తులతో పాటు ఇప్పటి వరకు దరఖాస్తులు చేసుకోని వారికి అవకాశం కల్పించింది. ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారు వారి దరఖాస్తుల స్టేటస్‌లు తెలుసుకొని తిరస్కరణకు గురైన వారు మరోమారు దరఖాస్తు చేసుకోవాలని లేదంటే వారు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదముందని ఎమ్మెల్సీ అభ్యర్థులు, ఆశావహులు ఉపాధ్యాయ, అధ్యాపకులను అభ్యర్థిస్తున్నారు.

జిల్లాల వారీగా ఇలా..

జిల్లా పేరు	నమోదు చేసుకున్న ఓట్లు	ఆమోదించినవి	తిరస్కరించినవి
వరంగల్	2,574	1,928	646
హనుమకొండ	5,590	4456	1,134
జనగామ	1,058	829	229
ఖమ్మం	4,378	3,883	495
కొత్తగూడెం	2,252	1,821	431
నల్గొండ	5,372	4,708	664
యాదాద్రి	1,726	839	887
సూర్యాపేట	2,945	2,531	414
భూపాలపల్లి	361	261	100
మహబూబాబాద్	1,525	1,308	217
ములుగు	683	561	122
సిద్దిపేట	194	153	41
మొత్తం	28,658	23,278	5,380

చలి తీవ్రత నేపథ్యంలో
జాగ్రత్తలు పాటించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య



వరంగల్ మెడికల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న చలి తీవ్రత వల్ల వృద్ధులు, చిన్న పిల్లల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య సూచించారు. చలి తీవ్రత క్రమంగా పెరగడం, ఉష్ణోగ్రతలు పడిపోవడంవల్ల రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉండటంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో చలి బారిన పడకుండా తగు జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. దగ్గు, ముక్కు కారడం, శ్వాస సంబంధిత సమస్యలు, గొంతు నొప్పి, తుమ్ములు వస్తాయన్నారు. చిన్నారుల ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఏర్పడి నిమోనియా బారిన పడే అవకాశం ఉందని, బ్యాక్టీరియా, ఫంగస్, ప్రోటో జోవన్ల వల్ల శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. రాత్రి సమయంలో చల్లగాలి ఇంట్లోకి రాకుండా కిటికీలు, తలుపులు మూసివేసి వెచ్చదనం కోసం వేడినిచ్చే హైవోల్టేజ్ బల్బులను వాడాలన్నారు. వాకింగ్‌కు వెళ్లేవారు చలి ఎక్కువగా ఉన్నప్పుడు జాగ్రత్తలు పాటించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య సూచించారు.



భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

ప్రకృతిలో ఉన్న ప్రతీ ఆహార ద్రవ్యానికీ వేటి గుణాలు వాటికున్నాయి. అంతకు మించిన అంశం ఇంకొకటుంది... ఆయుర్వేద శాస్త్రం దాన్ని 'ప్రభావం'

గుణాలు తెలిసి తినాలి

అన్నది. ద్రవ్యాల ప్రభావం వలన ఆహారానికి ఔషధ ప్రయోజనం కలుగుతోంది! భోజనకుతూహలం గ్రంథంలో రఘునాథ సూరి అనేక ఆహార పదార్థాల ప్రభావాన్ని వివరిస్తూ, సిద్ధాన్నప్రకరణం అని ఒక అధ్యాయం వ్రాశాడు. ఆహార ప్రయోజనాన్ని ఈ అధ్యాయం వివరిస్తుంది. ఆహార పదార్థాల తయారీకి వాడే ద్రవ్యాలకు ఏ గుణాలుంటాయో వాటితో వండిన పదార్థాలక్కూడా అవే గుణాలుంటాయన్నది ఇందులో మొదటి సూత్రం. ఉదాహరణకు నువ్వులు వాతాన్ని తగ్గిస్తాయి. నువ్వులు కలిపి వండిన ఏ ఆహార పదార్థమైనా వాతాన్ని తగ్గించేదిగానే ఉంటుంది. అయితే ఈ సూత్రం అన్ని సందర్భాల్లోనూ వర్తించదు. ఉదాహరణకు ఆరు నెలల పాటు పాతబడిన బియ్యం తేలికగా



అరిగే స్వభావాన్ని కలిగి ఉంటాయి. కాబట్టి, ఆ బియ్యాన్ని వండిన అన్నం తేలికగా అరుగుతుంది. కడుపు నిండుతుంది. వాతాన్ని, పిత్తాన్ని, కఫాన్ని కూడా అదుపు చేస్తుంది. కానీ, ఈ బియ్యంతోనే చేసిన మరమరాలకు, అటుకులకు అవే గుణాలు ఉండటం లేదు. పాతబియ్యంతో చేసిన మరమరాలు అన్నం కన్నా తేలికగా అరుగుతాయి. కానీ కడుపు నింపవు. అటుకులు కష్టంగా అరుగుతాయి. వాతం చేస్తాయి. కడుపునొప్పి లాంటివి తెస్తాయి. ఇందుకు వాటి ప్రభావం కారణం. ఈ ప్రభావంలో మార్పు తెస్తున్నదేది?

"క్వచిత్సంస్కార భేదేనగుణభేదోభవేదిహఖ సంస్కార భేదం" అంటే ఆహార ద్రవ్యాల తయారీ తీరులో మార్పులు చేయటంలో తేడాలవలన వాటి గుణాలలో కూడా తేడా లేర్పడుతున్నాయి. అంటూ రఘునాథపండితుడు భోజన కుతూహలంలో ప్రభావం ఎలా ఏర్పడుతుందో వివరించాడు! అంటే, ఆహార పదార్థాల తయారీ తీరు దాని గుణాలను ప్రభావితం చేస్తుందన్న మాట. ఏం వండారన్నదానికన్నా ఎలా వండారన్నదే ముఖ్యం. ఒక్కోసారి కొన్ని పదార్థాల్ని కలపటం వలన అంతకు మునుపులేని కొత్త గుణాలు ఆ ఆహార పదార్థానికి ఏర్పడతాయి. దీనికి రఘునాథ సూరి కొన్ని ఉదాహరణలు ఇచ్చాడు. అవి..

"కాదలంగురుసర్పిశ్శతద్యుక్తమ్ సుపచేత్ భవేత్ఖ"

కాదలం అంటే కదళీ (అరటి)ఫలం, సర్పి అంటే నెయ్యి. అరటి పండు, నెయ్యి రెండూ ఆలస్యంగా అరిగే స్వభావం కలిగినవే! కానీ అన్నంతో కలిపి వీటిని తిన్నప్పుడు ఒకే విధమైన ఫలితాలు ఉండవు. నెయ్యి వల్ల అన్నం త్వరగా అరుగుతుంది. అరటిపండుతో కలిపి తింటే అన్నం ఆలస్యంగా అరుగుతుంది. ఈ విధంగా ఏవి తింటే శరీరంమీద ఏ గుణాలు కలుగుతాయో ముందుగా మనం తెలుసుకోవాలి. ఆహార పదార్థాలను ఎలా వండుకోవాలో ఆలోచించాలి. ఆహారంలో ఏ ఏ ద్రవ్యాలను కలపవచ్చో, వేటివేటిని కలపకూడదో తెలుసుకోవాలి. అప్పుడే పరిపూర్ణమైన ఆరోగ్యవంతులమవుతాం!

- గంగరాజు అరుణాదేవి

చలిలో చమక్కుమనేలా...

చలికాలం మేకప్ పట్ల చికాకు పెరుగుతుంది. మేకప్ వల్ల చల్లని వాతావరణంలో చర్మం మరింత పొడిబారిపోయినట్టు అని పించడమే ఇందుకు కారణం. ఇలా జరగకుండా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించాలి.

తేమ తగ్గకుండా

మేకప్ ఉత్పత్తుల వల్ల చర్మంలో తేమ తగ్గిపోకుండా ఉండడం కోసం, ఉపయోగించే సీరమ్, మాయిశ్చరైజర్, ప్రైమర్‌లలు కూడా తేమతో కూడినవై ఉండేలా చూసుకోవాలి. మేకప్‌కు ముందు ముఖం కడుక్కున్న వెంటనే తడి పూర్తిగా ఆరేలోగానే వీటిని పూసుకోవాలి.



ద్రవరూప ఉత్పత్తులు

పౌడర్ ఆధారిత ఉత్పత్తులకు బదులుగా ద్రవరూపంలో ఉండే ఫౌండేషన్, బ్లష్‌లు వాడుకోవాలి. ఇవి చర్మానికి చక్కగా అంటుకుపోయి చర్మం తేమను హరించకుండా ఉంటాయి.

పెదవులు

చలికాలం పెదవులు పొడిబారిపోయి, పగిలిపోకుండా ఉండడం కోసం లిప్ స్క్రబ్‌తో వారానికోసారి పెదవులను రుద్దుకుని మృతకణాలను తొలగించుకోవాలి. తేమను అందించే ప్రత్యేకమైన లిప్‌స్టిక్స్‌నే ఈ కాలంలో వాడుకోవాలి.

బ్లష్

చెక్కిళ్లకు ఎరుపు దనాన్ని తెచ్చిపెట్టే బ్లష్‌లను ఎంచుకునేటప్పుడు క్రీమ్ ఆధారిత బ్లష్‌నే ఎంచుకోవాలి.

సెట్టింగ్ స్ప్రే

పూర్తయిన మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉండడం కోసం సెట్టింగ్ స్ప్రే వాడుకుంటూ ఉంటాం. అయితే ప్రత్యేకించి చలికాలం కోసం వాటర్‌ప్రూఫ్ సెట్టింగ్ స్ప్రేను ఎంచుకోవాలి.

శీతాకాలం వేడి వేడిగా..!

జీడిపప్పు కోడికూర

కావాల్సిన పదార్థాలు

చికెన్ ముక్కలు- 750 గ్రాములు, ఉల్లిపాయ ముక్కలు-ఒక కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక స్పూను, కారం- ఒక స్పూను, పసుపు- రెండు స్పూనులు, నూనె- అరకప్పు, జీడిపప్పు- 150 గ్రాములు, గరం మసాలా- ఒక స్పూను, పెరుగు- ఒక కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు స్పూనులు, ఉప్పు- తగినంత, నీళ్లు- రెండు కప్పులు, నెయ్యి- రెండు స్పూనులు

తయారీ విధానం

- ఒక మూకుడులో నెయ్యి వేసి వేడి చేయాలి. 50 గ్రాముల జీడిపప్పును వేయించి చల్లార్చాలి. విగిలిన జీడిపప్పును కొద్దిగా నీళ్లు వేసి మిక్సీలో ముద్దగా చేయాలి.
- ఆ మూకుడులోనే నూనెను వేడి చేయాలి. దీనిలో ఉల్లిపాయ ముక్కలు, గరం మసాలా వేసి వేయించాలి.
ఉల్లిపాయ ముక్కలు కొద్దిగా వేగిన తర్వాత చికెన్ ముక్కలు వేయాలి. పెరుగు కూడా వేయాలి. మూత పెట్టి బాగా మగ్గనివ్వాలి.
- చికెన్ ముక్కలు బాగా ఉడికిన తర్వాత దానిలో అల్లం వెల్లులి పేస్ట్, పసుపు, కారం, ఉప్పు వేయాలి. రెండు కప్పుల నీళ్లు పోసి ఉడకనివ్వాలి.
- ఆ తర్వాత జీడిపప్పు పేస్ట్ వేసి 10 నిమిషాలు ఉడకనివ్వాలి.
కూరను దింపే ముందు దానిలో వేయించిన జీడిపప్పు, తరిగిన కొత్తిమీర చల్లాలి.

జాగ్రత్తలు

- చికెన్ ముక్కలు మరీ చిన్నగా.. లేదా మరీ పెద్దగా లేకుండా చూసుకోవాలి.
- చిక్కటి పెరుగు వేస్తే రుచి చాలా బావుంటుంది.
- పసుపు రెండు స్పూన్ల కన్నా ఎక్కువ వేయకూడదు. ఎక్కువ వేస్తే చిరు చేదు వస్తుంది.

బజ్జీ మిర్చీ కూర



కావాల్సిన పదార్థాలు

బజ్జీ మిర్చీ- అర కిలో, జీలకర్ర- ఒక స్పూను, నిమ్మరసం- 4 స్పూన్లు, నూనె- ఒక కప్పు, నువ్వులు- 100 గ్రాములు, తురిమిన ఎండు కొబ్బరి- 200 గ్రాములు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని


తయారీ విధానం

- బజ్జీ మిర్చీని బాగా కడిగి సగం చీరాలి.
- నువ్వులు, తురిమిన ఎండు కొబ్బరిని కలిపి మిక్సీలో వేసి పొడి చేయాలి.
- ఒక మూకుడులో నూనె వేసి వేడి చేయాలి. దానిలో బజ్జీ మిర్చీ వేసి వేయించాలి. వాటిని బయటకు తీసి చల్లార్చాలి.
- మిగిలిన నూనెలో జీలకర్ర వేసి వేయించాలి. ఆ తర్వాత నువ్వులు, ఎండుకొబ్బరి పొడిని వేసి వేయించాలి. దానిలో నీళ్లు వేసి ఉడకనివ్వాలి. కొద్ది సేపటి తర్వాత నూనె పైకి తేలుతుంది. అప్పుడు తగినంత ఉప్పు వేసుకోవాలి.
- నూనె పైకి తేలిన తర్వాత మిర్చీని వేసి బాగా ఉడకనివ్వాలి.

జాగ్రత్తలు

- బజ్జీ మిర్చీని చీల్చకుండా నూనెలో నేరుగా వేయకూడదు. వేస్తే నూనె పైకి చిమ్మే ప్రమాదం ఏర్పడుతుంది.
- ఈ కూరను అన్నంలో తినాలంటే కొద్దిగా పలచగా చేసుకోవచ్చు. చపాతీలలో తినాలంటే మాత్రం చిక్కగా చేసుకుంటే బావుంటుంది.

కోడిగుడ్డు సాలన్



కావాల్సిన పదార్థాలు

ఉడికించిన కోడిగుడ్లు- ఆరు, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక స్పూను, కారం- ఒక స్పూను, పసుపు- పావు స్పూను, నూనె- అర కప్పు, చింతపండు గుజ్జు- అరకప్పు, ఉప్పు- తగినంత, వేరుశనగపప్పు- రెండు స్పూనులు, గసగసాలు- ఒక స్పూను, నువ్వులు- ఒక స్పూను, తురిమిన ఎండు కొబ్బరి- మూడు టేబుల్ స్పూనులు, ధనియాలు- ఒక స్పూను, జీలకర్ర- ఒక స్పూను, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం


- ఒక మూకుడులో గసగసాలు, నువ్వులు, వేరుశనగపప్పు, ఎండు కొబ్బరి, ధనియాలు, జీలకర్ర వేసి పొడి చేయాలి.
- ఉడకబెట్టిన కోడిగుడ్లపై పొర తీసి రెండేసి ముక్కలుగా చేయాలి.
- ఒక మూకుడులో నూనె వేడి చేసి ఉల్లిపాయలు వేయించాలి. దానిలో అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, ఉప్పు వేసి కొద్దిగా నీళ్లు పోయాలి.
- ఈ నీళ్లలో ముందుగా చేసుకున్న పొడి.. చింతపండు గుజ్జు వేసి కలపాలి. బాగా ఉడికిన తర్వాత ఉడకబెట్టిన కోడిగుడ్డు ముక్కలను దీనిలో వేయాలి.

జాగ్రత్తలు

- కోడిగుడ్లను ఎక్కువగా ఉడకబెట్టకూడదు. సగం ఉడకబెట్టిన గుడ్లు సరిపోతాయి.
- చింతపండు గుజ్జు తగినంతే వేయాలి. ఎక్కువ అయితే సాలన్ రుచిలో తేడా వస్తుంది.

వేడిని పెంచే యోగాసనాలు

చలికాలంలో మనసు, శరీరం అంత ఉత్సాహంగా అనిపించవు. చలి వల్ల శరీరం ఉష్ణోగ్రతను కోల్పోతుంది. దీంతో నీరసం ఆవహిస్తుంది. జలుబు, దగ్గు వంటి సమస్యలు కూడా వేధిస్తుంటాయి. వీటన్నింటినీ నివారించేందుకు యోగా మంచి మార్గమని ఆయుర్వేదం చెబుతోంది. శీతాకాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచే యోగాసనాలు ఇవే...



సూర్య నమస్కారం

- ఉదయిస్తున్న సూర్యుని ముందు నిలుచుని చేసే ఈ నమస్కారం ఎంతో విశిష్టమైంది. శరీరానికి సూర్యరశ్మి సోకగానే మనసు ఉత్తేజితం అవుతుంది. రక్త ప్రసరణ వ్యవస్థ వేగవంతమవుతుంది. కీళ్ల కదలికలు మెరుగవుతాయి. వెన్నెముక దృఢంగా మారుతుంది.

వీరభద్రాసనం

- ఈ ఆసనం శరీరంలో వేడిని ఉత్పత్తి చేస్తుంది. శరీరానికి చలిని తట్టుకునే శక్తిని ఇస్తుంది. కాళ్లు, చేతులు, భుజాల్లో కదలికలను పెంచి శరీర సామర్థ్యాన్ని స్థిరపరుస్తుంది. ఏకాగ్రతను పెంచుతుంది.





నటరాజాసనం

- ఇది ప్రత్యేకమైన ఓ నృత్య భంగిమ. ఈ ఆసనం వేయడం వల్ల చలి కారణంగా బిగుసుకున్న కండరాలు వదులుగా మారతాయి. భుజాలు, పాదాలు, వేళ్లకు రక్తప్రసరణ వేగంగా జరుగుతుంది. ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది. శరీరానికి చురుకుదనం లభిస్తుంది.

భుజంగాసనం

- చలికాలంలో జీర్ణక్రియ మందగిస్తుంది. భుజంగాసనం వేయడం వల్ల జీర్ణాశయంలో జఠరాగ్ని ఏర్పడుతుంది. ఇది ఆహారం తేలికగా జీర్ణం కావడానికి తోడ్పడుతుంది. ఛాతి, ఊపిరితిత్తులు, ఉదర కండరాల్లో కూడా ఈ ఆసనం వేడిని ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల జలుబు, ముక్కు దిబ్బడ వంటి సమస్యలు తీవ్ర స్థాయిలో వేధించకుండా ఉంటాయి.





ఉత్కటాసనం

- శీతాకాలంలో చలి వల్ల శరీరం బిగుసుకుపోతుంది. ఉత్కటాసనం వేయడం వల్ల శరీరంలోని కండరాలు, రక్తం వేడెక్కుతాయి. ముఖ్యంగా తుంటి, తొడలు, మోకాళ్లకు తగిన ఉష్ణం అంది సులభంగా కదులుతాయి.

అధోముఖ స్వనాసనాసనం

- ఈ ఆసనం వేయడం వల్ల శరీరం మొత్తం సాగినట్లవుతుంది. ముఖ్యంగా వీపు, భుజాలు, కాళ్లలో రక్త ప్రసరణ వేగం పెరుగుతుంది. రక్తం ఎగువకు ప్రవహించడం వల్ల తలకు, మెదడుకి తగినంత వేడి రక్తం అందుతుంది. దీనివల్ల బద్ధకం, నీరసం, నిద్రించాలనే భావనలు మాయమవుతాయి.





వృక్షాసనం

- ఈ ఆసనం శరీరాన్ని సమతాస్థితిలో ఉంచుతుంది. చల్లని వాతావరణం వల్ల కలిగే మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. గాలి పీల్చుకునే వేగాన్ని క్రమబద్ధీకరిస్తుంది. తీసుకున్న ఆహారంలోని పోషకాలు శరీరానికి అందేలా చేస్తుంది. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత మోతాదుకు మించి తగ్గకుండా ఉంటుంది.

వ్యాపకంగా మొదలై... ఎందరికో ఆదర్శమై

ఆమె సాధారణ గృహిణి. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టింది. వ్యాపకంగా మొదలై... ఇప్పుడు ఏడాదికి ముప్ఫై లక్షల టర్నోవర్ సాధించే స్థాయికి ఎదిగింది. విభిన్నమైన ఔషధ రకం పుట్టగొడుగులను పెంచుతూ... లాభాల పంట పండిస్తోంది. పారిశ్రామికవేత్తగా తనలాంటి మహిళలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న **సుమన్ సాఖీజా** ప్రయాణం ఇది..



సుమన్‌ది ఢిల్లీలోని ద్వారక. ఆమెకు తన పిల్లలే ప్రపంచం. వాళ్ల ఆలనాపాలనతోనే రోజులు గడిచిపోయేవి. క్రమంగా పిల్లలు పెద్దవాళ్లయ్యారు. వాళ్ల చదువులేవో వాళ్లు చదువుకుంటున్నారు. దాంతో సుమన్‌కు ఖాళీ సమయం దొరికింది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంది ఆమె. ఇంటివద్ద ఉంటూనే ఏదైనా చేయాలని భావించింది. అదే సమయంలో పుట్టగొడుగుల పెంపకం గురించి తెలిసింది. హరియాణాలోని హైక్ మష్రూమ్ అండ్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ సెంటర్ వాళ్లు శిక్షణ ఇస్తున్నారని తెలుసుకుని... అందులో చేరింది. అక్కడ శిక్షణ తీసుకుంటూనే, వివిధ మాధ్యమాల ద్వారా పుట్టగొడుగుల పెంపకానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించింది.



అరుదైన రకం...

సైన్స్‌పై ఏ మాత్రం అవగాహన లేని సుమన్ బటన్ పుట్టగొడుగుల పెంపకంపై ప్రత్యేక శిక్షణ తీసుంది. ఈ క్రమంలోనే ఆమెకు కార్డిసెప్స్ మిలిటరీస్ అనే ఔషధ గుణాలున్న పుట్టగొడుగుల గురించి తెలిసింది. వీటిపై పరిశోధన ప్రారంభించింది. ఇవి హిమాలయాల్లో మాత్రమే లభించే ప్రత్యేకమైన ఫంగస్‌లని తెలుసుకుంది. కాస్త శ్రద్ధ పెడితే వీటిని ప్రయోగశాలల్లో కూడా పెంచవచ్చని ఆమెకు అర్థమైంది. దీనితో వీటి పెంపకాన్ని ఇంట్లోనే నిర్వహించాలని నిర్ణయించుకుంది సుమన్.

ఎదురు చూడక్కర్లేదు...

"కార్డిసెప్స్‌ను పెంచడానికి ఎక్కువ స్థలం అవసరం లేదు. కేవలం 200 చదరపు అడుగుల స్థలంలో నాలుగు లక్షల పెట్టుబడితో ప్రయోగశాల ఏర్పాటు చేసుకున్నా. థాయ్‌లాండ్ నుంచి కార్డిసెప్స్ విత్తనాలను తెప్పించుకుని పుట్టగొడుగుల పెంపకం ప్రారంభించాను. ఇవి చాలా తక్కువ సమయంలోనే చేతికి అందివస్తాయి. అంతేకాదు... చాలా రోజుల వరకు తాజాగా ఉంటాయి. వెంటనే అమ్ముడుపోవాలన్న ఆందోళన అక్కర్లేదు. ఏడాదికి నాలుగు పంటలు పండించుకోవచ్చు. ఈ కార్డిసెప్స్‌లో అత్యధికంగా యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడానికి, మలబద్ధకం, మధుమేహం, మూత్రపిండాల వ్యాధుల నివారణకు వీటిని వివిధ రూపాల్లో వినియోగిస్తున్నారు" అని చెప్పుకొచ్చింది సుమన్.

పుష్కలంగా ఔషధ గుణాలు...

"నేను కార్డిసెప్స్ పుట్టగొడుగుల పెంపకం గురించి పరిశోధించి చాలా విషయాలు తెలుసుకున్నాను. ఇవి ఎక్కువగా పర్వత ప్రాంతాల్లో మాత్రమే లభిస్తాయి. వీటిని సేకరించడం చాలా కష్టం. అంతేకాదు... వీటి కోసం పర్వత ప్రాంతాల్లో మనుషుల తిరగడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుంది. ఆ ప్రాంతాల్లో మరలా ఈ పుట్టగొడుగులు ఉత్పత్తి కాకపోవచ్చు. వీటికి ఉన్న ఔషధ గుణాల వల్ల రకరకాల మందుల తయారీలో ఉపయోగిస్తున్నారు. డిమాండ్ కూడా అధికంగానే ఉంది. ఒక కేజీ కార్డిసెప్స్ మూడు లక్షల రూపాయల వరకు ధర పలుకుతోంది. సహజంగా లభించే కార్డిసెప్స్ కంటే ప్రయోగశాలల్లో పెంచేవి సరసమైన ధరకు లభిస్తాయి. వీటి అమ్మకాల కోసం ఇటీవలే ఆరెంజ్ హెర్బ్ బ్రాండ్ పేరిట సంస్థను ప్రారంభించాం" అంటారు సుమన్. ఈ సంస్థ ద్వారా వినూత్న సాగు పద్ధతులను పరిచయం చేసి, మరింతమంది మహిళలను సాధికారత వైపు అడుగులు వేయించాలన్నది ఆమె ఆశయం.

మహిళలకు శిక్షణ...

పుట్టగొడుగుల పెంపకంలో ఆసక్తిగల ఔత్సాహిక మహిళలకు సుమన్ ప్రత్యేకంగా శిక్షణ ఇస్తోంది. ప్రతి నెలా 20 నుంచి 30 మంది వరకు ఈ అవకాశాన్ని వినియోగించుకొంటున్నారు. సొంత ప్రయోగశాలలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కార్డిసెప్స్ పెంపకంతోపాటు సుమన్ కుంకుమ పూల సాగును కూడా నిర్వహిస్తోంది. ఏడాదికి 600 గ్రాముల కుంకుమ పువ్వు ఉత్పత్తి చేసి, మూడు లక్షల టర్నోవర్ సాధించింది. ఆగస్టు నుంచి నవంబరు వరకు కుంకుమ పువ్వు సాగుకు అనుకూలంగా ఉంటాయని, మిగతా సమయమంతా కార్డిసెప్స్‌ను పెంచుతానని సుమన్ చెప్పుకొచ్చింది.

భారతీయ సంస్కృతికి విశ్వవ్యాప్త గౌరవం!

విదేశీ దండయాత్రల వల్ల మన సంస్కృతి ధ్వంసం

- చొప్పించిన బానిస మూలాలను తొలగించుకుంటున్నాం
- ఏకత్వానికి భిన్నత్వంతో ఇంద్రధనసు లాంటి సౌందర్యం: ముర్ము
- లోక్‌మంథన్-2024ను జ్యోతి వెలిగించి ప్రారంభించిన రాష్ట్రపతి

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పురాతన కాలం నుంచే భారతీయ సైద్ధాంతికత ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని, భారతీయుల మత విశ్వాసాలు, కళలు, సాంకేతిక పరిజ్ఞానం, భాష, సాహిత్యం విశ్వవ్యాప్తంగా గౌరవం పొందాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మనదేశంపై దండయాత్రలతో సామ్రాజ్యవాదులు, విదేశీ శక్తులు ఆర్థికంగా మనల్ని దోచుకోవడమే కాకుండా సామాజికంగా కూడా దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. మన భాష, సంస్కృతి, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను విధ్వంసం చేశారని చెప్పారు. మన సమాజాన్ని విడగొట్టేందుకు, ఐకమత్యాన్ని దెబ్బతీసేందుకు శతాబ్దాల పాటు ప్రయత్నాంచారని, మనలో బానిస మూలాలను చొప్పించారని పేర్కొన్నారు.. ఈ బానిసత్వ ఆలోచనలను ఇప్పుడు మనం తొలగించుకుంటున్నామని... రాజ్‌పథ్ పేరు కర్తవ్యపథ్‌గా.. దర్బార్ హాల్ పేరు గణతంత్ర మండప్‌గా మారిందని గుర్తుచేశారు. శుక్రవారం, శిల్పకళావేదికలో లోక్‌మంథన్-2024 ఉత్సవాలను ముర్ము జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె, లోక్-అవలోకన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె ప్రసంగించారు. భిన్నత్వంలో ఏకత్వం మన దేశ బలం అని.. మన మూల సిద్ధాంతమైన ఏకత్వానికి భిన్నత్వం ఇంద్ర ధనసులాంటి సౌందర్యాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఐకమత్యం, సామరస్యమే మన సభ్యత, భవిష్యత్తు అని.. ఆ దిశగా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే ప్రతి భారతీయుడూ దేశమే అన్నింటికన్నా ముఖ్యం అన్న భావనను ప్రోది చేసుకోవాలని పేర్కొన్నారు. మన పూర్వీకులు అందించిన సంప్రదాయాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత మనపై ఉందని ఆమె అన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను బలోపేతం చేసే గొప్ప కార్యక్రమం లోక్‌మంథన్ అని, ఈ కార్యక్రమం సందర్భంగా అహల్యబాయ్ హోల్కర్, రాణి రుద్రమ, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీర వనితల గురించి ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు ప్రతి రాష్ట్రం దేశ సమైక్యతను ముందుకు తీసుకువెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. భారత దేశ సాంస్కృతిక విలువలు ఎన్నో కుట్రలను తట్టుకుని నిలిచాయన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్, చిత్రంలో రాష్ట్రపతి ముర్ము, గవర్నర్ జిష్ణుదేవ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



గిరిజనుల జీవనవిధానంపై చర్చ జరగాలి: కిషన్‌రెడ్డి

దేశమే అన్నింటికన్నా శ్రేష్ఠం అన్న భావనతో లోక్‌మంథన్ పనిచేస్తుందని ఉత్సవ రిసెప్షన్ కమిటీ చైర్మన్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. భారతీయ పరంపర, సంస్కృతి, కళలు, సామాజిక ఐక్యత, భారతీయ జ్ఞాన-విజ్ఞాన సంపద, విద్య, వైద్యవిధానం, పర్యావరణ పరిరక్షణ, విభిన్న క్షేత్రాల్లో లోక్ విచార్, లోక్ వ్యవహార్, లోక్ వ్యవస్థకు సంబంధించిన అంశాలపై లోక్‌మంథన్‌లో చర్చ జరుగుతోందని వివరించారు. గిరిజనుల జీవన విధానంపై చర్చ జరగాల్సిన అవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. ప్రాచీన కాలం నుంచే వారు జల్, జంగల్, జమీన్‌తో మమేకమయ్యారని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మాట్లాడారు. భిన్న సంస్కృతులు, జీవన విధానాల సమ్మేళనం హైదరాబాద్ అని అన్నారు. ఇది మినీ ఇండియా అని.. ప్రపంచంలో అత్యున్నత దేశంగా భారత్‌ను తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పనిచేయాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రజ్ఞా ప్రవాహ్ జాతీయ ప్రధాన కార్యదర్శి నందగోపాల్, లోక్‌మంథన్-2024 వర్కింగ్ ప్రెసిడెంట్, డాక్టర్ టి. హనుమాన్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళా సౌరభం...
నవతరం నీరాజనం

లోక్‌మంథన్ రెండవ రోజు ఉప్పొంగిన యువోత్సాహం

- విద్యార్థులతో కళకళలాడిన ప్రాంగణాలు
- వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు
- వారి ప్రదర్శనలకు అచ్చెరువొందిన విద్యార్థిలోకం

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్‌లు, యూట్యూబ్ వీడియోలే లోకం అనుకునే నేటి యువత.. ఆ కళాకారుల సంప్రదాయ ప్రదర్శనలను ప్రత్యక్షంగా తిలకించి అబ్బురపడ్డారు. మాదాపూర్‌లోని శిల్పారామం ప్రాంగణంలో జరుగుతున్న లోకమంథన్ రెండవ రోజైన శుక్రవారం ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఏపీ, అసోం, లద్దాఖ్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల ప్రదర్శనలను విద్యార్థులు అమితాసక్తిగా తిలకించారు. నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు గిరిజన సంప్రదాయాలను తెలుసుకునేందుకు అమితాసక్తి కనబరిచారు. ఎలాంటి పరికరాలు ఉపయోగించకుండానే జంతువుల అరుపులు, పక్షుల కిలకిలరావాలను పలికించిన తీరు తనను ఆశ్చర్యపరిచిందని భారత్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థిని శ్రీజ చెప్పింది. ఎక్కువ మంది విద్యార్థులు లోకమంథన్‌లో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లకంటే ఈ ప్రదర్శనల దగ్గరే ఎక్కువ సమయం గడిపామని చెప్పారు. మన కళారూపాలు భావితరాలకు చేరువ చేయడానికి ఆ కళాకారులకు తగిన ప్రోత్సాహం అందించాల్సి ఉంటుందని, మరుగున పడిపోతున్న కళారూపాలను బ్రతికించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని విద్యార్థులు చెప్పారు.



అలరించిన కార్యక్రమాలు

లోక్‌మంథన్ కళా ప్రదర్శనల్లో భాగంగా ఆ కళాకారులు ప్రదర్శించిన చిడతల రామాయణం చిన్నారులకు కూడా అర్థమై అందులో వారిని లీనం చేస్తూ సాగింది. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామానికి చెందిన బృందం చేసిన ఈ ప్రదర్శన విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. జై శ్రీరామ్ నినాదాలతో ప్రాంగణం మార్మోగింది. రామలక్ష్మణులు రాజ్యం వీడి వనవాసానికి బయలు దేరండంతో ప్రారంభించిన వీరి కథ రావణ సంహారం వరకూ ఆకట్టుకునే రీతిలో సాగింది. ఇక ఎంతటి వారినైనా లీనం చేసుకునే అద్భుతమైన కళ జానపదం. కొంటెతనం, అలక.. అన్నీ తమ పాటల ద్వారానే చూపుతూ నల్లగొండకు చెందిన జడ కోలాటం బృంద ప్రదర్శన విద్యార్థులను ఆనంద పారవశ్యంలో ముంచెత్తింది. పరమేశ్ కోలాటం బృందానికి చెందిన 15 మంది సభ్యుల బృందం గతంలో నగరంలో చాలాసార్లు ప్రదర్శనలు చేసినప్పటికీ విద్యార్థుల నుంచి మాత్రం అపూర్వ స్పందన వ్యక్తమైంది. ఇక హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్డా నుంచి వచ్చిన వన్షిఖా సంగ్రియత్ యువ మంత్ బృందం జానపద నృత్యం ద్వారా శివపార్వతుల కళ్యాణం ప్రదర్శన ద్వారా వీక్షకులను భక్తిమార్గంలోకి తీసుకువెళ్లారు.



చిడతల రామాయణం చెబుతున్న కరీంనగర్ జిల్లా తుమ్మనపల్లి గ్రామానికి చెందిన బృందం

తొలిసారి ఒకేవేదికపై రాష్ట్రపతి, ఆరెస్సెస్ చీఫ్

లోక్‌మంథన్-2024లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ ఒకే వేదికపై ఆసీనులయ్యారు. రాష్ట్రపతి, ఆరెస్సెస్ చీఫ్ ఒకే వేదిక పాలు పంచుకోవడం తొలిసారి అని సంఘ్ వర్గాలు తెలిపాయి. వందేళ్ల సంఘ్ చరిత్రలో తొలిసారిగా ఈ ఘటన లోక్‌మంథన్‌లో జరిగిందని పేర్కొన్నాయి.



యాదగిరిగుట్టలో మిషన్ భగీరథ పైలాన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల; చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, సీతక్క

పత్తి కొనుగోళ్లలో దేశంలోనే తెలంగాణ నెం.1

- ప్రతిపక్షాలవి అర్థంలేని విమర్శలు: తుమ్మల
- 'ధరణి' పేరిట భూములు గుంజుకున్నారు: సీతక్క
- మరో పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారం: మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ/యాదగిరిగుట్ట రూరల్/హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పత్తి కొనుగోళ్లలో ఈ సంవత్సరం దేశంలోనే తెలంగాణ నెం.1 స్థానంలో కొనసాగుతోందని, రైతులకు ఇబ్బంది కలగకుండా గత ఏడాది కంటే ఎక్కువగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నల్లగొండ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం(దిశ)లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం అత్యధికంగా ధాన్యం, పత్తి ఉత్పత్తులు వచ్చినా రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కొనుగోళ్లు చేస్తున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలోనూ గత ఏడాది 141లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొంటే, ఈసారి 153లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, రైతులకు వెంట వెంటనే బిల్లులు కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలో 11 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్తగా పాలకవర్గాలు నియమించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. మరోవైపు.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన భూములను 'ధరణి' పేరిట బీఆర్ఎస్ నాయకులు గుంజుకున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో రూ.210 కోట్లతో చేపట్టనున్న మిషన్ భగీరథ పైలాన్ నిర్మాణానికి మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. మిషన్ భగీరథ పనులు పూర్తయితే భువనగిరి, ఆలేరు, జనగాం నియోజకవర్గాలోని 523 గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరో పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని, ఎమ్మెల్యేలు ఎప్పుడూ ప్రజల మధ్య ఉండాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో ఔషధాల వివరాలు: మంత్రి దామోదర

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల కోసం కొనుగోలు చేసే ఔషధాలు ఇండెంట్ దగ్గర్నుంచి, రోగులకు చేరే దాకా అందుకు సంబంధించిన పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న 22 సెంట్రల్ మెడిసిన్ స్టోర్ల పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఈ సెంటర్ల ఏర్పాటుతో, ప్రతి జిల్లాకు ఒక సీఎంఎస్ అందుబాటులోకి వస్తున్నదని అధికారులు మంత్రికి వివరించారు. సెంట్రల్ మెడికల్ స్టోర్లు, ప్రభుత్వ దవాఖానాల్లో ఫార్మసీల బలోపేతం, ఫుడ్‌సేఫ్టీ అంశాలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మెడిసిన్ ఇండెంట్ దగ్గర్నుంచి, అవి రోగులకు చేరే వరకూ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్‌ను మూడు దశలుగా విభజించి, ప్రతి దశకు ఒకరిని బాధ్యులుగా నియమించాలని సూచించారు. సీఎంఎస్ ఇన్, అవుట్ స్టాక్ వివరాలను కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో మందుల పంపిణీ వ్యవస్థకు డిప్యూటీ డీఎంహెచ్‌వోలను ఇంచార్జులుగా నియమించాలని ఆదేశించారు. ఫుడ్‌సేఫ్టీపై హైదరాబాద్ దేశంలోనే చిట్ట చివరన ఉందంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారంపై మంత్రి ఆరా తీశారు. కొంత మంది పనిగట్టుకుని 2022 నాటి డేటాతో ఇప్పుడు తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మంత్రికి వివరించారు. మంత్రి మాట్లాడుతూ ఫుడ్‌సేఫ్టీ విషయంలో తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అదానీతో ఒప్పందాలు రద్దు చేసుకోవాలి

- అదానీ అవినీతిపరుడు అని రాహుల్ అన్నారు.. అలాంటి వ్యక్తికే ఎర్రతివాచీలా? అదానీతో రేవంత్ నాలుగు గంటలు భేటీ
- అదానీ వస్తే చాయ్ తాగించి పంపాం
- మేము ఒప్పందాలు చేసుకోలేదు: కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అదానీ బండారం అంతర్జాతీయంగా బయటపడిన నేపథ్యంలో ఆ కంపెనీలతో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. అదానీ వ్యవహారం బయటపడిన తర్వాత కెన్యా లాంటి చిన్న దేశమే వ్యాపార ఒప్పందాలను రద్దు చేసుకున్నదని, తెలంగాణ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అదానీ అవినీతి పరుడని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అంటుంటే అదే వ్యక్తికి ఎర్ర తివాచీలు పరిచి వ్యాపారం ఎలా చేస్తారని సీఎం రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నిస్తున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీది ఢిల్లీలో ఒక మాట.. గల్లీలో మరో మాట అని విమర్శించారు. బడేభాయ్ ఆదేశించగానే చోటే భాయ్ అదానీకి స్వాగతం పలికి 12వేల 400 కోట్ల ఒప్పందాలు చేసుకున్నారన్నారు. తమ హయాంలో అదానీ తెలంగాణలో వ్యాపారం చేద్దామని వస్తే ఆయన చరిత్ర తెలుసు కాబట్టి చాయ్ తాగించి పోటో దిగి పంపామని చెప్పారు. అదానీతో ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదని పేర్కొన్నారు. యాదాద్రిలో సిమెంట్ ఫ్యాక్టరీ వద్దన్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయసేకరణ జరిపి అదానీకి సిమెంట్ ఫ్యాక్టరీ కట్టబెట్టారన్నారు. దీంతో అదానీ స్కిల్ యూనివర్సిటీకి వందకోట్లు విరాళం ఇచ్చారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంట్లో ఆయనతో అదానీ నాలుగు గంటలు సమావేశం అయ్యారని, అదానీ వ్యాపార విస్తరణ తెలంగాణలో ఇంత జరుగుతుంటే కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలియదా అని కేటీఆర్ ప్రశ్నించారు. కోహినూర్ హోటల్‌లో అదానీతో మంత్రి పొంగులేటి సమావేశంపైనా రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదానీ తన వ్యాపారాల విస్తరణకు లంచాలు ఇచ్చారన్న విషయాన్ని అమెరికన్ దర్యాప్తు సంస్థలు బహిర్గతం చేసిన క్రమంలో విద్యుత్ ఒప్పందాల కోసం లంచంగా తీసుకున్న వారు ఎవరైనా చర్యలు తీసకోవాల్సిందేనని కేటీఆర్ అన్నారు. ఏపీ మాజీ సీఎం జగన్ 1750




కోట్లు లంచం తీసుకున్నారని తేలిందిగా అని ప్రశ్నించగా.. జగనైనా, మరెవరైనా చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు.

అది సీఎం సోదరులు చేసిన హత్య

నాగర్‌కర్నూలు జిల్లా కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డిది ఆత్మహత్య కాదని, ముఖ్యమంత్రి సోదరులు చేసిన హత్య అని కేటీఆర్ ఆరోపించారు. ఆత్మహత్యకు ముందు సాయిరెడ్డి చాలా స్పష్టంగా సీఎం సోదరులు తనపై కక్ష కట్టడం వల్లే చనిపోతున్నానని సూసైడ్ నోట్‌లో రాశారని పేర్కొన్నారు. కాగా, కేసీఆర్ ప్రారంభించిన నీలి విప్లవం ఫలితాలు ఇప్పుడు కన్పిస్తున్నాయని కేటీఆర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. 2016-17లో లక్షా 93వేల టన్నుల చేపల పెంపకం నుంచి 2023-24లో 4.39 లక్షల టన్నులకు పెరిగిందని, చేపల పెంపకంలో తెలంగాణకు ఇన్ ల్యాండ్ స్టేట్ అవార్డు రావడం కేసీఆర్ విజయమన్నారు.

ది సబర్మతీ రిపోర్ట్.. సినిమాకు పన్ను మినహాయింపు ఇవ్వాలి

- కాంగ్రెస్ కుట్రలను బయటపెట్టిన చిత్రం ఇది: సంజయ్



హైదరాబాద్/పంజాగుట్ట/జహీరాబాద్/న్యూఢిల్లీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'ది సబర్మతి రిపోర్ట్' సినిమాకు రాష్ట్ర ప్రభుత్వం పన్ను మినహాయింపు ఇవ్వాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు. ఈ సినిమాకు ఉత్తర ప్రదేశ్‌లో ట్యాక్స్ మినహాయింపు ఇచ్చారని తెలిపారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని జీవీకే మాల్‌లో 'ది సబర్మతి రిపోర్ట్' సినిమాను సంజయ్ వీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "గోద్రా ఘటనలో కాంగ్రెస్ ఒక వర్గానికి మద్దతిచ్చింది. అయోధ్య నుండి వచ్చిన కరసేవకులను హతమార్చడం ద్వారా ఈ దేశంలో మత విద్వేషాలు సృష్టించి, రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్ చేసిన కుట్రను ఈ సినిమా ద్వారా బహిర్గతం చేశారు. కరసేవకుల హత్యకు చేసిన కుట్రనే గోద్రా ఘటన అని చెప్పినా.. కాంగ్రెస్ పార్టీ, ఒక సెక్షన్ మీడియా కావాలని ప్రజల దృష్టి మళ్లించింది. ఈ సినిమాతో వాస్తవాలు బయటకు వచ్చాయి" అని సంజయ్ పేర్కొన్నారు.

రేవంత్, అదానీ ఒప్పందాల సంగతేంటి..?: రఘునందన్ రావు

అమెరికాలో అదానీ కుంభకోణం వ్యవహారంలో జరిగిన నేరారోపణలో బీజేపీ కడిగిన ముత్యంలా బయట పడుతుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం జహీరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఆరోపణల్లో ఇరుక్కున్న ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ ముఖ్యమంత్రులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో రాహుల్ గాంధీ చెప్పాలని సవాల్ విసిరారు. కుంభకోణంలో ప్రధాని మోదీకి సంబంధం లేదని, రాహుల్ గాంధీ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్, అదానీ చేసుకున్న ఒప్పందాల సంగతేంటని ప్రశ్నించారు.

రాష్ట్రపతికి పుస్తకం అందజేసిన విద్యాసాగర్‌రావు

'తెలంగాణ ప్రాంత గిరిజనుల సమస్యలు-చట్టపరమైన పరిష్కారం'పై తాను రచించిన పుస్తకాన్ని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేశారు. శుక్రవారం రాజ్‌భవన్‌లో రాష్ట్రపతిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

నరేందర్‌రెడ్డి కస్టడీ పిటిషన్‌పై నిర్ణయం వాయిదా

వికారాబాద్, హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో అధికారులపై దాడి చేసిన ఘటనలో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై కొడంగల్ కోర్టు తన తీర్పును మరోసారి వాయిదా వేసింది. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై ఈనెల 20న కొడంగల్ కోర్టులో విచారణ పూర్తయింది. హైకోర్టులో నరేందర్‌రెడ్డి తరఫున దాఖలు చేసిన పిటిషన్లపై ఇంకా తుది నిర్ణయం రాకపోవడంతో కొడంగల్ కోర్టు కూడా కస్టడీ పిటిషన్‌పై తీర్పును ఈనెల 25వ తేదీకి వాయిదా వేసింది. కాగా, లగచర్ల ఘటనలో ఒకే నేరానికి సంబంధించి అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంపై పోలీసులను హైకోర్టు వివరణ కోరింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

నీట్, జేఈఈ సాధనకు 'కోటా' బుక్‌లెట్స్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నీట్ (యూజీ), జేఈఈ-2025 పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం 'కోటా' టెస్ట్ సిరీస్, గ్రాండ్ టెస్ట్ అండ్ సొల్యూషన్స్ డిజిటల్ బుక్‌లెట్స్‌ను సిద్ధం చేసినట్లు 'కోటా పేజెస్' సంస్థ తెలిపింది. విద్యార్థి సమర్థతను పరీక్షించేందుకు ఇవి ఉపయోగపడతాయని పేర్కొంది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ బయాలజీ పార్ట్ టెస్ట్, ఫుల్ టెస్ట్‌ల డిజిటల్ మొబైల్ వెర్షన్‌ను వాట్సాప్ ద్వారా పొందవచ్చని, మరింత సమాచారం కోసం NEET 2025, JEE 2025 అని 98490-16661 నంబరుకు వాట్సాప్ మెసేజ్ చేయాలని కోటా పేజెస్ సూచించింది.

ఆరుగురు కళాకారులకు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాలు

న్యూఢిల్లీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆరుగురు యువకళాకారులకు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారాలు దక్కాయి. శుక్రవారంనాడిక్కడ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో 2022, 2023 సంవత్సరాలకుగాను 82 మంది యువ కళాకారులకు ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి అరుణిష్ చావ్లా ఈ పురస్కారాలను అందజేశారు. 2023కుగాను జానపద సంగీత విభాగంలో తెలంగాణకు చెందిన డప్పు కళాకారుడు అంగడి భాస్కర్‌తోపాటు సంగీత విభాగంలో సత్యవతి ముదావత్ (సృజనాత్మక, ప్రయోగాత్మక సంగీతం), నృత్య విభాగంలో మురమళ్ల సురేంద్రనాథ్(కూచిపూడి), థియేటర్ విభాగంలో బి.మల్లికార్జునరావుకు బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాలు లభించాయి. 2022కుగాను సంగీతంలో ఐ.శ్వేత ప్రసాద్(కర్ణాటక సంగీతం), నృత్య విభాగంలో టి.రెడ్డిలక్ష్మి (కూచిపూడి) బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాలు అందుకున్నారు.

ఏపీ ప్రతిష్ఠకు జగన్ ముడుపుల మసక!

- ఎవరు తప్పుచేసినా వదిలిపెట్టేది లేదు
- 'అదానీ-జగన్' వ్యవహారంపై సీఎం వెల్లడి

అమరావతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముడుపుల మసకతో వైఎస్ జగన్ రాష్ట్ర ప్రతిష్ఠను మంటగలిపారని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. ఎవరు తప్పుచేసినా వదిలే ప్రసక్తి లేదన్నారు. వదిలేస్తే మరొకరు తప్పు చేసే పరిస్థితి వస్తుందని తెలిపారు. 'జగన్-అదానీ... లంచాల కహానీ'పై చంద్రబాబు స్పందించారు. సౌర విద్యుత్ టెండర్ల వ్యవహారంలో గత జగన్ ప్రభుత్వానికి రూ.1,750 కోట్ల మేర ముడుపులు అందాయని అమెరికా కోర్టులో అక్కడి ప్రభుత్వ సంస్థలు చార్జిషీటు దాఖలు చేసిన నేపథ్యంలో జగన్‌ను ఇక్కడ ప్రాసిక్యూట్ చేస్తారా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా... "అన్ని కోణాల నుంచీ పరిశీలిస్తున్నాం. ఏం చేయగలమన్నదానిపై న్యాయ నిపుణుల సలహా తీసుకుంటున్నాం. మన పరిధి ఎంతవరకూ ఉంది.. చట్టపరంగా ఏం చేయగలమో.. నిపుణుల అభిప్రాయం తెలుసుకున్నాక నిర్ణయానికి వస్తాం' అని చంద్రబాబు బదులిచ్చారు. అదే సమయంలో తప్పు చేసింది ఎవరైనా వదిలేది లేదని స్పష్టం చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో సెకీతో కుదుర్చుకున్న ఒప్పందాలు రాష్ట్రానికి భారంగా మారే ప్రమాదముందని వార్తలు వస్తున్న నేపథ్యంలో వాటిని రద్దు చేస్తారా అన్న ప్రశ్నకు.. ఆయన ఆచితూచి స్పందించారు. 'పెట్టుబడులు పెట్టేవారి విశ్వాసం దెబ్బ తినకుండా.. అదే సమయంలో ప్రజల కోణంలో కూడా ఆలోచించి నిర్ణయానికి వస్తాం.' అని తెలిపారు.

కాంగ్రెస్ నేతల ఆదేశాలతోనే మహబూబాబాద్‌లో మహాధర్నాకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని బీఆర్ఎస్ ఆరోపించింది. మహాధర్నాకు అనుమతినిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించింది.

'అనర్హత'పై తగిన సమయంలో తీర్పు ఇవ్వండి



(మొదటిపేజీ తరువాయి)

అనర్హత పిటిషన్ల విచారణ షెడ్యూల్ ఇవ్వాలని, ఎలాంటి చర్యలు తీసుకోకపోతే సుమోటోగా కేసు రీ ఓపెన్ చేస్తామంటూ సెప్టెంబరు 9న తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి హైకోర్టు డివిజన్ బెంచ్‌లో మూడు అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది.

ఇప్పటికే నాలుగున్నర నెలలు గడిచిపోయాయి

అసెంబ్లీ కార్యదర్శి తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది రవీంద్ర శ్రీవాస్తవ, పార్టీ మారిన ఎమ్మెల్యేల తరఫున సీనియర్ న్యాయవాదులు పి.శ్రీరఘురాం, రవిశంకర్ జంధ్యాల, మయూర్‌రెడ్డి, దేశాయి ప్రకాశ్‌రెడ్డి వాదించారు. 'స్పీకర్ తుది నిర్ణయం తీసుకోకముందు న్యాయసమీక్షకు అవకాశం లేదు. స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని పేర్కొంటున్న కైశం మేఘాచంద్రసింగ్ ' సుప్రీంకోర్టు తీర్పు ఆ కేసుకు మాత్రమే పరిమితం. ఇటీవల మహారాష్ట్ర వ్యవహారంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన 'సుభాష్ దేశాయి' కేసులో మూడు నెలలని ఎక్కడా చెప్పలేదు. స్పీకర్ అధికారాలపై న్యాయసమీక్షకు తొలిసారి అవకాశం కల్పించిన 'కిహోటో హోలోహాన్' తీర్పు సైతం స్పీకర్ తుది తీర్పు ఇచ్చిన తర్వాతే కోర్టులు జోక్యం చేసుకోవాలని స్పష్టంచేసింది. స్పీకర్ అధికారాల్లో జోక్యం చేసుకోలేమని ఈ హైకోర్టు డివిజన్ బెంచ్ గతంలో తీర్పు ఇచ్చింది. కాబట్టి సింగిల్ జడ్జి తీర్పు కొట్టేయండి' అని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేల తరఫున సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, జె.ప్రభాకర్ వాదించారు. 'స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోక ముందు.. తీసుకున్న తర్వాత న్యాయసమీక్షకు అవకాశం ఉంది. ప్రజాతీర్పునకు వ్యతిరేకంగా జరిగే పార్టీ ఫిరాయింపులను నిరోధించాలనే సదుద్దేశంతో 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పదో షెడ్యూల్‌ను చేర్చారు. దాని ప్రకారం స్పీకర్‌కు విస్తృత అధికారాలు కట్టబెట్టారు. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాల్సిన స్పీకర్ అసలు ఆ పిటిషన్లను స్వీకరించకపోవడం అంటే పదో షెడ్యూల్ ఉద్దేశం ఓడిపోయినట్లే. అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. నాలుగు వారాల్లో షెడ్యూల్ ఇవ్వాలని మాత్రమే సింగిల్ జడ్జి చెప్పారు. తుది నిర్ణయం తీసుకోమని చెప్పలేదు. నిర్ణయం తీసుకోవాల్సిన స్పీకర్ తరఫున అసెంబ్లీ కార్యదర్శి అప్పీళ్లు దాఖలు చేయడం చెల్లదు. ఈ అప్పీళ్లు విచారణార్హం కాదు. స్పీకర్ స్పందించకపోవడం అంటే రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లే' అని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. కోర్టు అనుసరించాల్సిన, కట్టుబడాల్సిన పలు న్యాయసూత్రాలు, సుప్రీంకోర్టు తీర్పులపై చర్చించింది. స్పీకర్ అధికారాలపై సమయానుసారంగా సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులను విస్తృతంగా పరిశీలించింది. అనర్హత పిటిషన్లను తప్పకుండా రీజనబుల్ టైంలో స్పీకర్ పరిష్కరించాలని సుప్రీంకోర్టు తెలిపిందని పేర్కొంది. గతంలో ఈ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన 'ఎర్రబెల్లి దయాకర్‌రావు' తీర్పు కంటే ఆ తర్వాత సుప్రీంకోర్టు ఇచ్చిన 'సుభాష్ దేశాయి' తీర్పే శిరోధార్యమని ప్రకటించింది. 'రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను పరిష్కరించాల్సింది స్పీకరే. స్పీకర్ అంటే అత్యున్నత రాజ్యాంగబద్ధమైన పదవి. చట్టబద్ధమైన పాలనలో ఉన్న మన సమాజంలో రాజ్యాంగమే సుప్రీం అని గుర్తుంచుకోవాలి. స్పీకర్ తీసుకునే నిర్ణయాలపై న్యాయసమీక్ష ఉంటుంది. స్పీకర్ రీజనబుల్ టైంలో నిర్ణయం తీసుకోవాలి. రిజనబుల్ టైం అనేది ఆయా ప్రత్యేక కేసుల్లోని వాస్తవాలు, పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత కేసులో అనర్హత పిటిషన్లు ఈ ఏడాది జూలై 1న దాఖలయ్యాయి. ఇప్పటికే నాలుగున్నర నెలలు గడిచిపోయాయి. ఈ నేపథ్యంలో స్పీకర్ నిబంధనల ప్రకారం వ్యవహరించాలి' అని హైకోర్టు డివిజన్ బెంచ్ పేర్కొంది. నాలుగు వారాల్లో షెడ్యూల్ ఇవ్వాలన్న సింగిల్ జడ్జి తీర్పును కొట్టివేస్తూ తుది తీర్పు వెలువరించింది.

సుప్రీంకోర్టుకు వెళ్తాం..

హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని బీఆర్ఎస్ పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై న్యాయ నిపుణుల సలహాలు తీసుకోనున్నట్లు వెల్లడించాయి. నిపుణులతో సంప్రదింపుల అనంతరం ఈ తీర్పుపై సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పేర్కొన్నాయి.

ఆ లంచం ఖరీదు 72వేల కోట్లు!

(మొదటిపేజీ తరువాయి)

మార్కెట్‌లో భారీ ధరకు విద్యుత్ కొనుగోలు చేశారు. ఆ భారం రూ.42వేల కోట్లు! ట్రూ అప్ చార్జీల రూపంలో దాన్నీ ఏపీ ప్రజల నెత్తినే వేశారు. రైతాంగానికి పగటిపూట తొమ్మిది గంటల ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలు చేసేందుకు వీలుగా సోలార్ విద్యుత్తు సేకరించేందుకు 2021లో ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీజీఈసీఎల్) పిలిచిన 10 వేల మెగావాట్ల టెండర్లను కేవలం అదానీకి తలుపులు తెరవడం కోసం జగన్ సర్కారు రద్దు చేసింది! ఆ పని చేయకుండా ఉండి ఉంటే.. సోలార్ విద్యుదుత్పత్తి సంస్థలు వెంటనే విద్యుత్ సరఫరా చేసేవి. దీనివల్ల మార్కెట్‌లో అధిక ధరలకు విద్యుత్ కొనాల్సిన అవసరం ఉండేది కాదు. జనం నడ్డివిరిగేలా తొమ్మిదిసార్లు ట్రూఅప్ చార్జీల భారం కూడా వేయాల్సిన అవసరం వచ్చేదికాదు. ఇలా అదానీకి మేలు చేయడానికి నాడు జగన్ ప్రభుత్వం అన్ని విధాలా ప్రజలపై భారం మోపింది. 2021లో దేశీయంగా సోలార్ విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.2.92గా ఉంది. ఏపీజీఈసీఎల్ పిలిచిన టెండర్‌కు స్పందిస్తూ సోలార్ విద్యుదుత్పత్తి సంస్థలు యూనిట్‌ను రూ.2.49కు ఇస్తామనడం అప్పట్లో జాతీయ స్థాయిలో బెంచ్ మార్క్‌గా మారింది. నాడు జగన్ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు చేసుకునేది. అయితే జగన్ ప్రభుత్వం అలా చేయలేదు. అదానీకి దోచిపెట్టడానికి స్కెచ్ వేసి ఆ టెండర్లను రద్దు చేసింది!!

2021లో జగన్‌తో అదానీ భేటీ తర్వాత...

సెకీతో విద్యుత్తు ఒప్పందాన్ని చేసుకున్న అదానీ, అజూర్ సంస్థలు 2021లో జగన్మోహన్ రెడ్డిని కలిశాయి. తాము 9,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించాయి. యూనిట్ ధరను రూ.2.92గా పేర్కొన్నాయి. అయితే.. అప్పటికే గుజరాత్ సెకీ నుంచి యూనిట్ సోలార్ విద్యుత్తును రూ.1.99కే తీసుకుంటోంది. అదే సమయంలో ఏపీజీఈసీఎల్ పిలిచిన టెండర్లకు బిడ్డర్లు యూనిట్ విద్యుత్తును రూ.2.49కే ఇస్తామంటూ ముందుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో అదానీ, అజూర్ నుంచి అంతే కంటే ఎక్కువ ధరకు యూనిట్‌ను రూ.2.92కు కొనుగోలు చేయడం అసాధ్యంగా మారింది. అదే సమయంలో జగన్‌తో అదానీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలపై సంప్రదింపులు జరిపారు. సోలార్ విద్యుత్తును యూనిట్‌ను రూ.2.31.. సెకీకి ఏడు శాతం కమీషన్ 17 పైసలు... మొత్తంగా యూనిట్‌ను రూ.2.49కే ఇచ్చేందుకు ముఖ్యమంత్రి నివాసంలో ఒప్పందం కుదిరింది. అయితే... మరి సమస్యేముందనుకుంటున్నారా! చాలా ఉంది. ఎక్కడో రాజస్థాన్‌లో ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్తును ఏపీకి సరఫరా చేసేందుకు ట్రాన్స్‌మిషన్ చార్జీల కింద యూనిట్‌కు 80 పైసలు అదనంగా పడుతుంది. ఆ మొత్తం విలువ 30,600 కోట్లు. మరోవైపు... అదే ఏడాది సెకీ నుంచి గుజరాత్ సర్కారు యూనిట్ రూ.1.99కే కొంటున్నా జగన్ పట్టించుకోలేదు. 50 పైసలు అదనంగా ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. కాంట్రాక్టు విలువ రూ.100 కోట్లను మించితే రివర్స్ టెండరింగ్‌కు వెళ్లాలన్నది జగన్ ప్రభుత్వ విధానం. కానీ, 25 ఏళ్ల కాలానికి 7000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును యూనిట్ ధర రూ.2.49 చొప్పున కొనుగోలు చేసేలా ఒప్పందం చేసుకుంది. దీని విలువ రూ.95,429 కోట్లు! దీనిపై జగన్ సర్కారు రివర్స్ టెండరింగ్‌కు వెళ్లలేదు. రివర్స్ టెండరింగ్‌కు వెళ్లినా... సంప్రదింపులు జరిపి బేరమాడినా... అప్పటికే గుజరాత్‌కు యూనిట్‌ను రూ.1.99 ధరకు ఇస్తున్నందున ఆ స్థాయిలో ధరను తగ్గించేదని విద్యుత్తు రంగ నిపుణులు చెబుతున్నారు. రివర్స్ టెండరింగ్‌కు వెళ్లకుండా, ధర తగ్గించకుండా ఉండేందుకే జగన్‌తో అదానీ సంప్రదింపులు జరిపారని అంటున్నారు. కొవిడ్ ఉధృతంగా ఉన్న సమయంలో 2021 డిసెంబరు ఒకటో తేదీన విజయవాడలో రాష్ట్ర ఇంధన శాఖ, డిస్కమ్‌లతో పాటు సెకీ, కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ, ఏపీ రూరల్ అగ్రికల్చర్ పవర్ సప్లయ్ కార్పొరేషన్ (ఏపీజీఈసీఎల్ పేరు మార్చారు) 7,000 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నాయి.

ఈఆర్‌సీ ప్రస్తావనతో...

'మేం సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాం. అదానీతో కాదు. ఇంకా లంచాల ప్రస్తావన ఎక్కడిది?' అని వైసీపీ పెద్దలు ప్రశ్నిస్తున్నారు. కానీ... అసలు డ్రామా అక్కడే ఉంది. సెకీ విక్రయించేది అదానీ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసే విద్యుత్తునే! అంటే... డిస్కమ్‌లు కొనేది అదానీ కరెంటునే! అంతా పారదర్శకంగా జరుగుతోందని చెప్పేందుకు 'సెకీ'ని వాడుకున్నారని అమెరికా దర్యాప్తు సంస్థలు కూడా తెలిపాయి. మరోవైపు... అదానీ, అజూర్ సంస్థలతో సెకీ విద్యుత్తు కొనుగోలు ఒప్పందాన్ని చేసుకుందంటూ ఈ పీపీఏలను ఆమోదిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఏపీఈఆర్‌సీ స్పష్టంగా చెప్పింది. అయినప్పటికీ... సెకీతో రాష్ట్ర ప్రభుత్వ ఇంధన సంస్థలు విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు చేసుకుంటే అదానీ ప్రస్తావన ఎందుకు వస్తుందంటూ జగన్ అమాయకంగా ప్రశ్నిస్తున్నారు.

పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వరా?

- రైతులను ఆదుకోవడంలో సర్కార్ విఫలం
- మద్యం విక్రయాలపై ఉన్న శ్రద్ధ రైతు సంక్షేమంపై లేదెందుకు?
- అదానీ నుంచి రేవంత్ పుచ్చుకున్నదెంత?: హరీశ్ రావు

ఖమ్మం/చింతకాని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో పత్తి, మిర్చి, ధాన్యం రైతుకు గిట్టుబాటు ధర కల్పనలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తే, ఇప్పుడు ఆధరలో సగం ధర కూడా రావడంలేదని విమర్శించారు. మద్యం అమ్మకాలు తగ్గితే సమీక్ష నిర్వహించి ఎక్సైజ్ అధికారులకు నోటీసులు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర తగ్గుతున్నా సమీక్ష నిర్వహించేందుకు శ్రద్ధ చూపడంలేదని ఆరోపించారు. శుక్రవారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తదితరులతో కలిసి హరీశ్ రావు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. అనంతరం చింతకాని మండలం పొద్దుటూరు, లచ్చగూడెం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన రైతు కుటుంబాలను, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, రైతులకు పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ధాన్యాన్ని కూడా సక్రమంగా కొనడంలేదని, సీసీఐ కూడా దళారుల వద్దే పత్తి కొనడం తప్ప రైతుల వద్ద కొనడం లేదని ఆరోపించారు. మద్దతు ధర ఇవ్వకపోవడంతో పత్తి రైతులు క్వింటాకు వెయ్యినుంచి రూ.1100 నష్టపోతున్నారని తెలిపారు. మిర్చి పంటకు గత ఏడాది క్వింటాకు రూ.23వేల వరకు ధర లభిస్తే ఇప్పుడు రూ.11వేల వరకే సగానికి సగం పడిపోయిందని పేర్కొన్నారు.

అప్పుడు అదానీని రానివ్వలేదు

అదానీని అరెస్టు చేయాలని రాహుల్‌గాంధీ చెబుతుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి అదానీకి కాంట్రాక్టులు ఇస్తూ ఒప్పందాలు చేసుకుంటున్నారని హరీశ్ రావు ఆరోపించారు. రూ.100 కోట్ల చెక్ అదానీ నుంచి తీసుకున్నారన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో అదానీని తెలంగాణలో అడుగు పెట్టనీయలేదని చెప్పారు. అదానీ నుంచి రేవంత్‌రెడ్డి ఎంత పుచ్చుకున్నారన్న దానిపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కొత్తగా పెళ్లైన ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని చెప్పి.. ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డలకు 6 లక్షల తులాల బంగారం బాకీ పడిందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు తప్పుడు కేసులుపెడితే సహించేదిలేదని ఆయన అన్నారు.

సర్వే వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కితే ప్రజల పరిస్థితేమిటి?

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజల బతుకు వివరాలు బట్టబయలు చేయడమే ప్రభుత్వ సర్వే లక్ష్యమా అని మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. నాడు ప్రజాపాలన దరఖాస్తులు నడిరోడ్డున పడ్డాయని, ఇప్పుడు మళ్లీ ఇంటింటి కుటుంబ సర్వే పత్రాలు నడిరోడ్డుపై పడ్డాయన్నారు. ప్రజల వివరాల సేకరణ పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది మరో నిదర్శనమన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో వచ్చిన వివరాల భద్రత డొల్ల అని స్పష్టమవుతుందని విమర్శించారు. సైబర్ నేరగాళ్ల చేతికి ఈ వివరాలు చిక్కితే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సర్వే పత్రాలు రోడ్డుపై పడిన ఘటన పట్ల ప్రభుత్వం సీరియస్‌గా స్పందించాలని, ప్రజల వివరాలకు భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మార్కెట్లో కొనుగోళ్ల జాతర

స్టాక్ సూచీలు రయ్ రయ్.. సెన్సెక్స్ ఒక దశలో 2,062 పాయింట్లు అప్

- చివరికి 1,961 పాయింట్ల లాభంతో 79,000 ఎగువన ముగిసిన సూచీ
- 557 పాయింట్ల వృద్ధితో 23,900కి నిఫ్టీ
- గడిచిన 5 నెలల్లో సూచీలకిదే అతిపెద్ద లాభం
- రూ.7.32 లక్షల కోట్లు పెరిగిన సంపద



ముంబై: ఏడు వారాలుగా బేర్ బిగిపట్టుతో ఉక్కిరిబిక్కిరైన స్టాక్ మార్కెట్‌కు భారీ ఊరట లభించింది. మెరుపు వేగంతో దూసుకొచ్చిన బుల్ రంకెల శబ్దం విని బేర్ తుర్రుమంది. దాంతో ట్రేడర్లూ దలాల్ స్ట్రీట్‌లోకి మళ్లీ పరుగెత్తుకొచ్చారు. అదానీ లంచం కేసు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ భయాలను సైతం పక్కన పెట్టి అమితోత్సాహంతో కొనుగోళ్లు జరుపడంతో ప్రామాణిక సూచీలు రివ్వున ఎగిశాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 2,062.4 పాయింట్లు పెరిగి 79,218.19 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 1,961.32 పాయింట్ల (2.54 శాతం) లాభంతో 79,117.11 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 557.35 పాయింట్ల (2.39 శాతం) వృద్ధితో 23,907.25 వద్ద ముగిసింది. గడిచిన ఐదు నెలల్లో సూచీలకిదే అతిపెద్ద ఒక్క రోజు లాభం. కొనుగోళ్ల జోరుతో స్టాక్ మార్కెట్ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.7.32 లక్షల కోట్లకు పైగా పెరిగి 432.71 లక్షల కోట్లకు (5.12 లక్షల కోట్లు) చేరుకుంది. మరిన్ని ముఖ్యాంశాలు..

● సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లూ రాణించాయి. ఎస్‌బీఐ 4.51 శాతం, టీసీఎస్ 4.13 శాతం, టైటాన్ 4.10 శాతం లాభంతో సూచీ టాప్ గెయినర్లుగా నిలిచాయి. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.49 శాతం ఎగబాకగా.. ఇన్ఫోసిస్, ఐటీసీ, ఎల్ అండ్ టీ, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్, హెచ్‌సీఎల్ టెక్, షేర్లూ 3 శాతానికి పైగా పుంజుకున్నాయి.

● క్రితం సెషన్‌లో ఆల్‌టైం రికార్డు స్థాయికి పతనమైన రూపాయి కాస్త తేరుకుంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు పెరిగి రూ.84.41 వద్ద ముగిసింది.

1,00,000 డాలర్లకు చేరువలో బిట్‌కాయిన్

ప్రముఖ క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ విలువ వాయు వేగంతో దూసుకెళ్తోంది. తాజాగా ఈ వర్చువల్ కరెన్సీ 1,00,000 డాలర్లకు చేరువైంది. బిట్‌కాయిన్ విలువ ఒకదశలో 99,525 డాలర్లు పలికింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించడంతో క్రిప్టో మార్కెట్లో మళ్లీ సందడి మొదలైంది. గడిచిన రెండు వారాల్లో బిట్‌కాయిన్ విలువ ఏకంగా 40 శాతం పెరిగింది. ఎందుకంటే, అమెరికాను క్రిప్టోల రాజధానిగా తీర్చిదిద్దుతానని, బిట్‌కాయిన్‌ల వ్యూహాత్మక నిల్వలను ఏర్పాటు చేస్తానని ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్ ప్రకటించారు. అంతేకాదు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు అవసరమైన విరాళాలను క్రిప్టోల్లోనూ స్వీకరించారు.

మిశ్రమంగా ముగిసిన అదానీ షేర్లు

గౌతమ్ అదానీ సహా ఏడుగురిపై అమెరికాలో లంచం కేసు నమోదైన నేపథ్యంలో గురువారం కుప్పకూలిన అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు వారాంతం ట్రేడింగ్‌లో మాత్రం మిశ్రమంగా ముగిశాయి. అదానీ గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2.16 శాతం, అదానీ పోర్ట్స్ 2.05 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 1.18 శాతం, అంబుజా సిమెంట్స్ 3.50 శాతం, ఏసీసీ 3.17 శాతం, ఎన్‌డీటీవీ 0.65 శాతం పెరిగాయి. కాగా, అదానీ గ్రీన్ ఎనర్జీ మరో 8.20 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 6.92 శాతం, అదానీ పవర్ 3.23 శాతం, అదానీ విల్మర్ 0.73 శాతం క్షీణించాయి.

మార్కెట్ ర్యాలీకి కారణాలివే..

● మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ సర్వేలు బీజేపీ విజయ సంకేతాలివ్వడం మార్కెట్ వర్గాల్లో జోష్ పెంచింది.

● ఇప్పటికే ప్రామాణిక సూచీలు 10 శాతానికి పైగా క్షీణించిన నేపథ్యంలో ఆకర్షణీయ ధరల్లో లభిస్తున్న నాణ్యమైన స్టాక్స్‌లో ఇన్వెస్టర్లు వాల్యూ బైయింగ్‌కు పాల్పడ్డారు. పీఎస్‌యూ బ్యాంకింగ్ సహా పలు రంగ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరిగాయి.

● జపాన్‌లో అక్టోబరు నెలకు ద్రవ్యోల్బణం తగ్గడంతో పాటు ఆ దేశం 39 లక్షల కోట్ల యెన్‌ల ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించడం వంటి అంతర్జాతీయ సానుకూల సంకేతాలు సైతం కలిసివచ్చాయి.

● అమెరికాలో నిరుద్యోగిత రేటు 7 నెలల కనిష్ఠానికి తగ్గిన నేపథ్యంలో అక్కడి మార్కెట్ మళ్లీ పుంజుకుంటోందన్న అంచనాల నేపథ్యంలో ఐటీ రంగ షేర్లకు డిమాండ్ ఊపందుకుంది.

● విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల అమ్మకాల తీవ్రత తగ్గుముఖం పట్టడం. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో నిరాశపర్చిన కార్పొరేట్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు.. మూడు, నాలుగు త్రైమాసికాల్లో మళ్లీ మెరుగుపడవచ్చన్న అంచనాలూ ట్రేడింగ్ సెంటిమెంట్‌ను పెంచాయి.

సెన్సెక్స్‌లోకి జొమాటో

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ సేవలందించే జొమాటో షేరు వచ్చే నెల 23 నుంచి బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్‌లో భాగం కానుంది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ స్థానాన్ని జొమాటో భర్తీ చేయనుంది. సూచీలోని షేర్ల తాజా పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఈ సర్దుబాటు జరిగింది.

టెలికాం రంగానికి సైబర్ సెక్యూరిటీ నిబంధనలు జారీ

న్యూఢిల్లీ: భారత కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, సర్వీసులను సంరక్షించే లక్ష్యంతో ప్రభుత్వం కొత్త టెలికాం చట్టం కింద టెలికాం సైబర్ సెక్యూరిటీ నిబంధనలు నోటిఫై చేసింది. తమ నెట్‌వర్క్‌పై భద్రతాపరమైన సంఘటనలు సంభవిస్తే వాటిని వెల్లడించడానికి నిర్దిష్ట కాలపరిమితిని ప్రభుత్వం నిర్దేశించింది. కేంద్ర ప్రభుత్వం లేదా దాని అధీకృత సంస్థ టెలికాం సంస్థల నుంచి ట్రాఫిక్ డేటా, ఇతర డేటా సేకరించడానికి అధికారాలు ఈ నిబంధనల ద్వారా సంక్రమిస్తాయి. సెక్యూరిటీ రక్షణలు, రిస్క్ మేనేజ్‌మెంట్ చర్యలు, కార్యాచరణలు, శిక్షణ, నెట్‌వర్క్ టెస్టింగ్, రిస్క్ అసెస్‌మెంట్ సహా సైబర్ సెక్యూరిటీ విధానంలోని పలు అంశాలను టెలికాం సంస్థలు అమలుపరచాల్సి ఉంటుంది. ప్రతి టెలికాం కంపెనీ వీటి కింద నిర్దిష్ట చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఎయిరిండియాలో మెయింటెనెన్స్ శిక్షణా సంస్థ

ముంబై: ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ (ఏఎంఈ) గ్రాడ్యుయేట్లకు విమాన మెయింటెనెన్స్‌లో శిక్షణ ఇచ్చేందుకు ప్రాథమిక మెయింటెనెన్స్ శిక్షణా సంస్థ (బీటీఎంఓ) ఏర్పాటు చేయనున్నట్టు ఎయిరిండియా తెలిపింది. 2026 మధ్య కాలం నుంచి ఇది అమల్లోకి వస్తుంది. బెంగళూరులోని ఎంఆర్‌ఓ కేంద్రానికి చేరువలోనే బీటీఎంఓ ఏర్పాటవుతుంది. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ అనుబంధ సంస్థ బెంగళూరు ఎయిర్‌పోర్ట్ సిటీ లిమిటెడ్‌తో (బీఏసీఎల్) ఈ మేరకు ఎయిరిండియా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రోగ్రామ్ కాలపరిమితి రెండు సంవత్సరాలు. కాగా మరో రెండు సంవత్సరాలు ఎంఆర్‌ఓలో శిక్షణ ఇస్తారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,820 ▲	72,250 ▲	1,01,000 ▲
ముంబై	77,787 ▲	71,253 ▲	90,850 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	585
వరంగల్	572	గోదావరి	585
చిత్తూరు	593	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	108
వరంగల్	107	గుంటూరు	103
కరీంనగర్	107	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	87
కర్నూలు	107	నెల్లూరు	87
విశాఖపట్నం	120	అనంతపురం	87
గోదావరి	108		

వెండి ఈటీఎఫ్‌ల్లోకి నిధుల వరద

ఏడాది కాలంలో నాలుగింతలైన పెట్టుబడులు

సిల్వర్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్)కు ఈ మధ్య కాలంలో ఆదరణ భారీగా పెరిగింది. ఈ అక్టోబరుతో ముగిసిన ఏడాది కాలంలో సిల్వర్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) మొత్తం విలువ నాలుగింతల వృద్ధితో రూ.12,331 కోట్లకు చేరుకుంది. ధరాఘాతం, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు బంగారంతోపాటు వెండినీ భద్రమైన పెట్టుబడి సాధనంగా భావిస్తుండటం ఇందుకు ప్రధాన కారణమని ఇక్రా అనలిటిక్స్ పేర్కొంది. 2022లో ప్రారంభమైన సిల్వర్ ఈటీఎఫ్‌లపై రిటైల్ ఇన్వెస్టర్ల ఆసక్తి పెరుగుతూ వస్తోందని ఇక్రా అంటోంది. 2023 అక్టోబరులో స్విలర్ ఈటీఎఫ్‌లో పెట్టుబడులు కలిగిన ఇన్వెస్టర్ల సంఖ్య 1.42 లక్షలుగా ఉండగా.. ఏడాది కాలంలో 215 శాతం పెరిగి ఈ అక్టోబరు నాటికి 4.47 లక్షలకు చేరుకుంది. ఇదే కాలంలో నికర పెట్టుబడులు కూడా 24 శాతం వృద్ధితో రూ.643.10 కోట్లకు పెరిగాయని ఇక్రా వెల్లడించింది.

మళ్లీ రూ.80,000 పైకి బంగారం

దేశీయంగా బంగారం, వెండి ధరలు మరింత ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,100 పెరిగి రూ.80,400కు చేరుకుంది. కిలో వెండి రూ.300 పెరుగుదలతో రూ.93,300 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో వీటి రేట్లు పెరగడంతో పాటు రూపాయి మారకం విలువ పతనం ఇందుకు కారణం. రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతల పెరిగిన నేపథ్యంలో అనిశ్చితిలో భద్రమైన పెట్టుబడి సాధనమైన బులియన్‌కు డిమాండ్ మళ్లీ పెరిగింది.

4 నెలల కనిష్ఠానికి ఫారెక్స్ నిల్వలు

భారత్ వద్దనున్న విదేశీ మారకం నిల్వలు భారీగా క్షీణించి 4 నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. ఈనెల 15తో ముగిసిన వారంలో విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు ఏకంగా 1,776.1 కోట్ల డాలర్ల తగ్గుదలతో 65,789.2 కోట్ల డాలర్లకు పడిపోయాయని ఆర్‌బీఐ వెల్లడించింది. సెప్టెంబరు చివర్లో నిల్వలు ఆల్‌టైం రికార్డు స్థాయి 70,488.5 కోట్ల డాలర్లకు పెరిగాయి. కానీ, ఆ తర్వాత వరుసగా 7 వారాలుగా తగ్గుతూ వచ్చాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతుండటం, రూపాయి మారకం విలువ క్షీణత వంటి అంశాలు ఇందుకు కారణం.

ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తికి రూ.42,500 కోట్ల ప్రోత్సాహకాలు

న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ల నుంచి లాప్‌టాప్స్ వరకు వివిధ రకాలైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు అవసరమైన విడి భాగాలు దేశంలోనే తయారుచేసే కంపెనీలకు ప్రభుత్వం 500 కోట్ల డాలర్ల (రూ.42,500 కోట్లు) ప్రోత్సాహకాలు అందించనున్నట్టు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఇద్దరు అధికారులు తెలిపారు. మంచి వృద్ధి అవకాశాలున్న పరిశ్రమను ప్రోత్సహించడంతో పాటు చైనా దిగుమతులకు అడ్డుకట్ట వేయడం దీని లక్ష్యం. యాపిల్, సామ్‌సంగ్ వంటి ప్రపంచ శ్రేణి సంస్థలు అందించిన మద్దతు కారణంగా గత ఆరు సంవత్సరాల కాలంలో దేశంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రెట్టింపై ఇప్పుడు 11,500 కోట్ల డాలర్లకు (రూ.9.77 లక్షల కోట్లు) చేరింది. స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తిలో భారత్ ఇప్పుడు ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉంది. అయితే ఆ రంగం విడిభాగాల కోసం చైనా దిగుమతుల పైనే అధికంగా ఆధారపడి ఉందన్న విమర్శలు ఎదుర్కొంటోంది. కాగా కొత్త పథకం కింద ఇవ్వనున్న ప్రోత్సాహకాలను రెండు, మూడు నెలల్లో ప్రారంభించనున్నట్లు సమాచారం. కేంద్ర ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ రూపొందించిన ఈ ప్రణాళిక ఎలక్ట్రానిక్ విడిభాగాలు ప్రోత్సాహకాలకు అర్హమైనవిగా గుర్తించింది.

ఓలా ఎలక్ట్రిక్‌లో 500 ఉద్యోగాల కోత

న్యూఢిల్లీ: ఓలా ఎలక్ట్రిక్స్ మొబిలిటీ పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా విభిన్న విభాగాల్లో, వివిధ హోదాల్లో పని చేస్తున్న 500 మందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తోంది. సెప్టెంబరులోనే ఉద్యోగాల కోత ప్రారంభమైంది. ఈ ప్రక్రియ మొత్తం ఈ నెలాఖరుకు పూర్తి కావచ్చని దీంతో సంబంధ మున్న వర్గాలు తెలిపాయి.

రూ.2,975 కోట్ల సేకరణ

జెప్టో

న్యూఢిల్లీ: తాజా రౌండ్‌లో 35 కోట్ల డాలర్ల (రూ.2,975 కోట్లు) నిధులు సమీకరించినట్టు క్విక్ కామర్స్ విభాగంలోని జెప్టో ప్రకటించింది. భారత స్టార్టప్ వ్యవస్థలో దేశీయంగా ఇంత భారీ స్థాయిలో నిధులు సమీకరించడం ఇదే ప్రథమమని తెలిపింది. మోతీలాల్ ఓస్వాల్ ప్రైవేట్ వెల్త్ విభాగం ఈ నిధుల సమీకరణ ప్రక్రియను నిర్వహించింది. హెచ్ఎన్ఐలు, కుటుంబ కార్యాలయాలు, అగ్రగామి ఆర్థిక సంస్థలు ఈ రౌండ్ నిధుల సమీకరణలో పాల్గొన్నాయి.

● భారత్ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదిక వుతోంది. ఈ నెల 25 నుంచి 30 వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో 2025 ఐక్యరాజ్యసమితి ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కోఆపరేటివ్స్ సదస్సును ఇఫ్కో లిమిటెడ్, ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలయెన్స్ (ఐసీఏ) నిర్వహిస్తున్నాయి. ఈ సదస్సును ప్రధాని మోదీ లాంఛనంగా ప్రారంభించనున్నారు.

● విమిలేష్ ఇండస్ట్రీస్‌లో వంద శాతం వాటాలను రూ.70 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు డిజైన్ పవర్ ఎనర్జీ లిమిటెడ్ వెల్లడించింది. ఈ కొనుగోలుతో దేశీయ ఎలక్ట్రిక్ పరిశ్రమలో కంపెనీ కార్యకలాపాలను విస్తరించే అవకాశం లభిస్తుందని తెలిపింది.

పేస్ వికెట్ బుమ్రా బుల్లెట్



నితీశ్ కుమార్ (41)





తొలి రోజే 17 వికెట్లు ఫట్

ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 67/7

భారత్ తొలి ఇన్నింగ్స్ 150

ఆకట్టుకున్న నితీశ్ కుమార్

భారత బ్యాటర్ల తీరు మారలేదు.. అంతా కలిసి సాధించింది 150 పరుగులే. ఆస్ట్రేలియా ముందు ఇదీ ఓ స్కోరేనా అనిపించింది. కానీ బ్యాటర్లు విఫలమైన చోట భారత పేసర్లు నిప్పులు చెరిగారు. వీరి ధాటికి ఆసీస్ పరుగులు కాదు కదా.. వికెట్లను కాపాడుకునేందుకే ఆపసోపాలు పడాల్సి వచ్చింది. కొత్త బంతితో బుమ్రా టాపార్డర్‌ను కట్టడి చేయగా.. అరంగేట్ర పేసర్ హర్షిత్‌తో పాటు సిరాజ్ సైతం ఆకట్టుకున్నాడు. దీంతో ఆతిథ్య జట్టు 67 పరుగులకే 7 వికెట్లు కోల్పోవడంతో.. మన స్వల్ప స్కోరే వారికి కొండంతలా కనిపిస్తోంది. ఓవరాల్‌గా పెర్త్ స్టేడియంలో ఆరంభ రోజే ఇరు జట్ల బౌలర్ల ధాటికి ఏకంగా 17 వికెట్లు నేలకూలడం విశేషం.

పెర్త్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ అత్యంత ఆసక్తికరంగా ఆరంభమైంది. పర్యాటక భారత్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేశామనే ఆనందంలో ఉన్న ఆస్ట్రేలియాకు గట్టి ఝలక్ తగిలింది. పేసర్ బుమ్రా (4/17) తన పదునైన బౌలింగ్‌తో ఆ జట్టును ఉక్కిరిబిక్కిరి చేశాడు. దీంతో తొలిరోజు శుక్రవారం టీమిండియాదే ఆధిపత్యం కనిపించింది. ఆఖరి సెషన్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 27 ఓవర్లలో 7 వికెట్లకు 67 పరుగులు చేసింది. జట్టులో ఎవరూ కనీసం 20 పరుగులు చేయకపోవడం గమనార్హం. క్రీజులో క్యారీ (19 బ్యాటింగ్), స్టార్క్ (6 బ్యాటింగ్) ఉన్నారు. సిరాజ్‌కు రెండు, హర్షిత్‌కు ఓ వికెట్ దక్కింది. అంతకుముందు భారత్ కూడా తడబడి తొలి ఇన్నింగ్స్‌లో 49.4 ఓవర్లలో 150 పరుగులకే కుప్పకూలింది. నితీశ్ కుమార్ (41) టాప్ స్కోరర్ కాగా, పంత్ (37), రాహుల్ (26) పర్వాలేదనిపించారు. హాజెల్‌వుడ్‌కు 4.. మార్ష్, స్టార్క్, కమిన్స్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆసీస్ ఇంకా 83 పరుగులు వెనుకంజలో ఉండడం గమనార్హం. అందుకే నేటి తొలి సెషన్ ఆరంభంలోనే ఆతిథ్య టీమ్‌కు చెక్ పెట్టాలి. అనంతరం రోజంతా బ్యాటింగ్ చేయగలిగితే భారత్ పటిష్ట స్థితిలో నిలుస్తుంది. ఈ మ్యాచ్‌లో భారత్ నుంచి నితీశ్, హర్షిత్.. ఆసీస్ నుంచి మెక్‌స్వీనే అరంగేట్రం చేశారు.

తడబాటుతో ఆరంభం: స్టేడియం ట్రాక్ రికార్డును అనుసరించి టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. కానీ ఆసీస్ పేసర్ల కట్టుదిట్టమైన బంతులకు పరుగులు అంత సులువుగా రాలేదు. ఆరంభంలో హాజెల్‌వుడ్, స్టార్క్ బెంబేలెత్తించారు. అయితే పంత్‌కు జతగా నితీశ్ ఎదురొడ్డి నిలిచి జట్టు పరువు కాపాడారు. ఓపెనర్ రాహుల్ వినహా టాపార్డర్‌లో జైస్వాల్, దేవ్‌దత్ డకౌట్లుగా వెనుదిరిగారు. ఇక విరాట్ (5) పేలవ ఫామ్ ఇక్కడా కొనసాగింది. రాహుల్ మాత్రం పట్టుదలగా క్రీజులో నిలిచాడు. భారీ స్కోరు చేస్తాడనిపించినా వివాదాస్పద రీతిలో వెనుదిరిగాడు. ఆ తర్వాత పంత్ ఓపిగ్గా క్రీజులో నిలవగా జురెల్ (11), సుందర్ (4)లను మార్ష్ పెవిలియన్‌కు చేర్చాడు.

వహ్వా.. నితీశ్: ఎనిమిదో నెంబర్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ అంచనాలకు విుంచి రాణించాడు. అతడు క్రీజులోకి వచ్చే సమయానికి భారత స్కోరు 73/6. ఈ సమయంలో జట్టు కనీసం వంద పరుగులైనా చేయగలుగుతుందా? అనిపించింది. కానీ ఎటాకింగ్ ఆటతీరుతో పాటు చక్కటి డిఫెన్స్‌తోనూ శభాష్ అనిపించుకున్నాడు. ముఖ్యంగా టాప్ స్పిన్నర్ లియోన్‌ను సైతం సులువుగా ఎదుర్కొంటూ రివర్స్ స్వీప్ షాట్లతో ఫోర్లు బాదడం హైలైట్‌గా నిలిచింది. అలాగే స్టార్ పేసర్లు హాజెల్‌వుడ్, కమిన్స్, స్టార్క్ బౌలింగ్‌ను సైతం దీటుగా ఎదుర్కొన్నాడు. కమిన్స్ బౌలింగ్‌లో అతడి అప్పర్ కట్ సిక్సర్ చూడాల్సిందే. ఇక పంత్-నితీశ్ జోడీ నిలకడతో భారత్ కుదురుకుంటున్నట్టే కనిపించింది. కానీ పంత్‌ను కమిన్స్ అవుట్ చేయడంతో ఏడో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత వికెట్లు పడుతుండడంతో కమిన్స్ ఓవర్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన నితీశ్ చివరివికెట్‌గా వెనుదిరిగాడు.

దెబ్బతీసిన బుమ్రా: చివరి సెషన్‌ను జాగ్రత్తగా ముగిద్దామనుకున్న ఆసీస్‌ను ఏకంగా ఏడు వికెట్లతో భారత పేసర్లు చావుదెబ్బ తీశారు. ముఖ్యంగా బుమ్రా టాపార్డర్ పనిబట్టాడు. లబుషేన్ దాదాపు తొమ్మిది ఓవర్లపాటు క్రీజులో నిలిచినా అతడు చేసింది రెండు పరుగులే. స్టార్ బ్యాటర్లంతా ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంతో 38 పరుగులకే సగం వికెట్లను కోల్పోయింది. ఓపెనర్ మెక్‌స్వీనే (10) వికెట్‌ను డీఆర్ఎస్ ద్వారా సాధించిన బుమ్రా.. ఆ తర్వాత ఒకే ఓవర్‌లో ఖవాజా (8), స్మిత్ (0)లను అవుట్ చేశాడు. విుడిలార్డర్‌ను కుదురుకోనీయకుండా సిరాజ్, రాణా చూసుకున్నారు. దీంతో 59/7 స్కోరుతో ఆసీస్ పీకల్లోతు కష్టాల్లో పడింది.

1 ఆసీస్ గడ్డపై తొలి రోజే టెస్టులో 17 వికెట్లు నేలకూలడం 72 ఏళ్లలో ఇదే తొలిసారి. 1952లో చివరిసారి ఇలా జరిగింది.

2 స్మిత్‌ను టెస్టుల్లో గోల్డెన్ డకౌట్ చేసిన రెండో బౌలర్‌గా బుమ్రా. 2014లో స్టెయిన్ తొలి బంతికే అవుట్ చేశాడు.

2 1980 తర్వాత తమ సొంత గడ్డపై 40 పరుగుల్లోపే టాప్-5 వికెట్లు కోల్పోవడం ఆసీస్‌కిది రెండోసారి. 2016లో దక్షిణాఫ్రికాపై 17/5 స్కోరుతో నిలిచింది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మెక్‌స్వీనే (బి) స్టార్క్ 0; రాహుల్ (సి) క్యారీ (బి) స్టార్క్ 26; పడిక్కళ్ (సి) క్యారీ (బి) హాజెల్‌వుడ్ 0; కోహ్లీ (సి) ఖవాజా (బి) హాజెల్‌వుడ్ 5; పంత్ (సి) స్మిత్ (బి) కమిన్స్ 37; జురెల్ (సి) లబుషేన్ (బి) మార్ష్ 11; సుందర్ (సి) క్యారీ (బి) మార్ష్ 4; నితీశ్ (సి) ఖవాజా (బి) కమిన్స్ 41; హర్షిత్ (సి) లబుషేన్ (బి) హాజెల్‌వుడ్ 7; బుమ్రా (సి) క్యారీ (బి) హాజెల్‌వుడ్ 8; సిరాజ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 49.4 ఓవర్లలో 150 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-5, 2-14, 3-32, 4-47, 5-59, 6-73, 7-121, 8-128, 9-144, 10-150; **బౌలింగ్:** స్టార్క్ 11-3-14-2; హాజెల్‌వుడ్ 13-5-29-4; కమిన్స్ 15.4-2-67-2; లియోన్ 5-1-23-0; మార్ష్ 5-1-12-2.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఖవాజా (సి) విరాట్ (బి) బుమ్రా 8; మెక్‌స్వీనే (ఎల్బీ) బుమ్రా 10; లబుషేన్ (ఎల్బీ) సిరాజ్ 2; స్మిత్ (ఎల్బీ) బుమ్రా 0; హెడ్ (బి) హర్షిత్ 11; మార్ష్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 6; క్యారీ (బ్యాటింగ్) 19; కమిన్స్ (సి) పంత్ (బి) బుమ్రా 3; స్టార్క్ (బ్యాటింగ్) 6; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 27 ఓవర్లలో 67/7; వికెట్ల పతనం:** 1-14, 2-19, 3-19, 4-31, 5-38, 6-47, 7-59; **బౌలింగ్:** బుమ్రా 10-3-17-4; సిరాజ్ 9-6-17-2; హర్షిత్ 8-1-33-1.

విరాట్ ఎందుకలా?

ఫామ్ కోల్పోయి ఒత్తిడిలో ఉన్న కోహ్లీ ఈసారీ నిరుత్సాహపరిచాడు. 14/2 స్కోరు దగ్గర బరిలోకి దిగిన తను క్రీజుకు బయట స్టాన్స్ తీసుకోవడం ఆశ్చర్యపరిచింది. కానీ పెర్త్‌లో ఎదురయ్యే బౌన్స్‌ను ఆడే విషయంలో విరాట్ ఈ వ్యూహం బెడిసికొట్టింది. ఫ్రంట్ ఫుట్ షాట్లతో ఆత్మవిశ్వాసంతో ఉన్నట్టు కనిపించినా.. హాజెల్‌వుడ్ తెలివైన బంతికి దొరికిపోయాడు. తను తీసుకున్న స్టాన్స్‌తో అదనపు బౌన్స్‌తో వచ్చిన డెలివరీని ఆడే విషయంలో కోహ్లీ బ్యాలెన్స్ తప్పాడు. బంతి ఎడ్జ్ తీసుకుని స్లిప్‌లో ఉన్న ఖవాజా చేతిలో పడడంతో ఐదు పరుగులకే వెనుదిరిగాడు.





రాహుల్ అవుటేనా?

ఓపెనర్ కేఎల్ రాహుల్ 23వ ఓవర్‌లో అతడు వివాదాస్పద రీతిలో వెనుదిరగాల్సి వచ్చింది. స్టార్క్ వేసిన ఆఫ్‌సైడ్ బంతిని రాహుల్ డిఫెన్స్ ఆడాలని చూశాడు. అయితే ఆసీస్ క్యాచ్ అవుట్ కోసం చేసిన అప్పీల్‌ను అంపైర్ తిరస్కరించాడు. డీఆర్ఎస్‌కు వెళ్లగా రీప్లేలో స్నికో మీటర్‌లో స్పైక్స్ రావడంతో థర్డ్ అంపైర్ అవుటైనట్టు ప్రకటించాడు. నిజానికి రాహుల్ కుడికాలి ప్యాడ్‌కు బ్యాట్ తాకింది. అలాగే బ్యాట్‌కు బాల్‌కు చిన్న గ్యాప్ ఉన్నట్టు కనిపించింది. అటు సరైన యాంగిల్స్‌లో పుటేజీ అందుబాటులో లేకపోవడం కూడా ఆసీస్‌కు కలిసివచ్చింది. మరోవైపు మాజీలు కూడా ఈ నిర్ణయాన్ని తప్పుబట్టారు.

తెలుగోడి తెగువ

ప్రపంచస్థాయి బౌలింగ్‌ను, అదీ అత్యుత్తమ పేస్‌తో బ్యాటర్లను గడగడలాడించే కంగారూల బౌలింగ్ దళాన్ని ఎదుర్కోవడం.. విరాట్ కోహ్లీలాంటి స్టార్ ఆటగాళ్లు విఫలమైన వేళ క్రీజులోకి వచ్చి పట్టుదలతో పరుగులు సాధించడం.. అందునా, అరంగేట్ర టెస్టులోనే ఈ ఘనత అందుకోవడం.. ఇలాంటి మధుర జ్ఞాపకం కెరీర్ ఆరంభంలో ఎంతమంది క్రికెటర్లకు దక్కుతుంది? కానీ, వీటన్నింటినీ 21 ఏళ్ల నితీశ్‌కుమార్ రెడ్డి తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్‌లో అద్భుత ప్రతిభతో ఆకట్టుకొని, ఇటీవల బంగ్లాదేశ్‌తో సిరీస్‌తో టీ20ల్లో అరంగేట్రం చేసిన పేస్ ఆల్‌రౌండర్ నితీశ్.. బోర్డర్ గవాస్కర్ సిరీస్ ట్రోఫీ తొలి టెస్టులో అనూహ్యంగా చోటు దక్కించుకున్నాడు. 41 (6 ఫోర్లు, 1 సిక్సర్‌తో) పరుగుల విలువైన ఇన్నింగ్స్‌తో తన రాకను ఘనంగా చాటాడు. పంత్ (37), రాహుల్ (26) తర్వాత ఈ ఇన్నింగ్స్‌లో అధిక బంతులు (59) ఎదుర్కొన్న నితీశ్ జట్టులో అందరికంటే ఎక్కువగా 69.49 స్ట్రయిక్ రేట్‌తో పరుగులు రాబట్టాడు. రిషబ్ పంత్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన అతడు జట్టు స్కోరు 150 స్కోరు వచ్చేంతవరకు ప్రత్యర్థి బౌలర్లతో దీటుగా పోరాడి ఆఖరి వికెట్‌గా వెనుదిరిగిన తీరు సర్వదా ప్రశంసనీయం.

- (ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

కల నిజమాయె..



భారత జట్టుకు ఆడడం నా చిరకాల స్వప్నం. అది ఈ ఏడాది నెరవేరినందుకు సంతోషంగా ఉంది. విరాట్ చేతుల మీదుగా టెస్టు క్యాప్‌ను స్వీకరించడం అద్భుతంగా అనిపిస్తోంది. ఇక కోచ్ గంభీర్ ఇచ్చిన సలహా కారణంగా నా ఆట మరింత మెరుగుపడింది. బౌన్సీ బంతులు ఎదురైనప్పుడు.. నీ దేశం కోసం బుల్లెట్లను స్వీకరిస్తున్నట్టుగా భావించమని చెప్పాడు. ఆ మాటలు నాలో స్ఫూర్తిని నింపాయి. అలాగే భావించి క్రీజులో పరుగులు రాబట్టాను.

- నితీశ్ కుమార్

సెమీస్‌కు సాత్విక్ జోడీ

షెన్‌జెన్ (చైనా): ఏస్ డబుల్స్ జోడీ సాత్విక్‌సాయిరాజ్/చిరాగ్ శెట్టి చైనా మాస్టర్స్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్స్‌లో ప్రవేశించింది. డబుల్స్ క్వార్టర్స్ పోరులో సాత్విక్/చిరాగ్ జంట 21-16, 21-19తో డెన్మార్క్‌కు చెందిన రెండో సీడ్ కిమ్ ఆస్ట్రప్/ఆండెర్స్ స్కారప్ జోడీని ఓడించింది. లక్ష్య సేన్ 18-21, 15-21తో మూడో సీడ్ ఆంటోన్సెన్ (డెన్మార్క్) చేతిలో ఓటమి పాలయ్యాడు

స్నేహిత్‌కు కాంస్యం



హైదరాబాద్: తెలుగు ఆటగాడు స్నేహిత్ జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పతకంతో మెరిశాడు. హరియాణాలోని పంచకులలో శుక్రవారం జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో స్నేహిత్ 2-4తో ఢిల్లీకి చెందిన పయాస్ జైన్ చేతిలో ఓటమిపాలై కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. కాగా సాథియాన్ విజేతగా నిలిచాడు.



మీడియేషన్-ఆర్బిట్రేషన్ జాతీయ సదస్సులో సీఎం రేవంత్, తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే తదితరులు

మధ్యవర్తిత్వంతో చౌకగా పరిష్కారం

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్
- మధ్యవర్తిత్వంతో కేసుల భారం తగ్గుతుంది :సీఎం
- మధ్యవర్తిత్వంతో సమర్థ పరిష్కారం: జస్టిస్ అరాదే
- మీడియేషన్-ఆర్బిట్రేషన్ జాతీయ సదస్సు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో పూర్తయ్యే మధ్యవర్తిత్వానికి(మీడియేషన్) వివాదంలో ఉన్న పక్షాలు పెద్ద పీట వేయాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ సూచించారు. ఇరు పక్షాలకు ఇది లాభదాయకమన్నారు. తమకు సౌలభ్యంగా ఉండే నిబంధనల మధ్య సమస్యను త్వరగా పరిష్కరించుకునేందుకు ఇందులో వీలు ఉంటుందని చెప్పారు. మధ్యవర్తిత్వం విఫలమైతే పెద్ద మనిషి పరిష్కారం(ఆర్బిట్రేషన్) కొనసాగుతుందన్నారు. ఈ రెండు అంశాలపై శుక్రవారం నుంచి హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, శ్రీలంక సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏహెచ్ఎండీ నవాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ, శత్రువుతో మీరు శాంతి ఒప్పందం చేసుకోవాలంటే శత్రువుతో కలిసి పని చేయాలని, ఆ క్రమంలో తనే మీ భాగస్వామి అవుతాడని నెల్సన్ మండేలా చెప్పారని ప్రస్తావించారు. మండేలా వ్యాఖ్యలు మధ్యవర్తిత్వం, పెద్ద మనిషి పరిష్కారం అంశాలకు సరిగ్గా సరిపోతాయని అన్నారు. అత్యంత క్లిష్టమైన వ్యాజ్యాలు కూడా భాగస్వామ్య ఒప్పందాలుగా మారే అవకాశాలు లేకపోలేదని వివరించారు. అంతర్జాతీయంగా మొదటి పెద్ద మనిషి పరిష్కారం ఫ్యుజి-ఐబీఎం కంపెనీల మధ్య జరిగిందన్నారు. పెద్ద మనిషి పరిష్కారం, మధ్యవర్తిత్వం విషయంలో ఎన్నో ఉపయుక్తమైన విధానాలకు ఈ కేసు మార్గం చూపిందని చెప్పారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో 1,47,513 కేసులు మధ్యవర్తిత్వంలో పరిష్కారమయ్యాయని వివరించారు. మధ్యవర్తిత్వ చట్టం చేసిన తర్వాత వెయ్యికి పైగా సుప్రీంకోర్టులోని కేసులు ప్రత్యేక లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యాయని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ వంటి కొత్త సాంకేతికతలతో హైదరాబాద్ ఇప్పుడు భవిష్యత్ సాంకేతికతల పరంగా అంతర్జాతీయ నగరంగా వెలుగొందుతోందని చెప్పారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ రంగాల్లో హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు ఉందన్నారు. ఈ గుర్తింపు కొనసాగేందుకు ప్రభావవంతమైన రీతిలో వివాద పరిష్కార యంత్రాంగం కూడా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించుకోవడానికి మధ్యవర్తిత్వం లాంటి ప్రత్యామ్నాయ పరిష్కార వ్యవస్థలు అవసరమని అన్నారు. మధ్యవర్తిత్వంతో వివాదాలు సమర్థంగా పరిష్కారం అవుతాయని తెలంగాణ హైకోర్టు సీజే అలోక్ అరాధే చెప్పారు.

డిసెంబరు 7 నుంచి సీఎం కప్ క్రికెట్ పోటీలు

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వాయిదాపడ్డ చీఫ్ మినిస్టర్ క్రికెట్ కప్ పోటీల కొత్త తేదీలను ప్రభుత్వం ప్రకటించింది. డిసెంబరు 7 నుంచి జనవరి 2 వరకు వీటిని నిర్వహించనున్నారు. డిసెంబరు 7, 8 తేదీల్లో గ్రామ పంచాయతీ స్థాయిలో, 10-12 మండల, 16-21 వరకు జిల్లా స్థాయిలో వీటిని నిర్వహిస్తారు. డిసెంబరు 27నుంచి జనవరి 2వరకు రాష్ట్ర స్థాయి పోటీలు హైదరాబాదులో నిర్వహిస్తామని ప్రభుత్వం తెలిపింది.

లగచర్ల దాడి వెనక బీఆర్ఎస్ హస్తం

- భూమి లేని 17 మంది దాడి చేసేందుకు వచ్చారు
- మీడియా సమావేశంలో కాంగ్రెస్ నిజనిర్ధారణ కమిటీ
- సీఎం రేవంత్‌కు నివేదిక అందజేత

హైదరాబాద్/పరిగి/కొడంగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడి వెనక బీఆర్ఎస్ హస్తం ఉందని కాంగ్రెస్ నిజనిర్ధారణ కమిటీ తెలిపింది. శుక్రవారం మీడియా సమావేశంలో కమిటీ ప్రతినిధులు ఎంపీ మల్లు రవి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడారు. తమ బృందం లగచర్ల గ్రామానికి వెళ్లిందని, అక్కడ రైతులతోపాటు జిల్లా కలెక్టర్‌తోనూ మాట్లాడిందని మల్లు రవి తెలిపారు. కలెక్టర్, అధికారులు రాగానే.. కొందరు తాగి వచ్చి, కర్రలతో, రాళ్లతో దాడులు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, సురేశ్, బీఆర్ఎస్ నేతలు ప్రణాళికా ప్రకారం దాడి చేయించారని, 17 మంది భూమి లేని వారు దాడి చేయడానికి అక్కడికి వచ్చారని చెప్పారు. రేవంత్ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకం కాదని, బలవంతంగా రైతుల భూములు తీసుకునే ప్రసక్తే లేదని సీఎం స్పష్టం చేశారన్నారు. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. 'కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉండి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర చేశారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌ని చంపించే ప్రయత్నం చేశారు. ప్రజా ప్రభుత్వంపై మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ దురాగతాలకు పాల్పడుతున్నారు' అని మండిపడ్డారు. అనంతరం లగచర్ల ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డికి వారు నివేదికను సమర్పించారు. ఇటు ఈ దాడి కేసులో మరో నిందితుడు మంగ్యానాయక్‌ని రిమాండ్‌కు తరలించినట్లు కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 71 మందిపై కేసులు నమోదవగా, ఇప్పటివరకు 29 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మరో 26 సమీకృత గురుకులాలు

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 26 నియోజకవర్గాల్లో సమీకృత గురుకులాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రెండో విడత కింద యంగ్ ఇండియా సమీకృత గురుకులాల భవనాలను నిర్మించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో ఆర్టీ నంబర్ 223ను శుక్రవారం విడుదల చేసింది. ఈ విడత కింద బోధన్, పెద్దపల్లి, డోర్నకల్, సత్తుపల్లి, వైరా, కోదాడ, కొత్తగూడెం, నకిరేకల్, నాగార్జునసాగర్, తాండూర్, మక్తల్, రామగుండం, నారాయణపేట, జుక్కల్, చొప్పదండి, కల్వకుర్తి, నిజామాబాద్ రూరల్, వనపర్తి, చేవెళ్ల, జగిత్యాల, వికారాబాద్, గద్వాల, ధర్మపురి, మెదక్, మేడ్చల్, ఆర్మూర్ నియోజకవర్గాలకు ఈ గురుకుల భవనాలను మంజూరు చేసింది. వీటితో కలిపి ఇప్పటివరకు 54 నియోజకవర్గాలకు ఈ భవనాలు మంజూరయ్యాయి.

రచయిత్రి పరిమళా సోమేశ్వర్ కన్నుమూత



హైదరాబాద్ సిటీ, నవంబరు22(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ సాహిత్య సృజనకారిణి, ప్రముఖ రచయిత్రి, విశ్రాంత అధ్యాపకురాలు డా. జి. పరిమళా సోమేశ్వర్ (82) ఇకలేరు. కొద్దిరోజులుగా మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్న ఆమె నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. పరిమళ స్వస్థలం కృష్ణా జిల్లా తేల్లప్రోలు. నారాయణగూడలోని న్యూసైన్స్ కాలేజీ, ప్రభుత్వ సిటీ కళాశాలల్లో రసాయనశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేశారు. మహబూబ్‌నగర్‌లోని మహిళా డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ విరమణ పొందారు. 1965లో ఆమె 'సుధారాణి' కథతో సాహిత్య సృజన ప్రారంభించారు. 'పిల్లలతో ప్రేమయాత్ర', 'తెల్లకాకులు', 'భర్తను లొంగదీసుకోవడం ఎలా?' తదితర నవలలు, 200కుపైగా కథలు, కవితలు, వ్యాసాలు రాశారు. అభ్యుదయ రచయితల సంఘం(అరసం) నగర అధ్యక్షురాలిగా కొంతకాలం ఉన్నారు. పరిమళా సోమేశ్వర్ భర్త సోమేశ్వరరావు కొంతకాలం క్రితం మరణించారు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. శనివారం మధ్యాహ్నం దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

జిల్లాల్లో నర్సింగ్ కళాశాలలు

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని 13 జిల్లాల్లో కొత్తగా 13 నర్సింగ్ కళాశాలలు మంజూరయ్యాయి. జనగాం, భూపాలపల్లి, కరీంనగర్, ఆసిఫాబాద్, నిర్మల్, రామగుండం, మెదక్, ఖుత్బుల్లాపూర్, ములుగు, నారాయణపేట్, మహేశ్వరం, వరంగల్, భువనగిరిలో కొత్త కళాశాలలను మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది.



తెలంగాణ తల్లి విగ్రహ పనులను పరిశీలిస్తున్న సీఎం రేవంత్

పనులెలా జరుగుతున్నాయ్..

- తెలంగాణ తల్లి విగ్రహ నిర్మాణ పనుల కూలీలతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): "పనులెలా జరుగుతున్నాయ్.. విగ్రహ విష్కరణకు ఇంకా కొద్దిరోజులే సమయం ఉంది. ఈ లోపు అందించేలా పనులు చేపట్టాలి" అని తెలంగాణ తల్లి విగ్రహ పనులను చేస్తున్న కూలీలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పనులు ఎక్కడివరకు వచ్చాయ్.. ఏ దశలో ఉన్నాయనే వివరాలను తెలుసుకునేందుకు సీఎం రేవంత్ శుక్రవారం సాయంత్రం విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశానికి వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ కలియతిరిగారు. ఆ సమయంలో అక్కడున్న కూలీలతో మాటకలిపి.. పనులు జరుగుతున్న తీరు సహా ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.



సీఎంతో భేటీ అయిన సౌత్ కరోలినా ప్రతినిధి

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం సౌత్ కరోలినా పార్లమెంటు సభ్యుడు జేపే ఏరియల్ మూర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై కొద్దిసేపు ముచ్చటించారు.

ప్రజా విజయోత్సవాల్లో ప్రగతి నివేదిక

ప్రతిపక్షాల విమర్శలకు అందులోనే సమాధానం.. ఏడాది పాలనలో ఏం చేశారో చెబుతారు

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఎన్నికల హామీలను కూడా అమలు చేయలేదని విమర్శిస్తున్న ప్రతిపక్షాలకు గట్టిగా సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గతేడాది డిసెంబరు 7 నుంచి ఈ ఏడాది డిసెంబరు 7 వరకు ఏడాది కాలంలో ఏమేం చేశామో రాష్ట్ర ప్రజలకు తెలపాలని నిర్ణయించింది. ప్రజా విజయోత్సవాల చివరి రోజున ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి వివరాలను 'ప్రగతి నివేదిక' రూపంలో ప్రజలకు వివరిస్తారు. ఇందుకోసం అన్ని శాఖల నుంచి ఈ ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, చేసిన ఖర్చు, గత ప్రభుత్వం చేసిన అప్పులకు చెల్లిస్తున్న వడ్డీలతో పాటు ఇంకా చెల్లించాల్సిన వడ్డీలు ఎంత అనే అన్ని వివరాలను ప్రభుత్వం సేకరిస్తోంది. ముఖ్యమైన విభాగాల నుంచి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు చేరాయి. మిగిలిన శాఖల నుంచి ఒకటి, రెండ్రోజుల్లో పూర్తి వివరాలు అందుతాయి. వాటన్నింటినీ క్రోడీకరించి నివేదిక రూపంలో విడుదల చేయనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. కాంగ్రెస్ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రముఖ గేయ రచయితలతో ప్రత్యేక పాటలను కూడా సిద్ధం చేయించారు.

ఉద్యోగాల భర్తీ

టీఎస్‌ను కేంద్రంతో మాట్లాడి టీజీగా మార్చిన దగ్గరి నుంచి, ఉద్యోగాల భర్తీ వరకు చిన్న పెద్ద విజయాలన్నీ వివరిస్తారు. డీఎస్సీ గ్రూపు పరీక్షలకు నోటిఫికేషన్ ఇవ్వడం, పరీక్షలు పెట్టడం ప్రస్తావిస్తారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, గృహలక్ష్మి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే సిలిండర్ అమలు చేస్తున్న విషయం ప్రస్తావిస్తారు.

రుణమాఫీ, హైడ్రా, మూసీ, స్కిల్ వర్సిటీ

రాష్ట్రంలో రూ.2 లక్షల లోపు వ్యవసాయ రుణమాఫీ హామీ అమల్లో భాగంగా రూ.18 వేల కోట్ల మేర రైతుల ఖాతాల్లో జమచేసిన విషయం ప్రస్తావిస్తారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ అందని రైతుల పరిస్థితిని కూడా వివరిస్తారు. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రస్తావిస్తారు. హైదరాబాద్‌లో కబ్జాలకు గురైన చెరువులు, కుంటలను కాపాడేందుకు ప్రవేశపెట్టిన హైడ్రా వల్ల కలిగే లాభాలను ప్రగతి నివేదికలో వివరిస్తారు. మూసీ పునరుజ్జీవం కోసం ప్రభుత్వం తీసుకున్న సంకల్పం, ఎందుకు అంతపెద్ద నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది? ఏం చేయబోతున్నారు? అనేది వివరిస్తారు. ఎన్నికల హామీ కానప్పటికీ "యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ" ఏర్పాటుకు పూనుకుని, క్రీడా పాలసీని తీసుకొచ్చి, సమీకృత గురుకుల భవనాలను ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని భారీ ఎత్తున చేపట్టనున్న విషయాన్ని చెబుతారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఉన్న రూ.5 లక్షల సాయాన్ని రూ.10 లక్షలకు పెంచింది ప్రస్తావిస్తారు. గత ప్రభుత్వం కొత్తగా 8 మెడికల్ కళాశాలలు ప్రకటించినా సౌకర్యాల లేమితో అనుమతులు రాని పరిస్థితుల్లో వాటిని సాధించిన విషయాన్ని గుర్తు చేస్తారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని కొలిక్కి తేవడం, దక్షిణ భాగాన్ని సొంతంగా నిర్మించతలపెట్టడం, మామునూరు విమానాశ్రయం అడ్డంకులను తొలగించడం వంటివి ప్రస్తావిస్తారు. ఏడాది విజయాలను సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఆట-పాటలతో వివరిస్తారు. ఇందుకు 570మంది సాంస్కృతిక సారథులతో కళాజాత బృందాలను సిద్ధం చేస్తోంది. జానపద గేయ రచయిత యశ్‌పాల్ బృందం రాసిన ప్రత్యేక గేయాలతో ప్రదర్శనలు నిర్వహిస్తారు. డిసెంబర్ 10వరకూ రోజుకు కనీసం 3 చోట్ల ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఇప్పటికే సాంస్కృతిక శాఖ కళాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది.

మాట నిలబెట్టుకున్నాం: సీఎంవో

తొలి ఏడాదిలోనే అర లక్ష ఉద్యోగాలను భర్తీ చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఉద్యోగాల భర్తీలో కొత్త రికార్డు నమోదు చేశామని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మొదటి ఏడాదిలోనే 53 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టినట్టు శుక్రవారం ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళించామని ప్రస్తావించింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రద్దయినవి, వాయిదా పడ్డవి అన్నింటినీ పరిష్కరించి ఫలితాలను విడుదల చేశామని గుర్తు చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించినట్టు పేర్కొంది. వార్షిక జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగ నియామకాలను నిరంతర ప్రక్రియగా మార్చామని తెలిపింది. భర్తీ చేసినవి, పోటీ పరీక్షలు పూర్తయినవి కలిపి ఇప్పటికే 53,310 పోస్టులు భర్తీ చేసినట్టు ప్రగతి నివేదికలో పేర్కొననున్నారు. టీజీపీఎస్సీ ద్వారా 3,393, వైద్య రంగంలో 6,956, పోలీసుల్లో 16,067, గురుకులాల్లో 8,304, డీఎస్సీలో 10,006, ఇతర సంస్థల ద్వారా 441, గ్రూప్-4 నియామకాలు 8,143 పోస్టులున్నాయి.

6 కంపెనీలు.. 5,260 కోట్ల పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రపంచ రాజధానిగా కొనసాగుతోంది. తాజా ఒప్పందం ఫార్మా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. రాష్ట్రంలో ఫార్మా కంపెనీలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుంది" అని సీఎం పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం గుర్తించిన గ్రీన్ ఫార్మా సిటీలో వీటికి అవసరమైన యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించనుంది.

నాలుగు నెలల్లో..

తాజా ఒప్పందాల ప్రకారం.. ఎంఎస్ఎన్ లాబోరేటరీ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌తో పాటు ఆర్అండ్‌డీ సెంటర్ నెలకొల్పనుంది. అరబిందో ఫార్మా, లారస్ ల్యాబ్స్, ఫార్ములేషన్ యూనిట్లను నెలకొల్పుతాయి. గ్లాండ్ ఫార్మా ఆర్ అండ్ డీ సెంటర్, ఇంజెక్టబుల్స్, డ్రగ్ సబ్‌స్టాన్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లను స్థాపించనుంది. డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ ఇంజెక్టబుల్, బయో సిమిలర్ల యూనిట్ ఏర్పాటు చేస్తుంది. హెటిరో ల్యాబ్స్, ఫినిష్డ్ డోస్, ఇంజెక్టబుల్ తయారీ పరిశ్రమ నెలకొల్పనుంది. మరో నాలుగు నెలల్లో ఫార్మా కంపెనీలు తమ నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా స్థలాలను కేటాయించడంతో పాటు, ఫార్మా సిటీలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా.. ఈ ఒప్పందాలతో రాష్ట్రంలో ఫార్మా పరిశ్రమ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ డైరెక్టర్ సతీష్‌రెడ్డి, లారస్ ల్యాబ్స్ ఈడీ వి.వి.రవి కుమార్, గ్లాండ్ ఫార్మా సీఈవో శ్రీనివాస్, ఎంఎస్ ల్యాబ్స్ సీఎండీ ఎంఎస్ఎన్ రెడ్డి, అరబిందో డైరెక్టర్ మదన్‌మోహన్ రెడ్డి, హెటిరో గ్రూప్ ఎండీ బి.వంశీ కృష్ణ, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



30న మహబూబ్‌నగర్‌లో రైతు దినోత్సవ సభ

- 7, 8, 9 తేదీల్లో ట్యాంక్‌బండ్‌పై వేడుకలు
- పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి
- ప్రజాపాలన విజయోత్సవాలపై సమీక్షలో డిప్యూటీ సీఎం
- ఝార్ఖండ్ ఫలితాల పరిశీలకుడిగా భట్టికి బాధ్యతలు

హైదరాబాద్/న్యూఢిల్లీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సర్కారు నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో రైతు దినోత్సవ సభను నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డులో వేడుకలను నిర్వహిస్తామన్నారు. విజయోత్సవాలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘ సమావేశం శుక్రవారం సచివాలయంలో జరిగింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క ఇందులో పాల్గొని సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో చేపట్టిన విప్లవాత్మక పథకాలు, కార్యక్రమాలపై గడపగడపకూ ప్రచారం చేయాలని చెప్పారు. ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో రైతు దినోత్సవాన్ని, డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డులో వేడుకలు, లేజర్ షో, పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని వివరించారు. ఈ మూడ్రోజుల ఉత్సవాల్లో మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. రాష్ట్రమంతటా ఈ ప్రజా విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను వినియోగించుకోవాలన్నారు. గురుకుల విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించాలన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న దాదాపు 70 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలకు జీరో వడ్డీ రుణాలు ఇప్పిస్తున్నామని, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్‌ను అందిస్తున్నామన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రభుత్వ విజయాలపై ప్రత్యేకంగా రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌లద్వారా ప్రచారం కల్పించాలన్నారు.

ఝార్ఖండ్ ఫలితాల పరిశీలకుడిగా భట్టి..

రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఫలితాలు శనివారం ప్రకటించనున్న నేపథ్యంలో ఝార్ఖండ్ ఎన్నికల ఫలితాల పరిశీలకుడిగా భట్టికి కాంగ్రెస్ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. ఆయనతో పాటు పార్టీ సీనియర్లు తన్వీర్ అన్వర్, కృష్ణ అల్లవూర్‌లను నియమించింది. ఇటు మహారాష్ట్ర ఫలితాల పరిశీలకులుగా మాజీ సీఎంలు అశోక్ గెహ్లాట్, భూపేశ్ బఘేల్, సీనియర్ నేత పరమేశ్వరకు బాధ్యతలు అప్పగించారు. కాగా, భట్టి ఝార్ఖండ్ ఎన్నికలకు పరిశీలకుడిగా కూడా పని చేసిన సంగతి తెలిసిందే.

నాగాహిల్స్‌లో కబ్జానాగులు!

(మొదటిపేజీ తరువాయి)

ఆక్రమించుకునే ప్రయత్నం చేయగా.. బాధితులు దీనిని కూడా అడ్డుకున్నారు. దీంతో ఇప్పుడు డెవలప్‌మెంట్ పేరుతో ప్లాట్లను ఆక్రమించారు. పాస్‌పుస్తకాలను బూచిగా చూపిస్తూ.. ప్లాట్లను డెవలప్‌మెంట్‌కు ఇవ్వాల్సిందేనని బెదిరిస్తున్నారు. అందులోనూ తమ ఇష్టం వచ్చినంత రేషియో మాత్రమే ఇస్తామంటున్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతూ.. అసలు యజమానులనే అందులోకి వెళ్లకుండా రౌడీలు, బౌన్సర్లతో అడ్డుకుంటున్నారు.

25 ఎకరాల్లో వెంచర్..

ముంబయి పాత జాతీయ రహదారితోపాటు రాయదుర్గం నుంచి ఓఆర్ఆర్‌కు వెళ్లే నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని 25 ఎకరాల్లో ఈ వెంచర్ ఉంది. 1991లో రాయదుర్గం పాన్‌మక్తా సర్వే నంబరు 66/3లోని 25 ఎకరాల స్థలంలో నాగాహిల్స్-2 పేరుతో నారాయణస్వామి అనే వ్యక్తి ఈ వెంచర్ చేశారు. ఇందులో 295 ప్లాట్లు చేయగా.. అన్నీ అప్పట్లోనే అమ్ముడయ్యాయి. ఇందులో ప్లాట్లు కొనుగోలు చేసిన వారంతా 1991లోనే సొసైటీగా ఏర్పడ్డారు. అయితే ప్లాట్లు కొనుగోలు చేసిన కొద్దిరోజులకే ఈ భూమిపై ప్రభుత్వానికి, ప్లాట్ల యజమానులకు మధ్య వివాదం రేగింది. ఈ భూములపై తమకు హక్కులు ఉన్నాయని ప్రభుత్వం వాదించింది. చివరకు ప్లాట్ల యజమానులకే ఈ భూమిపై హక్కులు ఉన్నాయని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. సర్కారు వాదనను సుప్రీం తిరస్కరించింది. ప్లాట్ల యజమానులకే హక్కులుంటాయన్న హైకోర్టు వాదనను సమర్థించింది. దీంతో ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్న సొసైటీ సభ్యులు సంబరపడ్డా.. ఆ సంతోషం వారికి ఎంతో కాలం నిలవలేదు. ఈ భూములపై కన్నేసిన బడా వ్యక్తులు.. గతంలో ఈ భూములమ్మిన వారి వారసులను రంగంలో దింపారు. ధరణిలో లోపాలను అడ్డుపెట్టుకుని దొడ్డిదారిన వారసుల పేరు మీద కొత్త పాస్‌బుక్‌లు జారీ చేయించారు. వాస్తవానికి వారసులుగా చెప్పుకొంటున్న వీరికి.. గతంలోనే ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ కోర్టుల్లో వ్యతిరేకంగానే



కబ్జాకు గురైన నాగాహిల్స్ వెంచర్

తీర్పులు వచ్చాయి. 2010లో వీరు దొడ్డిదారిన ఆర్వోఆర్ పాస్‌బుక్‌లు కూడా తెచ్చుకున్నారు. దీనిపై ప్లాట్ల యజమానులు ఫిర్యాదు చేయడంతో తరువాత అధికారులు వీటిని కూడా రద్దు చేశారు. ప్లాట్ల యజమానులకు వ్యతిరేకంగా కేసులు వేసిన వారికి ఇలా దారులన్నీ మూసుకుపోయాయి. అయినా ఆ భూవిని వదలని బడాబాబులు.. గత ప్రభుత్వంలోని పెద్దల సహకారంతో ధరణి ద్వారా కొత్తపాస్‌బుక్‌లు సంపాదించారు. గతంలో ఈ ప్లాట్లకు యజమానులు ఎల్ఆర్ఎస్ కోసం చేసుకున్న దరఖాస్తులను ఆమోదించి ప్లాట్లను క్రమబద్ధీకరించిన అధికారులే వీరికి పాస్‌బుక్ ఇవ్వడం గమనార్హం.

ప్రభుత్వం మారాక కొత్త వ్యూహం..

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో.. తమకు న్యాయం జరుగుతుందని ప్లాట్ల యజమానులు భావించగా.. బడాబాబులు వ్యూహం మార్చారు. ప్లాట్ల యజమానుల (సొసైటీ సభ్యుల) వద్దకు వెళ్లి మీరు ఇళ్లు నిర్మించుకుంటే అన్ని అనుమతులు రావడం కష్టమని, ఈ ప్లాట్లన్నీ తమకు డెవలప్‌మెంట్‌కు ఇస్తే ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకుని అపార్ట్‌మెంట్లు కడతామని చెప్పారు. దీనికి కొందరు సభ్యులు అంగీకరించకపోవడంతో సొసైటీలో పెద్దతలకాయలను తమవైపు తిప్పుకొని సొసైటీని నిట్టనిలువునా చీల్చారు. సొసైటీ సభ్యులంతా తమకు డెవలప్‌మెంట్ కోసం ప్లాట్లు ఇస్తున్నట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించి.. వీటి ద్వారా నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేసుకునే యత్నం చేశారు. దీనిని కొందరు తీవ్రంగా వ్యతిరేకించారు. తామే సొంత ఇళ్లు కట్టుకుంటామన్నారు. దీంతో వీరిని కూడా బెదిరించి దారిలోకి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. మాట వినని వారిని నానా ఇబ్బందులు పెడుతున్నారు. వారికి దారి లేకుండా చుట్టూ భారీ ప్లాస్టిక్ షీట్లు ఏర్పాటు చేశారు. శ్రీహిల్స్ అనే పేరుతో బోర్డులు కూడా పెట్టారు. తమ మాట వినని ప్లాట్ల యజమానులను కనీసం స్థలాలు చూసుకునేందుకు కూడా వెళ్లనివ్వడం లేదు. పైగా, గతంలో వేసిన వెంచర్లలో రోడ్లన్నీ తొలగించి చదును చేస్తున్నారు. ఏ అనుమతులు లేకుండానే లేఅవుట్‌ను పూర్తిగా తొలగించి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. గట్టిగా ప్రశ్నించిన వారిలో కొందరు రహదారికి ఆనుకుని ఉన్న పాట్ల యజమానులు ఉన్నారు. వీరి ప్లాట్లను మినహాయించి ప్రహరీ షీట్లు వేశారు. అయితే తమకు డెవలప్‌మెంట్‌కు ఇవ్వడం లేదనే కక్షతో వీరినీ ఇబ్బందులు పెడుతున్నారు. ఫుట్‌పాత్ పేరు నిర్మాణం పేరుతో గుంతలు తవ్వించారు. అడ్డుపడిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారు.

అడ్డగోలుగా బేరాలు

ధరణి పాస్‌బుక్‌లు అడ్డుపెట్టుకుని చుట్టూ ప్లాస్టిక్ షీట్లు వేసిన భూ మాఫియా.. మరోవైపు ప్లాట్ల యజమానులను బెదిరించి అతి తక్కువ రేషియో ఇస్తూ అడ్డగోలుగా డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేయించుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎక్కడైనా ప్లాట్ల డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ విషయంలో 50:50 లేదా అంత కంటే ఎక్కువ రేషియోలో ప్లాట్ల యజమానులకు ఇస్తున్నారు. దీని ప్రకారం 300 గజాల ప్లాటు ఉన్న యజమానికి కనీసం 6వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల నిర్మాణ భవనంలో ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, ఇక్కడ ప్లాట్ల యజమానులకు కేవలం 3వేల అడుగులు మాత్రమే ఇస్తున్నారు. ఇదేమంటే బెదిరింపులకు దిగుతున్నారని బాధితులు వాపోతున్నారు. ఈ సొసైటీ ప్లాట్లపై కన్నేసిన వారిలో బడా నేతలు ఉన్నారు. తెర ముందు కొందరిని పెట్టి.. వారు వెనుక ఉండి తతంగం నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో నగర, శివార్లలోని లొసుగులున్న భూములపై కొందరు బడా వ్యక్తులు కన్నేసి వాటిపై కొంత పెట్టుబడులు పెట్టి అసలు హక్కుదారులకు దక్కకుండా వివాదాలను జఠిలం చేశారు. ఇలా లిటిగేషన్ మాస్టర్ ఒకరు ఈ సొసైటీ వ్యవహారంలోనూ ముందుండి నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో పెద్దలకు సన్నిహితంగా మెలిగిన ఆయన.. ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అలాగే చక్రం తిప్పాలనే ప్రయత్నం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈయనకు ఓ ప్రముఖ కంపెనీ యజమాని ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉండి పెట్టుబడులు పెడుతుంటారనే ప్రచారం ఉంది.

తప్పుడు కేసులు

తమ దారికి రాని సొసైటీ సభ్యులను పలువిధాలుగా ఇబ్బందులు పెడుతూ తప్పుడు కేసులు కూడా బనాయించే ప్రయత్నం చేస్తున్నారు. విసిగి వేసారిన బాధితుల్లో 25 మంది హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వీరిని కూడా ఇబ్బందులు పెట్టేందుకు ఆ బడా నేతలు ప్రయత్నిస్తున్నారు. రోడ్డు పక్కనే ప్లాట్ ఉన్న ఓ వ్యక్తిపై ఇటీవలే.. రోడ్డు విస్తరణ పనుల్లో అడ్డుకుంటున్నాడని తప్పుడు కేసును జీహెచ్ఎంసీ సిబ్బంతో తప్పుడు పెట్టించారు. రోడ్డు విస్తరణ చేస్తున్న ప్రాంతంలో మొక్కలు నాటుతుండగా అడ్డుపడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో ఈ స్థలంలో 21,600 మొక్కలు నాటే యత్నం చేశామని దీనికి అడ్డుకున్నట్లు పేర్కొన్నారు. వాస్తవానికి అక్కడ మొక్కలు నాటేందుకు ఎంపిక చేసిన భూమి 47 గజాలు మాత్రమే కానీ ఇందులో 21,600 మొక్కలు నాటుతున్నట్లు అధికారులు పేర్కొనడం గమనార్హం. ప్రస్తుతం ఇక్కడ ఎంతలేదన్నా గజం రూ.2.5 లక్షల పైనే ఉంటుంది. అంటే ఈ భూముల మొత్తం విలువ దాదాపు రూ.2 వేల కోట్ల వరకు ఉంటుంది.

మధ్యాహ్న భోజనం తిన్న

20 మంది విద్యార్థులకు అస్వస్థత

» బూరుగుపల్లి ప్రభుత్వోన్నత పాఠశాలలో ఘటన

» కొత్త బియ్యమే కారణమన్న ప్రధానోపాధ్యాయుడు

గంగాధర, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో మొత్తం 205 విద్యార్థులు చదువుతుండగా శుక్రవారం 180 మంది హాజరయ్యారు. వీరు రోజూలానే శుక్రవారం మధ్యాహ్న భోజనం చేశారు. అయితే వీరిలో 17 మందికి కడుపునొప్పి రాగా, ఇంకో ముగ్గురు వాంతులు చేసుకున్నారు. దాంతో పాఠశాల సిబ్బంది వెంటనే పల్లె దవాఖానాకు సమాచారం అందించారు. వైద్యసిబ్బంది పిల్లలను పరీక్షించి చికిత్స చేశారు. విషయం తెలిసిన వెంటనే కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. కొత్త బియ్యం కావడంతో బియ్యం సరిగా ఉడకలేదని, అందుకే కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం వారంతా కోలుకున్నారని ఎవరికీ ప్రమాదం లేదని ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ తెలిపారు.

పురుగుల అల్పాహారంపై అంతర్గత విచారణ

» మహబూబ్‌నగర్ ఆస్పత్రి ఘటన, కలెక్టర్‌కు నివేదిక

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలోని పిల్లల వార్డులో అందించిన అల్పాహారంలో పురుగులు కనిపించిన ఘటనపై అధికార యంత్రాంగం స్పందించింది. ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్, ఏవో, నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎంవోతో ఓ కమిటీని ఏర్పాటు చేసి శుక్రవారం విచారణ చేపట్టింది. విచారణకు సంబంధించిన నివేదికను కమిటీ జిల్లా కలెక్టర్‌కు అందజేసింది. ఆహారాన్ని వడ్డించిన వారిలో ఓ వ్యక్తి పురుగులు ఉన్న ఫొటో తీసి ఓ నర్సుకు చూపించారని, ఆ ఫొటోను వారే ఇతరులకు పంపారని గుర్తించినట్టు సమాచారం. వారిద్దరూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా బయటి వ్యక్తులకు సమాచారం ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వారిద్దరినీ మరోసారి విచారించి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కాగా, మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాగనూరు పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థుల్లో 17 మందిని శుక్రవారం డిశ్చార్జి చేశారు. వేరే అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ విద్యార్థికి మాత్రం ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది.

సిర్పూర్(యు)లో 9.9 డిగ్రీలు

» కొనసాగుతున్న చలి తీవ్రత

» గ్రేటర్ గజగజ... పటాన్‌చెరులో 12.6 డిగ్రీలు

సిర్పూర్(యు), రంగారెడ్డి, హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. పలు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఇటీవలే సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో ఈ చలికాలంలో తొలిసారి కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకు పడిపోయిన విషయం తెలిసిందే. తాజాగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కూడా ఆ జాబితాలో చేరింది. గురువారం రాత్రి జిల్లాలోని సిర్పూర్(యు)లో అత్యల్పంగా 9.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీ మండలాల్లో చలి ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రజలు వణికిపోతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. వికారాబాద్ జిల్లా నవాబుపేటలో 11.3 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా చందన్వెల్లిలో 11.4 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు రికార్డ్ అయ్యాయి. మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 12-14 డిగ్రీలలోపే ఉష్ణోగ్రతలు ఉన్నాయి. మరోవైపు గ్రేటర్ పరిధిలో చలి ప్రభావం ఎక్కువవుతుండటంతో నగరవాసులు గజగజలాడిపోతున్నారు. శుక్రవారం పటాన్‌చెరులో అత్యల్పంగా 12.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవ్వగా రాజేంద్రనగర్‌లో 13.5 డిగ్రీల సెల్సియస్‌గా ఉంది. మరో నాలుగు రోజుల పాటు ఇదే తరహా వాతావరణం కొనసాగుతుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

సుకుమా అడవుల్లో

భారీ ఎన్‌కౌంటర్

కేంద్ర బలగాలు, మావోయిస్టుల మధ్య ఐదు గంటల పోరు.. 10 మంది మావోయిస్టుల మృతి

» ఆయుధాలు, విప్లవ సాహిత్యం స్వాధీనం

» మృతుల్లో ముగ్గురు మహిళలు

» ఆరుగురి వివరాలు గుర్తింపు

» వాళ్లపై రూ.21లక్షల రివార్డు



ఎన్‌కౌంటర్ అనంతరం నృత్యం చేస్తున్న బలగాలు

చర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ అడవుల్లో శుక్రవారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. సుకుమా జిల్లా బెజ్జి అడవుల్లో కేంద్ర బలగాలు, మావోయిస్టుల మధ్య సుమారు ఐదు గంటల పాటు సాగిన ఎదురు కాల్పుల్లో 10 మంది మావోయిస్టులు మరణించారు. మృతుల్లో దక్షిణ బస్తర్ మావోయిస్టు డివిజనల్ కమిటీ సభ్యుడు, మిలటరీ ఇన్‌చార్జి(డీవీసీఎం) మాసాతోపాటు ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. సుకుమా జిల్లా బెజ్జి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో కుంట, కిష్టారం ప్రాంత మావోయిస్టులు ఉన్నట్లు అందిన సమాచారం మేరకు బలగాలు గాలింపు చేపట్టాయి. సుకుమా జిల్లాకు చెందిన డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ కలిసి సుమారు 600 మంది ఈ గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో కొర్రాజుగూడ, భండరపర గుట్టల్లో శుక్రవారం ఉదయం బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగాయి. సుమారు ఐదు గంటల పాటు జరిగిన కాల్పుల్లో పది మంది మావోయిస్టులు మరణించగా చాలామంది పరారయ్యారని పోలీసులు చెబుతున్నారు. పరారైన వారి కోసం గాలిస్తున్నామని బస్తర్ ఐజీ సుందర్ రాజన్ తెలిపారు. ఎదురు కాల్పులు జరిగిన ప్రాంతంలో ఇన్‌సాస్, ఏకే 47, ఎస్ఎల్ఆర్, పిస్టోల్, సింగిల్‌షాట్ గన్ తుపాకులు, మందుపాతరలు, విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నామని బలగాలు ప్రకటించాయి. ఇక, మృతుల్లో ఆరుగురి వివరాలు గుర్తించామని మిగిలిన నలుగురు ఎవరనేది తెలియాల్సి ఉందని పేర్కొన్నాయి. మృతుల్లో మాసా (రూ.8లక్షల రివార్డు), మాడ్వి లక్మా (5లక్షలు), మడకం కోసి (2లక్షలు), మడకం జీతూ (2లక్షలు), కోవాసి కోసా (2లక్షలు), హంగీ (మాసా భార్య, 2లక్షలు)పై మొత్తం రూ.21లక్షల రివార్డు ఉందని తెలిపారు. ఎదురు కాల్పుల అనంతరం భద్రతా బలగాలు డీజే పాటలకు నాట్యం చేస్తూ సంబరాలు చేసుకున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరలయ్యాయి. కాగా, ఈ ఎన్‌కౌంటర్‌పై స్పందించిన ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్ బలగాలను అభినందించారు. బస్తర్ ప్రాంతంలో శాంతి, అభివృద్ధికి మళ్లీ అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు.

మావోయిస్టులకు వరుస దెబ్బలు..

మావోయిస్టు పార్టీ వరుస ఘటనలతో కుదేలైనట్లుగా కనిపిస్తోంది. ప్రతీ ఎన్‌కౌంటర్‌లో పదుల సంఖ్యలో మావోయిస్టులు మరణిస్తున్నారు. వీళ్లలో పార్టీని నడిపించే ముఖ్య నాయకులు ఉంటున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు 11 భారీ ఎన్‌కౌంటర్లు జరిగాయి. వీటిలో కాంకేర్ జిల్లాలో 29 మంది, అక్టోబరు 5న అబూజ్‌బడ్ అడవుల్లో 38 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇవి కాక మరో 9 ఘటనల్లో పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందారు. దీంతో మావోయిస్టుల ఉనికిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాగా, 2026 మార్చి నాటికి మావోయిస్టుల ఉనికి లేకుండా చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే ప్రకటించారు. దీంతో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా అడవులపై బలగాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఆయా జిల్లాల్లోని కొండపల్లి, ఇతర ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాయి. రెండు నెలల్లో సుమారు మూడు శిబిరాలు పెట్టి 5వేలకు పైగా బలగాలను మోహరించినట్టు సమాచారం. ఈ క్రమంలో మావోయిస్టులకు సహకరించే వారిని గుర్తించి అరెస్టులు చేస్తున్నారు. ఇటీవల కొండపల్లి గ్రామంలో దాదాపు 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే, మావోయిస్టులకు సరుకులు అందకుండా చేసేందుకు సంతలను కూడా అడ్డుకుంటున్నారు.

కాళేశ్వరం విచారణకు కేసీఆర్‌ను పిలవడం తథ్యం!

» 25 నుంచి అధికారుల విచారణ

» నాటి సాగునీటి మంత్రి హరీశ్‌కూ పిలుపు?

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం విచారణ ప్రక్రియలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావును తప్పనిసరిగా విచారణకు పిలిపించాలని మేడిగడ్డ బ్యారేజీ కుంగడంపై విచారణ జరుపుతున్న కమిషన్ భావిస్తోంది. విచారణ ప్రక్రియలో భాగంగా ఈ నెల 25 నుంచి సంబంధిత వ్యక్తులను పిలిచి విచారించే కార్యక్రమాన్ని పునః ప్రారంభిస్తున్నారు. రోజుకు 14 మందికి పైగా ఇంజనీర్లను విచారిస్తారు. మొత్తం 52 మందికి పైగా అధికారులకు కబురు పంపనున్నారు. తొలి దశలో ఇంజనీర్లు, ఆ తర్వాత ఐఏఎస్‌లు/మాజీ ఐఏఎస్‌లు, తెలంగాణ విద్యుత్ రంగ నిపుణుడు కంచర్ల రఘుతో పాటు కాంట్రాక్టర్లు, కాగ్ ప్రతినిధులను ప్రశ్నిస్తారు. చివరిగా కేసీఆర్, హరీశ్‌ను పిలుస్తారు. సమన్లు జారీ చేసినా విచారణకు హాజరు కాకపోతే ఏం చేయాలనే దానిపై కూడా కమిషన్ దృష్టి సారించింది. విద్యుత్ విచారణ సమయంలో కేసీఆర్‌ను విచారణకు పిలవకుండానే ఆయన కమిషన్‌కు రాసిన లేఖనే కేసీఆర్ అభిప్రాయంగా పరిగణనలోకి తీసుకున్నారు. ఆ మేరకు జస్టిస్ లోకూర్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. కాళేశ్వరం విచారణలో పలువురు అధికారులను విచారిస్తున్నపుడు కేసీఆర్, హరీశ్ పేర్లే ప్రధానంగా వినిపించాయి. కేవలం నీటి మళ్లింపు కోసం వినియోగించాల్సిన కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని ఎక్కువ కాలం నిల్వ చేయడమే కుంగుబాటుకు కారణమని, నీటి నిల్వకు ఆదేశాలు జారీ చేసింది కేసీఆర్, హరీశ్ రావులేనని విచారణలో పలువురు చెప్పారు. బ్యారేజీల నిర్మాణానికి డిజైన్లు చేసిన సమయంలో షీట్ ఫైల్స్ వినియోగించాలని నిర్ణయించగా, వాటి స్థానంలో సీకెంట్ ఫైల్స్‌ను వినియోగించారు. సీకెంట్ ఫైల్స్ దేశంలో హైడ్రాలిక్ నిర్మాణంలో ఎక్కడా వాడటం లేదని, కేవలం కాళేశ్వరం బ్యారేజీల్లో వినియోగించారని, బ్యారేజీల వైఫల్యానికి ఇది మరో కారణమని విచారణలో తేలింది. ఈ నిర్ణయం వెనుక కూడా కేసీఆర్, హరీశ్ పాత్ర ఉందని కమిషన్ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. కాళేశ్వరం బ్యారేజీలపై కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్ఎస్) నివేదికలు కూడా ప్రభుత్వానికి చేరాయి. విజిలెన్స్ విభాగం కూడా సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించింది. ఆ నివేదికను అధ్యయనం చేసి, ఇంజనీర్లు/ఐఏఎస్/మాజీ ఐఏఎస్‌లు, ప్రజా సంఘాలు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను క్రాస్ ఎగ్జామినేషన్ చేశాక కేసీఆర్, హరీశ్‌లను విచారణకు పిలుస్తారు.

ఇన్‌ఫార్మర్ల నెపంతో.. ఇద్దరి దారుణహత్య

(మొదటిపేజీ తరువాయి)

చెందిన ఉయిక రమేష్(37), అతని సోదరుడు ఉయిక అర్జున్(41)లను దారుణంగా నరికి చంపారు. వీరిలో రమేశ్ పంచాయతీ కార్యదర్శి కాగా అర్జున్ సాధారణ కూలీ. వీరిద్దరు ఒకే కుటుంబానికి చెందిన వారు. వరుసకు అన్నదమ్ములవుతారు. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లోని పెనుగోలుకు చెందిన ఈ ఇద్దరు ఆరేళ్లుగా మండల కేంద్రంలోని పెనుగోలు కాలనీలో నివాసం ఉంటున్నారు. రమేశ్ 2019 నుంచి మండలంలోని పేరూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే వీరిద్దరు పోలీసులకు సహకరిస్తూ ఇన్‌ఫార్మర్లుగా మారారని ఆరోపిస్తూ గురువారం రాత్రి 11 గంటల సమయంలో రెండు బృందాలుగా వచ్చిన ఆరుగురు మావోయిస్టులు గొడ్డళ్లు, కత్తులతో వారి ఇళ్లలోకి చొరబడి నిద్రలో ఉన్న వారిపై దాడి చేసి హతమార్చారు. పోలీస్‌స్టేషన్‌కు అరకిలోమీటరు దూరంలో ఈ సంఘటన జరిగింది. హత్యానంతరం ఘటన స్థలంలో వాజేడు- వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి శాంతక్క పేరిట లేఖలను వదిలివెళ్లారు.

బంధువుల ద్వారా తమ కదలికలు తెలుసుకుంటున్నారనే...

రమేశ్, అర్జున్‌లు... ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దులోని లంకపల్లి, ఊట్లపల్లి, ఆవుపల్లి ప్రాంతాల్లో వారి బంధువులు, సన్నిహితుల ద్వారా ఎప్పటికప్పుడు దళాల కదలికలను తెలుసుకుంటున్నారని, వన్యప్రాణుల వేట, పశువుల మేత నెపంతో అడవుల్లోకి వెళ్లే వారి ద్వారా తమ సమాచారం తీసుకొని పోలీసులకు చేరవేస్తున్నారని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు హెచ్చరించినా వినకపోవడంతో తామే ఖతం చేసినట్లు వెల్లడించారు. దాడి సమయంలో మృతుల కుటుంబ సభ్యులు తమ వారిని చంపొద్దంటూ ప్రాధేయపడినప్పటికీ... రమేష్, అర్జున్‌ల భార్యలను పక్కకు నెట్టేసి దారుణంగా చంపి మావోయిస్టులు పగ తీర్చుకున్నారు. భయంతో వణికిపోయిన చుట్టుపక్కల ఇళ్ల వారు బయటకు రావాడానికి జంకారు. అర్జున్ ఘటన స్థలంలోనే మరణించగా కొనఊపిరితో ఉన్న రమేశ్‌ను సన్నిహితులు 108లో ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా, హత్యోదంతం జరిగిన నిమిషాల వ్యవధిలోనే పోలీసులకు సమాచారం అందినా స్పందించలేదని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు మృతదేహాలను ఏటూరునాగారం ఆస్పత్రిలో ఉంచగా శుక్రవారం సాయంత్రం వరకు పోస్టుమార్టం నిర్వహించలేదని సమాచారం. ఈ జంట హత్యలపై ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ స్పందించారు. మావోయిస్టు పార్టీకి సహకరించడం లేదనే పోలీస్ ఇన్‌ఫార్మర్ ముద్ర వేసి ఈ హత్యలకు పాల్పడ్డారని తెలిపారు. ఆదివాసీ హక్కులను హరిస్తూ మావోయిస్టులు చేసిన ఈ పాశవిక హత్యపై పౌరహక్కుల సంఘాలు వెంటనే స్పందించాలని ఎస్పీ డిమాండ్ చేశారు.

బిహార్ నుంచి గన్స్.. నలుగురి అరెస్టు

ఆదిలాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బిహార్ నుంచి తుపాకులను తీసుకువస్తున్న, ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న నలుగురిని ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఏపీలోని సున్నిపేటకు చెందిన వెంకట్‌రెడ్డి గతంలో జనశక్తిలో పని చేశాడు. సూర్యాపేటలో గతంలో తన స్నేహితుడిని చంపేసిన వారిపై ప్రతీకారం తీర్చుకునేందుకు, అలాగే కర్నూలు జిల్లాలో జనశక్తి పార్టీని పునర్నిర్మించేందుకు తుపాకులను కొనుగోలు చేయాలనుకున్నాడు. ఇందుకు గాను నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన వ్యాపారి ప్రసన్న రాజును ఆర్థిక సాయం చేయాలని కోరగా అతడు అంగీకరించాడు. వెంకట్‌రెడ్డి, హేమకాంత్‌రెడ్డి కలిసి సున్నిపేటకు చెందిన దిలీప్, అతని రెస్టారెంట్‌లో పనిచేసే బిహార్‌కు చెందిన భైరవ్‌తో కలిసి ఇటీవల కాశీకి వెళ్లారు. ఆ తర్వాత భైరవ్ బిహార్‌లోని ముంగార్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి పిస్టల్స్, బుల్లెట్లను కొనుగోలు చేశాడు. వాటిని తీసుకొని దిలీప్, హేమాకాంత్‌రెడ్డి తిరిగి వస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు గురువారం రాత్రి చాందా(టీ) బైపాస్ రోడ్డు వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. నాలుగు 7.65ఎంఎం పిస్టళ్లు, 8 మ్యాగజైన్‌లు, 18 లైవ్‌రౌండ్‌లు, వారు ప్రయాణించిన కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 9 మందిపై కేసు నమోదు చేశారు. కేసులో ప్రధాన నిందితుడు వెంకట్‌రెడ్డి, ప్రసన్న రాజులను శుక్రవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. వెంకట్‌రెడ్డిపై ఇప్పటికే మూడు హత్య కేసులు, హత్యాయత్నం కేసు, నాలుగు జనశక్తికి సంబంధించిన కేసులు, రెండు టాడా కేసులు.. ఇలా మొత్తం 10కేసులున్నట్లు పోలీసులు తెలిపారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor:* **N.Rahul Kumar.** *Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741,* **Managing Director : Vemuri Radha Krishna** *Founder: K.L.N.Prasad.*